శభాష్ శుక్లా..!

- ఫైళ్ల పరిష్కారంలో కలెక్టర్ హిమాన్షు వేగం
- 17 గంటలకో ఫైల్ క్లియర్...
- మూడు నెలల్లో 682 దస్త్రాలకు 628 క్లియరెన్స్
- రాష్ట్ర స్థాయిలో రెండో స్థానం.. సీఎం అభినందన

నెల్లూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వివిధ శాఖల నుంచి వచ్చే ఫైళ్లను వేగంగా క్లియర్ చేయడంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా దూకుడుగా ఉన్నారు. తన వద్దకు ఫైల్ వచ్చిన 24 గంటల్లోనే ఆ ఫైలను చూడడం, డిస్పోస్ చేయడం చేసేస్తున్నారు. ఫైళ్లను పెండింగ్ పెట్టకుండా సరాసరి 17 గంటల్లోనే తనకు వచ్చే ఫైల్‌ను తిరిగి పంపుతున్నారు. ఈ పనితీరుతో రాష్ట్రంలోనే ఫైళ్లను వేగంగా క్లియర్ చేస్తున్న కలెక్టర్ల జాబితాలో హిమాన్షు శుక్లా రెండో స్థానంలో నిలిచారు. ఈ-ఆఫీస్ ఫైళ్ల క్లియరెన్స్, డిస్పోజల్‌కు సంబంధించి గత మూడు నెలల రిపోర్ట్‌ను ఐటీ శాఖ విడుదల చేసింది. ఇందులో మంత్రులు, సెక్రటరీలు, కలెక్టర్లు, జేసీ ఎంత సమయంలోపు ఫైళ్లను క్లియర్ చేస్తున్నారన్నది స్పష్టం చేసింది. గత మూడు నెలల్లో కలెక్టర్ శుక్లా లాగిన్‌కు 682 ఫైళ్లు రాగా, మంగళవారానికి 628 ఫైళ్లను క్లియర్ చేశారు. ఇక జేసీ మొగిలి వెంకటేశ్వర్లు ఫైల్‌ను సరాసరి రెండు రోజుల 10 గంటల్లో డిస్పోజ్ చేస్తున్నారు. తన వద్దకు ఈ మూడు నెలల్లో 1163 ఫైళ్లు రాగా, మంగళవారానికి 976 ఫైళ్లను క్లియర్ చేశారు. ఇక జిల్లా మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డిలకు సంబంధించి పూర్తి రిపోర్ట్ కూడా విడుదల చేశారు. మంత్రి నారాయణ ఇప్పటి వరకూ 2500 ఫైళ్లను డిస్పోజ్ చేశారు. సరాసరి మూడు రోజుల 8 గంటల్లో ఫైల్‌ను క్లియర్ చేస్తున్నారు. మరో మంత్రి ఆనం ఇప్పటి వరకూ 803 ఫైళ్లను డిస్పోజ్ చేశారు. సరాసరి 5 రోజుల 19 గంటల్లో ఫైల్‌ను క్లియర్ చేశారు. ఈ క్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలెక్టర్ శుక్లాను అభినందించారు.



తొలిరోజు టెట్ ప్రశాంతం

జిల్లాలో 677 మంది హాజరు

నెల్లూరు (విద్య), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎంపిక చేసిన ఆరుకేంద్రాల్లో తొలిరోజు బుధవారం టీచర్స్ ఎలిజిబులిటీ టెస్ట్ (టెట్)ను ప్రశాంతంగా నిర్వహించారు. మొత్తం 709 మంది దరఖాస్తు చేసుకోగా, 677 మంది హాజరయ్యారు. 32 మంది గైర్హాజరయ్యారని డీఈవో బాలాజీరావు తెలిపారు. ఈనెల 21 వరకు జరిగే ఈ పరీక్షకు అభ్యర్థులు వారికి కేటాయించిన తేదీల్లో ఉదయం 9.30 నుంచి మధ్యా హ్నం 12 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే రెండో సెషన్‌కు హాజరు కావాల న్నారు. పరీక్షకు రెండు గంటల ముందుగా కేంద్రానికి చేరుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని డీఈవో తెలిపారు.



నెల్లూరులో పరీక్ష రాసి వస్తున్న అభ్యర్థులు

ఇసుక భారం..
ఇంకెంత కాలం?



నెల్లూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న సామెతగా, వాతావరణం సహకరించినా సామాన్యులపై మాత్రం ఇసుక భారం తగ్గలేదు. ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీని అమలు చేస్తున్నా, ఆ ఫలాలు ప్రజలకు పూర్తిగా అందడం లేదు. ప్రభుత్వం చేపట్టిన ఐవీఆర్ఎస్ సర్వేలోనే ఈ విషయం స్పష్టమైంది. ఇసుక ధరలపై జిల్లాలో 50.40 శాతం మంది మాత్రమే సంతృప్తి వ్యక్తం చేయగా, 49.60 శాతం మంది అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉచిత ఇసుక పాలసీ అమల్లో రాష్ట్రంలోని అన్నీ జిల్లాలతో పోలిస్తే చిట్టచివర నుంచి రెండో స్థానంలో జిల్లా నిలవడం చర్చనీయాంశంగా మారింది.

అంతా గూడుపుఠాణి

వినియోగం ఎక్కువగా ఉండే నెల్లూరు, కావలి ప్రాంతాలకు నెల్లూరు నగరానికి సమీపాన ఉన్న ఇసుక రీచ్‌లే ఆధారం. ప్రస్తుతం పోతిరెడ్డిపాలెం వద్ద డీసిల్టింగ్ పాయింట్ ఉండగా, పక్కనే మినగల్లు, పల్లిపాలెంలో ఓపెన్ రీచ్‌లు ఉన్నాయి. అయితే ఒక్క పోతిరెడ్డిపాలెం వద్ద స్టాక్ పాయింట్‌లోనే ఇసుక విక్రయాలు చేస్తున్నారు. మినగల్లు, పల్లిపాలెం ఓపెన్ రీచ్‌లను ఆపరేట్ చేయడం లేదు. ఈ రెండూ ఓపెన్ చేస్తే పోతిరెడ్డిపాలెం స్టాక్ పాయింట్ వద్ద విక్రయాలు తగ్గిపోతాయన్న భయంతోనే వ్యాపారులు గూడుపుఠాణిగా మారారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం పోతిరెడ్డిపాలెం స్టాక్ పాయింట్ వద్ద టన్ను ఇసుక ధర రూ.250గా ఉంది. అంటే 30 టన్నులు తీసుకెళ్లే ట్రిప్పర్‌కు ఇసుక కొనుగోలు రూ.7500 వరకూ ఉంటోంది. అదే మినగల్లు, పల్లిపాలెం ఓపెన్ రీచ్లలో అయితే టన్ను ధర రూ.58 గా ఉంది. ఈ లెక్కన చూసుకుంటే ట్రిప్పర్ ఇసుక కొనుగోలు రూ.1740 మాత్రమే ఉంటుంది. అంటే స్టాక్ పాయింట్‌కు, ఓపెన్ రీచ్‌లకు మధ్య వ్యత్యాసం ఒక ట్రిప్పర్‌కు సుమారు రూ.5,500 వరకూ ఉంటోంది. ఈ అధిక ధరే ప్రజలకు భారంగా మారింది.

● **భారీగానే ఇసుక ధరలు**

గతవారం ఉచిత ఇసుక పథకంపై సీఎం చంద్రబాబు అధికారులతో సమీక్షించారు. జిల్లాలో సంతృప్తి శాతం బాగా తగ్గడంపై చర్చించారు. ప్రధానంగా జిల్లాలో ఇసుక వినియోగం నెల్లూరు, కావలి ప్రాంతాల్లోనే ఎక్కువగా ఉంది. రోజుకు సరాసరి మూడువేల టన్నుల ఇసుక వాడకం జరిగితే, ఈ రెండు ప్రాంతాల్లోనే రెండు వేల టన్నులకుపైగా వినియోగిస్తున్నారు. కానీ ఇక్కడ ఇసుక ధరలు భారీగా ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వంలో ట్రిప్పర్ ఇసుక రూ.20 వేలకుపైగా ఉండగా, ఉచిత ఇసుక పాలసీతో అది రూ.10 వేలోపునకు రావాలి. కానీ ఇప్పటికీ రూ.15 వేలకు తగ్గకుండా వ్యాపారులు విక్రయిస్తున్నారు.

● **ఎందుకు 'ఓపెన్' చేయరు ?**

మాన్‌సూన్ సీజన్‌లో ఇసుకకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల ప్రకారం నదుల్లో తవ్వకాలు జరిపేందుకు వీల్లేకపోవడంతో కేవలం స్టాక్ పాయింట్లలోని ఇసుకనే వినియోగించాల్సి వచ్చింది. ధర ఎక్కువైనా ప్రజలు ఈ పాయింట్లనే ఆశ్రయించారు. కానీ ఇప్పుడు మాన్‌సూన్ సీజన్ ముగిసింది. అక్టోబరు 15 నుంచి పెన్నానదిలోని ఓపెన్ ,రీచ్‌లలో నేరుగా ఇసుక తవ్వకాలు జరుపుకోవచ్చు. కానీ ఇప్పటికీ ఓపెన్ రీచ్‌లు పూర్తిస్థాయిలో ఆపరేషన్‌లోకి రాలేదు.

జిల్లాలో పల్లిపాలెం, మినగల్లు, అప్పారావుపాలెం, పీకేపాడు, విరువూరు ఓపెన్ రీచ్‌లు ఉన్నాయి. వీటిలో పీకేపాడు, విరువూరు రీచ్‌లు తెరిచినట్లు మైనింగ్ అధికారులు చెబుతున్నారు. అలానే అప్పారావుపాలెం, పల్లిపాలెం రీచ్‌లకు పర్యావరణ అనుమతులు (ఈసీ) గడువు ముగిసింది. దీంతో అక్కడ తవ్వకాలు ఆగిపోయాయి. ఈసీ ముగుస్తుందని తెలిసినా ఇన్ని రోజులు అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారో వారే చెప్పాలి. ఇక మినగల్లు రీచ్‌కు ఎలాంటి సమస్య లేకపోయినా కాంట్రాక్టర్ తవ్వకాలు మొదలుపెట్టలేదు. ఈ ప్రభావంతోనే ఇసుక ధరలు అధికంగా ఉన్నట్లు ట్రాన్స్‌పోర్టర్లు చెబుతున్నారు.

- మాన్‌సూన్ ముగిసినా తెరుచుకోని ఓపెన్ రీచ్‌లు
- అన్నీ అనుమతులున్నా మినగల్లు మూత
- అప్పారావుపాలెం, పల్లిపాలెంకు నో ఈసీ
- నెల్లూరు, కావలికి పోతిరెడ్డిపాలెం ఒక్కటే దిక్కు
- అధిక ధరలతో సామాన్యులపై ఆర్థిక భారం
- ప్రభుత్వ సర్వేలోనూ ఉచిత పాలసీపై అసంతృప్తి

ఓపెన్ చేసేందుకు చర్యలు

అప్పారావుపాలెం, పల్లిపాలెం ఓపెన్ రీచ్‌లకు ఈసీ గడువు ముగిసింది. అయితే తాజాగా ఈసీ గడువు తీసుకునేందుకు అనుమతి వచ్చింది. స్థానిక సమస్యల కారణంగా మినగల్లు రీచ్‌లో తవ్వకాలు జరపలేదని కాంట్రాక్టర్ చెబుతున్నారు. త్వరలోనే ఓపెన్ రీచ్‌ల్లో ఇసుక విక్రయాలు జరిపేలా చర్యలు తీసుకుంటాం.

- శ్రీనివాసరావు, మైనింగ్ డీడీ

నేడు విలువల విద్యా సదస్సు

● బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు హాజరు

నెల్లూరు(విద్య), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నైతికత, నిజాయితీ, సానుభూతి, బాధ్యత వంటి ప్రాథమిక విలువలు పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న విలువల విద్య(వాల్యూ ఎడ్యుకేషన్) సదస్సును నెల్లూరులో గురువారం నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో జరిగే ఈ కార్యక్రమానికి ప్రముఖ ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు హాజరై, పాఠశాల విద్యార్థులతో మాట్లాడనున్నట్లు డీఈవో డాక్టర్ బాలాజీరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే ఈ కార్యక్రమానికి ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ కృష్ణారెడ్డి, ఏఎస్‌పీడీ రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి, కలెక్టర్ హిమాన్షు శుక్లా, జిల్లా అధికారులు హాజరవుతారని ఆయ న తెలిపారు. విద్యార్థులం తా సమయానికి హాజరై క్రమశిక్షణతో కార్యక్రమంలో పాల్గొనేలా ఉపాధ్యాయులు చొరవ చూపాలని డీఈవో పేర్కొన్నారు.

గజ గజ..!!

- జిల్లాపై చలి పంజా
- కమ్ముకుంటున్న పొగ మంచు
- వణుకుతున్న ప్రజలు
- రోజురోజుకు పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- విజృంభిస్తున్న వ్యాధులు

ఆత్మకూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాపై చలి పంజా విసురుతోంది. తెల్లారేసరికి పొగ మంచు కమ్మేస్తోంది. నిన్నమొన్నటి వరకు తొలిపొద్దు నుంచే భానుడు కనిపిస్తుండగా, ఇప్పుడేమో బారెడు పొద్దెక్కినా కానరావడం లేదు. రోజురోజుకు శీతల పవనాలు ఎక్కువగా వీస్తుండడంతో ప్రజలు గజగజలాడుతున్నారు. మరోవైపు వ్యాధులు విజృంభిస్తున్నాయి.

● **పడిపోతున్న ఉష్ణోగ్రతలు**

జిల్లాలో ఉష్ణోగ్రతలు రోజురోజుకు పడిపోతున్నాయి. దీంతో చలితీవ్రతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. మధ్యా హ్నం మూడు గంటల నుంచే చలిగాలులు వీస్తున్నాయి. చలికి తట్టుకోలేక వృద్ధులు, చిన్నారులు వణికిపోతున్నారు. పల్లెల్లో కొందరైతే ఇళ్ల ముందు మంటలు వేసుకుని చలి కాచుకుంటున్నారు. మరికొందరు మంచం పక్కన నిప్పుల కుంపటి ఏర్పాటు చేసుకుని వెచ్చగా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. రాబోవు రోజుల్లో చలి మరింత తీవ్రంగా ఉండవచ్చని వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

● **నైట్‌షెల్టర్ల ఏర్పాటు అవసరం**

చీకటి పడగానే చలి తీవ్రత పెరుగుతుండడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి బయపడుతున్నారు. రోడ్డు పక్కన, బస్టాండ్లలో తలదాచుకునే వారి పరిస్థితి దయనీయంగా ఉంది. నెల్లూరు నగరంతోపాటు జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో రోడ్ల పక్కన, బస్, రైల్వే స్టేషన్లలో పెద్ద సంఖ్యలో అనాథలు జీవిస్తున్నారు. వారికి నైట్ షెల్టర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

● **రోడ్లను కప్పేస్తున్న మంచు**


జిల్లాలో రహదారులను మంచు దుప్పటి కప్పేస్తోంది. పొగమంచు వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. దీంతో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. కొందరు వాహనాలను రోడ్డు పక్కన నిలిపేస్తుండగా, మరి కొందరు ముందుకు సాగి ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు.

● **విజృంభిస్తున్న వ్యాధులు**

చలికాలం వల్ల వ్యాధులు ప్రబలుతున్నాయి. పసిపిల్లలు, వృద్ధులు ఎక్కువగా రోగాల బారిన పడుతున్నారు. శ్వాసకోశ వ్యాధులు ఎక్కువగా నమోదవుతున్నాయి. వృద్ధుల్లో అయితే రక్తప్రసరణ తగ్గి కాళ్లు, చేతులు చచ్చుబడే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో పిల్లలు, వృద్ధులు, ఇళ్లలోనే వెచ్చగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. కాగా మంచు ప్రజలతోపాటు పంటలకు కూడా హాని చేస్తుంది. తెగుళ్ల విస్తరిస్తుండడంతో రైతులు నష్టపోతున్నారు.

వారం రోజులుగా ఉష్ణోగ్రతలు ఇలా..

తేది	గరిష్ఠం	కనిష్ఠం
4	29	22
5	29	22
6	29	20
7	29	20
8	29	19
9	29	18
10	28	11



పంట పొలాలపై మంచు తెర



మంచు ప్రమాదకరం

చలికాలంలో ఎక్కువగా వ్యాధులు ప్రబలేఅవకాశం ఉంది. వృద్ధులు, పిల్లలు జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా శాసకోశ సంబంధిత వ్యాధులు ఉన్నవారు చలికాలంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. మధుమేహ బాధితుల్లో వ్యాధి నిరోధకశక్తి తగ్గి, పక్షవాతం, ఇతర వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. ఉబ్బసం ఉన్న వారికి చలికాలం చేటు తెస్తుంది.

- డాక్టర్ అస్మా, అర్బన్ ప్రభుత్వ వైద్యశాల, ఆత్మకూరు



కత్తితో పొడిచిన గాయాన్ని చూపుతున్న బాబు

సాయం చేసేందుకు వస్తే
కత్తితో దాడి

- వెంకటేశ్వరపురంలో రెచ్చిపోయిన ఆకతాయిలు
- ఐజీ జిల్లాలో ఉండగానే దారుణం
- పోలీసుల అదుపులో నిందితులు
- వరుస ఘటనలతో నగరవాసుల బెంబేలు

నెల్లూరు(వెంకటేశ్వరపురం) డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వెంకటేశ్వరపురం విజయ డెయిరీ ప్రాంతంలో బుధవారం సాయంత్రం ఆకతాయిలు రెచ్చిపోయారు. బైకులో వెళుతూ కింద పడిన ముగ్గురు ఆకతాయిలను పైకి లేపేందుకు ఓ వ్యక్తి వెళ్లగా, అతనిపైనే కత్తితో దాడి చేసి పరారయ్యారు. ఎట్టకేలకు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన నగరంలో సంచలనం రేపింది. నెల్లూరు నగరంలో వరుస హత్యలు,దాడులు జరుగుతున్న నేపథ్యంలో జిల్లాలో శాంతి భద్రతలు నెలకొల్పేందుకు జిల్లాకు ఐజీ వచ్చారు. ఆయన పర్యటిస్తున్న సమయంలోని ఈ సంఘటన జరిగింది. దీంతో నెల్లూరులో పరిస్థితులు ఏ విధంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. స్థానికుల కథనం మేరకు వివరాలు.. జనార్దన్‌రెడ్డి కాలనీలోని విజయ డెయిరీ ఎదురుగా నివాసం ఉంటున్న పూల బాబు బుధవారం సాయంత్రం బైక్‌పై వెళుతున్నాడు. అదే సమయంలో అటుగా సొల్యూషన్, గంజాయి సేవించిన ఆకతాయిలు ముగ్గురు ఒకే బైక్‌పై వేగంగా వస్తూ కిందపడ్డారు. గమనించిన బాబు వారిని పైకి లేపేందుకు ప్రయత్నించాడు. దీంతో వారు 'మాకేందిరా... నీవు సాయం చేసేది'.. అంటూ ముగ్గురిలో ఒకరు కత్తితో బాబు కాలుపై పొడిచాడు. భయాందోళనతో అతను పరుగులు పెడుతూ ఇంట్లోకి వెళ్లాడు.అంతటితో ఆగని వారు ఇంట్లోకి వెళ్లి మరీ దాడికి పాల్పడ్డారు. గమనించిన స్థానికులు నిలువరించేందుకు రాగా, వారిపై కూడా దాడికి యత్నించగా వారు పరుగులు తీశారు. అనంతరం వారు అక్కడ నుంచి పరారయ్యారు. సమాచారం అందుకున్న నవాబుపేట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు. ఈ మేరకు ముగ్గురు ఆకతాయిలను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



ఘటనపై వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ప్రకృతి కన్నెర్ర చేసినప్పుడు... పంటల సాగులో పెట్టుబడి పెరిగి, దిగుబడులు తగ్గి ఆశించిన ఆదాయం రానప్పుడు.... మార్కెట్‌లో మద్దతు ధర దక్కనప్పుడు.. రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తూ ప్రవేశపెట్టిన పథకం 'రైతు బంధు'. ఎంతో ప్రతిష్టాత్మకమైన ఈ పథకాన్ని గత ప్రభుత్వం గాలికొదిలేసింది. అగ్రికల్చర్ మార్కెట్ సెస్ రూపంలో ఏటా రూ.కోట్లలో ఆదాయం వస్తున్నా రైతులకు మాత్రం రుణాలు ఇవ్వలేదు. ఆ నిధులను ఇతర అవసరాలకు వినియోగించింది. దీంతో పథకం లక్ష్యం నీరుగారిపోయింది. ప్రభుత్వం మారడంతో రైతు బంధు పథకం తిరిగి ప్రారంభం అవుతుందని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

రుణమో రామచంద్రా!

- అటకెక్కిన రైతుబంధు పథకం
- వైసీపీ హయాంలో నిర్వీర్యం
- ఆశలన్నీ ప్రస్తుత ప్రభుత్వంపైనే!

నెల్లూరు (వ్యవసాయం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతు బంధు పథకం కింద మార్కెట్ యార్డు గోదాముల్లో పంట దిగుబడులను నిల్వ చేసుకోవచ్చు. ఆ విలువలో 75శాతం వరకు రైతులకు రుణంగా అందేది. గరిష్ఠంగా రూ.2లక్షల వరకు ప్రభుత్వం ఇచ్చేది. ఎంతో మంది రైతులు రుణాలు తీసుకుని పెట్టుబడి ఖర్చులకు తీసుకొచ్చిన అప్పులు తీర్చేవారు. రైతు బంధు రుణాలపై సుమారు 180 రోజుల వరకు ఎలాంటి వడ్డీ ఉండదు. రుణం పొందిన 181 నుంచి 270 రోజుల వరకు 12శాతం వడ్డీ వసూలు చేస్తారు. అప్పటి వరకు దిగుబడులు అదే గోదాములో పెట్టుకోవచ్చు. ఒకసారి రైతు బంధు పథకం పత్రం పొందితే ఐదేళ్ల వరకు వినియోగించుకోవచ్చు. సన్న, చిన్నకారు రైతులకు ఇది ఎంతో ఉపయోగపడేది. ఈ పథకానికి వైసీపీ ప్రభుత్వ మంగళం పాడింది.

● **ఐదేళ్లుగా రుణాలేవీ?**

జిల్లాలో 8 వ్యవసాయ మార్కెట్ కమిటీలు(ఏఎంసీ) ఉన్నాయి. నెల్లూరులో 5వేల మెట్రిక్ టన్నుల(ఎంటీఎస్) సామర్థ్యం కలిగిన గోదాముంది. కోవూరులో 8600 ఎంటీ ఎస్ సామర్థ్యం కలిగినవి 5, కావలిలో 22900 ఎంటీఎస్ సామర్థ్యం కలిగినవి 17, రాపూరులో వెయ్యి ఎంటీఎస్ సామర్థ్యం కలిగినది ఒకటి, ఆత్మకూరులో 2000 ఎంటీఎస్ సామర్థ్యం కలిగినవి 2, ఉదయగిరిలో 5700 ఎంటీఎస్ సామర్థ్యం కలిగినవి 6, సర్వేపల్లిలో 5050 ఎంటీఎస్ సామర్థ్యం కలిగినవి 6, కందుకూరులో 7600 ఎంటీఎస్ సామర్థ్యం కలిగిన 4 గోదాములున్నాయి. మొత్తం 43 గోదాముల్లో సుమారు 57,850 ఎంటీఎస్ దిగుబడులు నిల్వ చేసుకోవచ్చు. అయితే అందులో 11 మరమ్మతులకు గురయ్యాయి. ఆయా మార్కెట్ కమిటీలకు రూ.కోట్లలో ఆదాయం వస్తున్నా గత మూడేళ్లుగా దాదాపుగా ఈపథకం కింద రుణాలు రైతులకు అందలేదు. కేవలం మార్కెట్ సెస్సు వసూళ్లకే పరిమితమయ్యాయి. 2019-20లో నెల్లూరు, ఆత్మకూరు మార్కెట్ కమిటీలకు సంబంధించి 343 మంది రైతులకు రూ.113 కోట్లు రుణాలు అందించారు. 2020-21 నుంచి ఒక్క రూపాయి విడుదల చేయలేదు.

● **ప్రభుత్వంపైనే ఆశలు..**

2020-21 నుంచి రైతులకు అప్పటి ప్రభుత్వం రుణాలు ఇవ్వలేదు. ఈ క్రమంలో రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో రైతు బంధు పథకం కింద రుణాలు అందుతాయని అన్నదాతలు ఆశగా ఉన్నారు. ప్రస్తుతం జిల్లాకు ప్రధానమైన రబీ సీజన్ ప్రారంభమైంది. అత్యధికంగా రైతులు వరిసాగుకే ప్రాధాన్యమిస్తారు. పంట దిగుబడులు వచ్చాక మద్దతు ధర లభించక దళారులకు అమ్ముకుంటున్న పరిస్థితులు ఉన్నాయి. ఈక్రమంలో ప్రభుత్వం రైతు బంధు పథకం ద్వారా రుణాలు మంజూరు చే స్తే ధాన్యాన్ని దాచుకునే పరిస్థితి, అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకునే బాధ తప్పుతుందని పలువురు రైతులు అంటున్నారు.



ఆలయ భూమి అన్యాక్రాంతంపై నేడు సర్వే

బుచ్చిరెడ్డిపాళెం,డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): జొన్నవాడ ఆలయానికి చెందిన భూమి అన్యాక్రాంతంపై గురువారం రెవెన్యూ, సర్వే అధికారులతో సర్వే నిర్వహించనున్నట్టు బుధవారం ఆలయ ఈఓ ఏవీ శ్రీనివాసులేరెడ్డి, చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి తెలిపారు. సర్వే అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించి తదుపరి చర్యలు చేపట్టనున్నట్టు వారు తెలిపారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 12303
వెండి కిలో ధర	రూ. 191300
వెండి ఒక గ్రాము	రూ. 196.30

ఘనంగా నీలం జన్మదిన వేడుకలు


పుట్టినరోజు సందర్భంగా కేక్ పంచుతున్న మండల టీడీపీ అధ్యక్షుడు నీలం మల్లికార్జునయాదవ్

ముత్తుకూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల టీడీపీ అధ్యక్షుడు నీలం మల్లికార్జునయాదవ్ జన్మదిన వేడుకలను గొలగమూడి వెంకయ్యస్వామి ఆశ్రమ కమిటీ సభ్యులు ఈదూరు రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి నాయకులకు, కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈసందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ మండలంలో పార్టీని పటిష్టపరిచేందుకు మల్లికార్జున యాదవ్ ప్రత్యేక కృషి చేస్తున్నారన్నారు. సీనియర్ నాయకులతో కలిసి పనిచేయడంతోపాటు గ్రామాలలో యువకులను ఉత్సాహపరిచి ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నారన్నారు. జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేస్తూ పార్టీ పటిష్టతకు మరింత కృషి చేస్తానని మల్లికార్జునయాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మాచిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మండల తెలుగు యువత అధ్యక్షుడు రాగాల శివకృష్ణ, టీడీపీ నాయకులు ఇసనాక పద్మనాభరెడ్డి, నడవడి ముత్యంగౌడ్, పల్లికొండ శీనయ్య, వావిళ్ల జనార్ధన్, విజయ్‌కుమార్, గుంజి శ్రీనివాసులు, అక్కయ్యగారి ఏడుకొండలు, తిన్నెలపూడి సిద్ధు, తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు చేస్తే సహించం : నాపా


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

కొడవలూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ కరపత్రికను అడుపెట్టుకుని అసత్య ఆరోపణలు చేయడం తగదని టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడు నాపా వెంకటేశ్వర్లునాయుడు అన్నారు. మండలంలో రేగడి చెలిక గ్రామం సమీపంలో ఇఫ్కో భూముల్లో గత ప్రభుత్వంలో గ్రావెల్, మట్టి, ఇసుక, ధాన్యం వంటి మాఫియాలకు అడ్డాగా గత వైసీపీ ప్రభుత్వం రాజ్యమేలిందన్నారు. నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గం ప్రశాంతంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పల్లంరెడ్డి సురేష్‌రెడ్డి, ఏకొల్లు వంశీరెడ్డి, చెముకుల వెంకయ్య, నల్లవుల శ్రీనివాసులు, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

రేపటి అంగన్‌వాడీల ధర్నాను జయప్రదం చేయండి

తోటపల్లిగూడూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ యూనియన్ వర్కర్స్ ఈనెల 12వ తేదీన వారి సమస్యల పరిష్కారం కోసం చేయనున్న ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మారుబోయిన రాజా పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని నరుకూరు సీఐటీయూ కార్యాలయంలో బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఇందుకూరుపేట ప్రాజెక్టు పరిధిలో ఉన్న ముత్తుకూరు, టీపీగూడూరు మండలాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో పని చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది ధర్నాలో పాల్గొనాలన్నారు.

క్విజ్ పోటీల్లో విజేతలకు అభినందనలు

ముత్తుకూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మదేవం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు చిలకపాటి నిహారిక, మన్నేపల్లి చందన్ పవన్ జిల్లాస్థాయి కౌశల్ క్విజ్ ఆన్‌లైన్ కాంపిటీషన్‌లో విజేతలుగా నిలిచారు. డిసెంబరు 27వ తేదీన తిరుపతిలో జరిగే కౌశల్ రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు ఎంపికైన సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టాన్యా విద్యార్థులను అభినందించారు. ఈ విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన గైడ్ టీచర్ ఫణికుమార్‌ను, ఉపాధ్యాయులు షాయినా పర్వీన్, మహేష్‌రెడ్డి, తిరుపాల్‌ను అభినందించారు.

సాదాబైనామా భూముల క్రమబద్ధీకరణకు గడువు పొడిగింపు

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు సాదాబైనామా ద్వారా కొనుగోలు చేసిన భూముల క్రమబద్ధీకరణకు కాలపరిమితిని పొడిగిస్తూ ఉత్తర్వులు చేసినట్లు తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఈమేరకు మండలంలోని రైతులు సచివాలయాలు, మీసేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

వవ్వేరు కోఆపరేటివ్ సొసైటీకి చేరిన యూరియా

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వవ్వేరు కోఆపరేటివ్ సొసైటీకి బుధవారం 50 టన్నుల యూరియా చేరింది. మండలంలో యూరియా కొరతపై కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి బ్యాంకు చైర్‌పర్సన్ దొడ్ల విజయలక్ష్మి వివరిస్తూ లేఖ రాశారు. ఈమేరకు స్పందించిన ఎమ్మెల్యే 50 టన్నుల యూరియాను దిగుమతి చేయించారు. మరో 2రోజుల్లో రైతులకు అవసరమైన ఎరువులను బ్యాంకు ద్వారా అందజేసేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు చైర్‌పర్సన్ తెలిపారు. రైతుల తరఫున చైర్‌పర్సన్ ఎమ్మెల్యేకి ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు.

దెబ్బతిన్న రోడ్డు పరిశీలన

వెంకటాచలం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిరుమలమ్మపాళెం సమీపంలో ఇటీవల కురిసిన దిత్వా తుఫాన్ కారణంగా వరద తీవ్రత వల్ల రోడ్డు దెబ్బతింది. దీంతో బుధవారం దెబ్బతిన రోడ్డును జనసేన పార్టీ నేతలతో కలిసి ఆపార్టీ సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు పరిశీలించారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి దెబ్బతిన్న రోడ్డును త్వరితగతిన బాగు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ గుమ్మినేని వాణిభవాని నాయుడు, నేతలు సందూరి శ్రీహరి, నంద, మస్తానయ్య, అశోక్, సాగర్, యశ్వంత్, చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

రాపూరు యూటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక


సమావేశంలో మాట్లాడుతున్న అధ్యాపకురాలు విజయలక్ష్మి


రాపూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాపూరు ఎంపీఆర్ యూటీఎఫ్ భవన్‌లో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాపూరు మండల శాఖ ఆధ్వర్యంలో మండల మహాసభ, నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించిన జిల్లా కార్యదర్శి ఎన్.రమణయ్య మాట్లాడుతూ ఆర్థిక బకాయిలను ప్రభుత్వం విడుదల చేయాలని కోరారు. గౌరవాధ్యక్షుడిగా పి.హరి ప్రసాద్‌రెడ్డి, అధ్యక్షుడిగా కుంచం వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా ఎ శివసాయి, కోశాధికారిగా కెవిబి. ప్రసాద్‌లను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో పట్టపుపాలెం

- కనీస వసతులు లేక మత్స్యకారుల అవస్థలు

ముత్తుకూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేలటూరు పట్టపుపాలెంలో సమస్యలతో మత్స్యకారులు అవస్థలు పడుతున్నారు. గ్రామానికి రాకపోకలు సాగించగలిగే ఏకైక రహదారి అడుగడుగునా గుంతలతో ప్రయాణం సాగించలేని పరిస్థితి నెలకొంది. ప్రతిరోజు ఈ మార్గం గుండా పట్టపుపాలెంకి చెందిన విద్యార్థులు, ఉద్యోగులు ద్విచక్ర వాహనాలపై వెళ్లాల్సి ఉంటుంది. కొద్దిపాటి వర్షం కురిసినా ఈ గుంతలలో నీరుచేరి రహదారి మడుగులా మారుతోంది. ఎక్కడ గుంతలు ఉన్నాయో తెలియక వాహనదారులు పలుమార్లు ప్రమా దాల బారిన పడిన సంఘటనలు ఉన్నాయి. సరైన డ్రైన్లు లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తూ ఉంటుంది. గ్రామంలో కనీసం వీధిలైట్లు లేక రాత్రివేళల్లో బయట తిరగాలంటే మహిళలు, వృద్ధులు, చిన్నారులు భయపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మరోవైపు వాలిపోయిన విద్యుత్ స్తంభాలు, వేలాడుతున్న విద్యుత్ తీగలు మృత్యుపాశాలుగా మారినా పట్టించుకునే నాథుడు లేక నేలటూరు పట్టపుపాలెం వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టపుపాలెం వాసులకు కనీస వసతులు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. జెన్కో థర్మల్ కేంద్రం కోసం తమ భూములను త్యాగం చేసిన ఈ గ్రామస్థుల ఆరోగ్య పరిరక్షణ కోసం వైద్య కేంద్రం, తాగేందుకు నీరు, ఇతర వసతులు కల్పించాల్సిన థర్మల్ కేంద్ర యాజమాన్యం పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి కనీస వసతులు కల్పించాలని నేలటూరు పట్టపుపాలెం వాసులు కోరుతున్నారు.


మడుగులా మారిన రోడ్డు


వేలాడుతున్న విద్యుత్ తీగలు

రాష్ట్ర మంత్రితో ఎమ్మెల్యే సోమిరెడ్డి భేటీ

వెంకటాచలం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అమరావతిలో బుధవారం రాష్ట్ర మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామితో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి భేటీ అయ్యారు. ఈసందర్భంగా సర్వేపల్లి నియోజకవర్గంలోని ముత్తుకూరు, కోడూరు గురుకుల పాఠశాలలతో పాటు అన్ని మండలాల్లోని వసతి గృహాలకు అదనపు భవనాల నిర్మాణం, మరమ్మతులు, వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయాలని కోరారు.

కండలేరులో నీటి నిల్వ 60.42 టీఎంసీలు

రాపూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కండలేరు డ్యాం నీటి నిల్వ సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటిమట్టం 60.42 టీఎంసీలుగా ఉన్నదని ఏఈ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 1750 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో వస్తుండగా, 1050 క్యూసెక్కుల అవుట్ ఫ్లో ఉందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఉర్దూ పాఠశాల తనిఖీ

వెంకటాచలం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కసుమూరులో ఉన్న ఉర్దూ ప్రాథమిక పాఠశాలను బుధవారం జిల్లా ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి షేక్ ఖాజా మొహిద్దీన్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా రికార్డులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో మెలిగితే ఉన్నతస్థాయికి చేరుకుంటారన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు.

వైసీపీ కోటి సంతకాల సేకరణ

వెంకటాచలం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సర్వేపల్లి గ్రామంలో బుధవారం వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం స్వర్గీయ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈసందర్భంగా కోటి సంతకాల పత్రాలను ప్రదర్శించారు. అనంతరం కోటి సంతకాల పత్రాల వాహనాన్ని వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు కాకాణి పూజితమ్మతో కలిసి కాకాణి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో నేతలు కనుపూరు కోదండరామిరెడ్డి, మండల వెంకటశేషయ్య, మోహన్ నాయుడు, భాస్కర్‌నాయుడు, భాస్కర్ గౌడ్, రఘునందన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు అర్జీల వెల్లువ


ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సమస్యలపై నేతలకు అర్జీలు సమర్పిస్తున్న బాధిత ప్రజలు

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని 20వ వార్డులో బుధవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం టీడీపీ అర్బన్ అధ్యక్షుడు గుత్తా శ్రీనివాసరావు, చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, వార్డు కౌన్సిలర్ చలంచర్ల శ్రీదేవి అధ్వర్యంలో నిర్వహించారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాలిటీని అభి వృద్ధి పథంలో నడిపే లక్ష్యంతో వార్డువార్డులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రూపొందించారు. ఈమేరకు బుధవారం ఎమ్మెల్యే దత్తతు గ్రామం 20వ వార్డు రామచంద్రాపురం నుంచి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక రామచంద్రాపురం, ఇందిరమ్మ కాలనీ ప్రజలు పలు సమస్యలపై అర్జీలను నాయకులకు సమర్పించారు. ఈమేరకు సమస్యలపై నివేదికను ఎమ్మెల్యేకి సమర్పించి పరిష్కారానికి కృషి చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఎర్రటపల్లి శివకుమార్‌రెడ్డి, బుచ్చి మాజీ సర్పంచు టంగుటూరి మల్లారెడ్డి, ఎంపీ. శేషయ్య, కౌన్సిలర్ మల్లారెడ్డి, రామానాయుడు, సునీల్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కాసా శ్రీనివాసులు, అర్బన్ బీజేపీ అధ్యక్షుడు రామిశెట్టి కళ్యాణ్ పలువురు టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పవర్‌గ్రిడ్‌కు ఇచ్చిన భూములకు పరిహారం ఇవ్వాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న గిరిజనులు

మనుబోలు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాగితాలపూరు క్రాస్‌రోడ్డు వద్దనున్న పవర్‌గ్రిడ్ సంస్థకు తమ భూములు తీసుకుని ఒక్క రూపాయి పరిహారం ఇవ్వలేదంటూ యానాదుల సంక్షేమ సంఘం అధ్వర్యంలో గిరిజనులు బుధవారం తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య మాట్లాడుతూ సీతారామపురం, లక్ష్మీనరసింహపురం గిరిజనులకు చెందిన భూములను గతంలో పవర్‌గ్రిడ్ నిర్మాణంలో తీసుకుని ఒక్క రూపాయి పరి హారం గిరిజను లకు అందలేదని తెలిసిందన్నారు. విషయాన్ని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళతామన్నారు. గిరిజనులకు న్యాయం చేయాలని తహసీల్దార్‌ను కోరారు. కార్యక్ర మంలో సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ తిరువీధి సతీష్‌చంద్ర, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యల్లంపల్లి రమేష్, మహిళా అధ్యక్షురాలు చెంబేటి ఉష పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ చూపాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో నరేష్‌కుమార్

మనుబోలు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ ఈ ఏడాది కొత్తగా ప్రాథమిక స్థాయి విద్యార్థులకోసం 75రోజుల ప్రణాళికను రూపొందించిందని మండల విద్యాశాఖాధికారి నరేష్‌కుమార్ తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మండలంలోని ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలతో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమాన్ని ప్రతి ఉపాధ్యాయుడు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ చూపాలన్నారు. 12నుంచి స్పెల్‌బీ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

సబ్సిడీ విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలి


పొదలకూరు: రైతులకు విత్తనాలు అందిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి


బుచ్చిరెడ్డిపాళెం: పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న ఏడీఏ

పొదలకూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాను కారణంగా నష్టపోయిన రైతులు సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారిణి పి.సత్యవాణి సూచించారు. బుధవారం మండల పరిధిలోని మరుపూరు గ్రామంలో జిల్లాలో దిత్వా తుఫానుకు దెబ్బతిన్న నారుమడి రైతులకు 80 శాతం సబ్సిడీపై వరి విత్తనాలను అందించారు. ఈ సందర్భంగా సత్యవాణి మాట్లాడుతూ మండలంలో వరి పంట నష్టపోయిన రైతులు విత్తనాల కోసం వారి ఆధార్ కార్డు, పొలం పాసుపుస్తకంతో మీ దగ్గరలోని రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించాలన్నారు. అనంతరం మరుపూరు చాంపియన్ రైతు శ్రీనివాసులురెడ్డికి 100 శాతం రాయితీపై ముడి జింక్ 10కేజీలు, బోరాన్ 1కేజీ, 1కేజీ చిలేటెడ్, జింక్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సహాయకులు కె.శివనాయక్, పీఏసీఎస్ చైర్మన్ తలచీరు మస్తాన్‌బాబు, మండల వ్యవసాయాధికారి వి.ప్రతాప్, సొసైటీ డైరెక్టర్ మల్లికార్జునయాదవ్, నాయకులు శ్రీనివాసులురెడ్డి, కలిచేటి ప్రభాకర్ రెడ్డి, పులిపాటి వెంకటరత్నంనాయుడు, నెట్టెం పెంచలయ్య, గ్రామ వ్యవసాయ సహాయకులు శివరెడ్డి, రైతులు రమణయ్య, వెంకట సుబ్బయ్య, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

నాగమాంబాపురం, ఇస్కపాళెంలో...

● బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని నాగమాంబాపురం, ఇస్కపాళెం గ్రామాలలో మండల వ్యవసాయాధికారి శ్రీహరి అధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏడీఏ మారుతీదేవి మాట్లాడుతూ దిత్వా తుఫాను దాటికి ముంపనకు గురైన పొలాల్లోని నీటిని పూర్తిగా తొలగించి బాగా ఆరగడితే దెబ్బతిన్న వరినాట్లు పొలాలు కోలుకుంటాయని రైతులకు సూచించారు.

సబ్సిడీపై వరి విత్తనాల పంపిణీ

మండలంలో మినగల్లు, పెనుబల్లి, జొన్నవాడ గ్రామాలలో వరినాట్లు తీవ్రంగా దెబ్బతిన్న రైతులతోపాటు ఇతర గ్రామాలలో వరినాట్లు, నారుమళ్ళు దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం 80శాతం రాయితీతో పెనుబల్లి రైతు సేవా కేంద్రంలో సబ్సిడీ వరివిత్తనాలు వరి విత్తనాలు పంపిణీ చేసేందుకు సిద్ధంగా వున్నాయన్నారు. సంబంధిత రైతులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

తిరుమలమ్మపాళెంలో విత్తనాల పంపిణీ

● వెంకటాచలం: మండలంలోని తిరుమలమ్మ పాళెం గ్రామంలో బుధవారం దిత్వా తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులకు సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుడ్లూరువారిపాళెం సాగునీటి సంఘం అధ్యక్షుడు ఈపూరు సుబ్బారెడ్డి, తెలుగు రైతు విభాగం జిల్లా అధికార ప్రతినిధి పర్రి మల్లికార్జున్, టీడీపీ నేతలు దాన ఏడుకొండలు, ముంగర మణి, పేర్నిటి కొండారెడ్డి, ముంగర కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో..
నలుగురికి మూడేళ్ల జైలు

- నిందితులు తమిళనాడు, తిరుపతికి చెందినవారు

నెల్లూరు(లీగల్), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : బంగారు, వెండి దొంగతనం చేశారన్న కేసులో నేరం రుజువు కావడంతో నలుగురు నిందితులకు ఒక్కొక్కరికి మూడేళ్ల చొప్పున జైలు శిక్ష విధిస్తూ నెల్లూరు నగర మొదటి తరగతి రెండవ అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఎల్ శారదా రెడ్డి బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లూరు నగరం మనుమసిద్ధి నగర్‌కు చెందిన మద్దులూరి సోమేశ్వరి కుటుంబం ఈ ఏడాది జూలై 19న ఒంగోలులోని బంధువుల ఇంటిలో జరుగుతున్న కార్యక్రమానికి వెళ్లింది. అదేరోజు వాళ్లింట్లో రూ.10 లక్షల విలువ చేసే బంగారు, వెండి నగలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. బాధితురాలి ఫిర్యాదుతో చిన్నబజారు పోలీసులు కేసు దర్యాప్తు చేశారు. ఇదిలా ఉండా తిరుపతి జిల్లా పుత్తూరు పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో తమిళనాడు రాష్ట్రం నమక్కళ్ జిల్లా సెరుక్కలై గ్రామానికి చెందిన యం మణి అలియాస్ కోవిల్ మణి, యం సురేష్ అలియాస్ గుణ, తిరుపతి పట్టణం మంగళంకు చెందిన యస్ కుమార్, తిరుమల నగర్‌కు చెందిన ఏ మల్లికార్జున అలియాస్ మణికందన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఆ నిందితులే నెల్లూరు మనుమసిద్ధి నగర్‌లోని ఇంట్లో బంగారం, వెండి చోరీ చేశారని, భగత్‌సింగ్ కాలనీలో బైకును కూడా అపహరించారని పోలీసులు గుర్తించారు. దీంతో చిన్నబజారు స్టేషన్ సీఐ కోటేశ్వర రావు రంగంలోకి దిగి నిందితులను ప్రిజనర్ ట్రాన్స్‌ఫర్ వారెంట్ ద్వారా అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. నిందితులు నలుగురిపై చార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బీ లక్ష్మీకుమారి వాదించారు.

బస్సులో నుంచి దూకి వ్యక్తి మృతి


మృతిచెందిన సుజన్‌సంత్రా

చేజర్ల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి). చేజర్ల మండలంలోని పడమటి కండ్రిక వద్ద బుధవారం మధ్యాహ్నం బస్సులోంచి దూకి బెంగాల్‌కు చెందిన సుజన్‌సంత్రా (34) అనే వ్యక్తి మృతిచెందాడు. చేజర్ల ఎస్సై తిరుమలరావు వివరాల మేరకు.. బుధవారం మధ్యాహ్నం కుల్లూరు నుంచి నెల్లూరుకు వస్తున్న నెల్లూరు ఒకటో డిపో బస్సులో ఆదూరుపల్లి స్టాప్ వద్ద ఒక వ్యక్తి ఎక్కి నెల్లూరుకు టికెట్ తీసుకున్నాడు. పడమటి కండ్రిక గ్రామం వద్దకు బస్సు చేరుకోగా.. ఉన్నట్లుండి ఆ వ్యక్తి బస్సులోంచి కిందకు దూకేశాడు. దీన్ని గమనించిన బస్సు డ్రైవర్ వెంటనే బస్సును ఆపి 108 వాహనానికి సమాచారమిచ్చారు. సంఘటనా స్థలికి చేరుకున్న 108 వాహన సిబ్బంది ఆ వ్యక్తిని పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి జేబులో ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా ఆయన పశ్చిమ బంగా రాష్ట్రం నడియా ప్రాంతానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. మృతుడి బంధువుల కోసం ఆరా తీస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వైద్యశాలకు తరలించారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య


ఉరి వేసుకున్న అనూష

కావలి(రూరల్), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం వైకుంఠపురంలో వివాహిత అనూష(28) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికుల వివరాల మేరకు.. దిలీప్, అనూషలకు పదేళ్ల క్రితం వివాహమైంది. వైకుంఠపురంలో నివాసముంటున్నారు. దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈక్రమంలో బుధవారం ఆమె నివాసంలో చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమెకు ఇద్దరు కుమార్తెలున్నారు. రెండో పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

నెల్లూరు రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ మండలం దేవరపాళెంలో ఈ ఏడాది మార్చి 30న జరిగిన శేషయ్య హత్య కేసులో నిందితుడిగా ఉన్న అదే గ్రామానికి చెందిన బండి వెంకట రమణయ్యను బుధవారం అరెస్ట్ చేసినట్లు సీఐ వేణు తెలిపారు. అప్పట్లో శేషయ్యను చంపేసి ప్రభుత్వ పాఠశాల వద్దనున్న సంపులో మృతదేహాన్ని వేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామని, నిందితుడిని కోర్టు ద్వారా రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు

పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన వ్యక్తి అరెస్ట్

నెల్లూరు రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తనను ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని నిమ్మించి మోసం చేశాడని నెల్లూరు రూరల్ 4వ మైలుకు చెందిన ఓ బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు రూరల్ సీఐ వేణు బుధవారం తెలిపారు. పెళ్లి చేసుకుందామని నమ్మబలికి ద్రోహం చేశాడని అదే ప్రాంతానికి చెందిన షేక్ అకీబ్‌పై ఆమె ఫిర్యాదు ఇవ్వడంతో అరెస్ట్ చేసి కోర్టు ద్వారా రిమాండ్‌కు పంపామన్నారు.

వ్యాపారిని మోసగించిన వ్యక్తిపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): వ్యాపారిని మోసం చేసిన ఓ వ్యక్తిపై చిన్నబజారు పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని మన్సూర్‌నగర్‌కు చెందిన నజీర్‌బాషా రామలింగాపురంలో ఇంపోర్ట్, ఎక్స్‌పోర్ట్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. డెకరేషన్‌కు సంబంధించిన మెటీరియల్ పంపిస్తానని ఒడిశా రాష్ట్రానికి చెందిన శివబెహర్ ఈ ఏడాది జూన్‌లో నజీర్‌బాషాతో ఒప్పందం చేసుకుని రూ.23.50 లక్షలు తీసుకున్నాడు. రోజులు గడుస్తున్నా మెటీరియల్ పంపకపోగా, ఫోన్‌కూడా లిఫ్ట్ చేయకపోవడంతో మోసపోయానని గ్రహించిన నజీర్‌బాషా బుధవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ వ్యర్థాల వాహనాల పట్టివేత

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెనుబల్లి వద్ద చికెన్ వ్యర్థాలు సరఫరా చేసే 3 వాహనాలను బుచ్చి సీఐ శ్రీనివాసులురెడ్డి సిబ్బందితో దాడులు చేసి స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బెంగళూరు నుంచి మూడు వాహనాలతో చికెన్ వ్యర్థాలు తెచ్చి బుచ్చి మండలంలోని చేపల చెరువులకు సరఫరా చేస్తుండడంపై వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

డ్రంకన్ డ్రైవ్‌కు జరిమానా

కావలి(రూరల్), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కావలి రూరల్ సీఐ రాజేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం వాహన తనిఖీలు చేపట్టి మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరిచారు. వారికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 50 మందిని కోర్టుకు హాజరుపరచగా ఒక్కొక్కరికి రూ.500 చొప్పున జరిమానా విధించారు.

నిమ్మకు మద్దతు ధర దక్కేలా కలెక్టర్ చర్యలు

నెల్లూరు(వ్యవసాయం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నిమ్మ ధరలు తగ్గిన నేపథ్యంలో రైతులను ఆదుకొనేందుకు కలెక్టర్ ఇమాన్సు శుక్లా చర్యలు తీసుకొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్లో ఉద్యాన, మార్కెటింగ్‌శాఖ అధికారులతో సమీక్షించారు. జిల్లాలో 25 వేల ఎకరాల్లో పంట కాపు దశకు వచ్చిందని అధికారులు వివరించారు. తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లోనూ నిమ్మ దిగుబడులు పెరగడంతో మన కాయలకు గిరాకీ తగ్గిందన్నారు. దీనిపై స్పందించిన కలెక్టర్.. కర్నూలు, శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల కలెక్టర్లతో ఫోనులో మాట్లాడగా.. వారు సానుకూలంగా స్పందించారు. కాయలను ఆయా జిల్లాలకు తరలించి రైతులకు గిట్టుబాటు ధర వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి సుబ్బారెడ్డి, మార్కెటింగ్ శాఖ ఏడీ అనితా పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	148
స్కిన్ చికెన్	266
స్కిన్‌లెస్	290

కోడిగుడ్ల ధర (100): 670

ముగిసిన చాగంటి ప్రవచనాలు

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని టౌనుహాలులో ఐదు రోజులుగా జరుగుతున్న ప్రముఖ ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావు ఆధ్యాత్మిక ప్రవచనాలు బుధవారం ముగిశాయి. శ్రీభరద్వాజ రుద్రాభిషేక సంఘం ఆధ్వర్యంలో శంకరాచార్య కృత జగన్నాథ అష్టకంపై చాగంటి చేసిన ప్రసంగాలను భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. చివరి రోజు ప్రవచనంలో... జగన్నాథ స్వామి కూడా పరమశివుని రూపమైన శివలింగంగానే అరూపరూపిగా ఉన్నారని, అంటే స్వామి విగ్రహంకు చేతులు కాళ్లు కనపడవని, పూరి క్షేత్రంలోని ఆలయ గోపుర శిఖరంపైన ఉన్న సుదర్శన చక్రంను క్షేత్రంలోని ఎక్కడ నుంచి చూసినా మనవైపు చూసినట్లే ఉంటుందని తెలిపారు. అనంతరం నిర్వాహకులు కోటేశ్వరరావును సత్కరించారు.

నేరాల నియంత్రణకు స్పెషల్ టాస్క్‌ఫోర్స్

● జిల్లాలో ఆరు బృందాల ఏర్పాటు

నెల్లూరు(క్రైం) డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరనియంత్రణలో భాగంగా గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఆదేశాల మేరకు ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల బుధవారం జిల్లాలో ఆరు స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందానికి ఎస్ఐని ఇన్‌చార్జ్‌గా నియమించారు. జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ఐజీ ప్రత్యేక బృందాలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఐజీ మాట్లాడుతూ ప్రతి బృందం తమకు నిర్దేశించిన ప్రాంతాల్లో నేరనియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నేరాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి, ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, శివారుప్రాంతాలు, అనుమానిత ప్రాంతాల్లో కార్డన్‌సెర్చ్‌లు నిర్వహించాలని ఆదేశించారు. రాత్రివేళల్లో గస్తీని ముమ్మరం చేయాలని, లాడ్జిలు, హోటల్స్ తనిఖీలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ అజిత వేజెండ్ల, ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, రూరల్ డీఎస్పీ జీ. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందాలతో మాట్లాడుతున్న ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి

● సమస్యలు తెలుసుకోవాలి

జిల్లా పోలీసు కార్యాలయం నుంచి పోలీసు అధికారులు, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులు, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులతో జిల్లా ఎస్పీతో కలిసి ఐజీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ మారుమూల గ్రామాలలో సైతం సమస్యలను తెలుసుకోవడానికి పోలీసులకు ప్రజలకు మధ్య వారధిగా వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులు, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు ఉండాలని సూచించారు.



నగరంలో పర్యటిస్తున్న ఎస్పీ అజిత, పోలీసు అధికారులు



శాంతి భద్రతలపై ప్రజలను ప్రశ్నిస్తున్న ఎస్పీ అజిత

శాంతి భద్రతలు ఎలా ఉన్నాయి ? : ఎస్పీ

నెల్లూరు(క్రైం) డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): నగరంలో శాంతిభద్రతలు ఎలా ఉన్నాయి...పోలీసులు పనితీరు ఎలా ఉంది.. అంటూ ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల బుధవారం రాత్రి నగర ప్రజలను ప్రశ్నించారు. నగరంలో ఆమె పర్యటిస్తూ ప్రజలతో మమేకమయ్యారు. నగరంలోని కూరగాయల మార్కెట్, మురళీకృష్ణ హోటల్ నుంచి వీఆర్సీ మీదుగా గాంధీబొమ్మ వారకు ఫుట్ పెట్రోలింగ్ నిర్వహిస్తూ ప్రజలతో మాట్లాడారు. నేరాల కట్టడికి పోలీసులు తీసుకుంటున్న చర్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

డీకేడబ్ల్యూ కళాశాలలో మానవ హక్కుల దినోత్సవం

నెల్లూరు(విద్య), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పొలిటికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ ఏవీ రమణరావు విద్యార్థులకు మానవ హక్కులపై అవగాహన కల్పించారు. వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ రాంబాబు, అధ్యాపకులు డాక్టర్ వీ చెంచురామయ్య, వై జాన్‌సాహెబ్, డాక్టర్ శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా....

కళాశాలలో శుక్రవారం జేకేసీ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ డీ గిరి ఓ ప్రకటనలో తెలిపారు. డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థినులు, 2023, 24, 25 సంవత్సరాల్లో ఉత్తీర్ణులైన కళాశాల పూర్వ విద్యార్థినులు మాత్రమే మేళాలో పాల్గొనాలని పేర్కొన్నారు.

స్టేడియం వాకర్స్ సంఘం అధ్యక్షుడిగా గోవిందయ్య



నెల్లూరు(విద్య), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కూచి గోవిందయ్యను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. స్టేడియంలో బుధవారం అసోసియేషన్ కార్యవర్గ సమావేశం జరిగింది. 2026వ సంవత్సరానికి అధ్యక్షుడిని ఎన్నుకు న్నారు. గోవిందయ్య మాట్లాడుతూ సభ్యులందరి సహకారంతో స్టేడి యంలో క్రీడా, సేవా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్ర మంలో అసోసియేషన్ ప్రస్తుత అధ్య క్షుడు పోబోలు సత్యం, నేతలు కిలారి తిరుపతి నాయుడు, బాసం శేషగిరి రావు, వీ రంగారావు, దద్దోలు రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో గ్రావెల్ రోడ్లకు నిధులివ్వండి

● మంత్రి అచ్చెన్నకు గిరిధర్ విజ్ఞప్తి

నెల్లూరు రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాలలో రైతులు పొలాల్లోకి వెళ్లేందుకు గ్రావెల్ రోడ్లు వేయడానికి వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా నిధులు మంజూరు చేయాలని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడును కోరారు. ఈ మేరకు బుధవారం అమరావతిలో మంత్రిని కలిసి విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎమ్మెల్సీ బీద రవిచంద్రతోపాటు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి బాలవీరాంజనేయస్వామిని కలిశారు. నిర్మాణ దశలో నిలిచిన అంబేడ్కర్ స్టడీ సర్కిల్ భవనాన్ని పూర్తి చేయడానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం రోడ్లు, భవనాల శాఖ మంత్రి జనార్దన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పొట్టేపాళెం కలుజు వద్ద వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆ తర్వాత వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌ను కలిసి రూరల్లోని ఆమంచర్ల వద్ద 500 ఎకరాల్లో పారిశ్రామిక వాడను మంజూరు చేసి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ఎంఎస్ఎంఈ పార్కు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

కండలేరును కోల్పోతే సర్వేపల్లి నియోజకవర్గ రైతులకు నష్టం

నెల్లూరు రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : జిల్లాల విభజన వల్ల కండలేరు డ్యాంను కోల్పోతే సర్వేపల్లి నియోజకవర్గంలోని పొదలకూరు, మనుబోలు మండలాల రైతాంగానికి నష్టం వాటిల్లుతుందని బీజేపీ నాయకులు మిడతల రమేష్, సుబ్బారెడ్డి బుధవారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. వారు అల్లీపురంలోని ఎమ్మెల్యే నివాసంలో సోమిరెడ్డిని కలిశారు. విభజనతో కలిగే నష్టాలను నివారించాలని కోరుతూ వినతి పత్రం అందచేశారు. కండలేరు డ్యాం లోలెవల్, హైలెవల్ కాలువలు పారుదలపై ఆధారపడి ఉన్నాయని తెలిపారు. విభజనతో అనేక గ్రామాలు నీటి ఎద్దడిని ఎదుర్కొంటాయని చెప్పారు. జిల్లా నుంచి మండలాల విభజన జరగకుండా ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్క్‌పై రాజ్యసభలో ప్రశ్నించిన బీద



నెల్లూరు(వ్యవసాయం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఏపీలోని బాపట్ల జిల్లా దిండీ గ్రామంలో ఏర్పాటు చేయాల్సిన ఇంటిగ్రేటెడ్ ఆక్వాపార్క్ ప్రాజెక్ట్ ఆలస్యంపై రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు బుధవారం రాజ్యసభలో ప్రశ్నించాడు. స్పందించిన కేంద్ర మత్స్య పశు సంవర్ధక, పాడి పరిశ్రమలశాఖ మంత్రి రాజీవ్‌రంజన్‌సింగ్ లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. ప్రాజెక్ట్ స్థలం సేకరణ,స్వాధీనంపై ఏర్పడిపై సమస్యల కారణంగా, పనులు ఆలస్య అయ్యాయని, ఇంకా రాష్ట్ర ప్రభుత్వం తమ భాగస్వామ్య నిధులను ఇంకా విడుదల చేయకపోవడం కూడా ఆలస్యానికి కారణం అని తెలిపారు. గడువులోగా పూర్తి చేయాలని బీద కోరారు.

ఎట్టకేలకు...!

● వర్చువల్‌గా ప్రారంభించిన వైద్య మంత్రి సత్యకుమార్

● నెలాఖరుకల్లా నూతన భవనంలోకి ఉద్యోగులు : ఏడీ

ఔషధ నియంత్రణ శాఖ నూతన కార్యాలయం ప్రారంభం



నెల్లూరు (వైద్యం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నిర్మాణం పూర్తయి కొన్ని నెలలుగా ప్రారంభోత్సవానికి ఎదురుచూస్తున్న ఔషధ నియంత్రణ శాఖ కార్యాలయం ఎట్టకేలకు మంగళవారం ప్రారంభమైంది. నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రాంగణంలో ఈ భవనాన్ని నిర్మించారు. ఇందుకోసం వైద్య ఆరోగ్య శాఖ రూ.90 లక్షలు కేటాయించి ఆరు నెలల క్రితం నిర్మాణ పనులు పూర్తి చేసింది. అయితే రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వర్చువల్‌గా ఈ భవనం ప్రారంభించాల్సి ఉందంటూ ప్రారంభోత్సవాన్ని ఆలస్యం చేశారు. ఎట్టకేలకు మంగళవారం మంత్రి దీనిని ప్రారంభించారు. దీంతో 20 ఏళ్లగా అద్దె భవనంలో నిర్వహిస్తున్న కార్యాలయానికి సొంత భవనం సమకూరింది. ప్రభుత్వానికి కూడా అద్దె భారం తీరింది. ప్రస్తుతం శ్రీనివాస అగ్రహారంలో అద్దె భవనంలో ఉన్న కార్యాలయాన్ని ఈ నెలాఖరుకల్లా నూతన భవనంలోకి తరలిస్తామని ఔషధ నియంత్రణ శాఖ ఏడీ రమేష్‌రెడ్డి తెలిపారు.

దళారుల దండకం

● కూలీల కష్టం కాజేస్తున్న వైనం ● ఎకరాకు రూ. 1100 చొప్పున కమీషన్

● సీజన్ కావడంతో నోరుమెదపని రైతులు ● ఉత్తరాది నుంచి వచ్చిన వారి శ్రమదోపిడీ

రామయ్యకున్న పదెకరాల పొలంలో నారేతలు వేయాల్సి వచ్చేసింది. ఉత్తారిది నుంచి కూలీలను తీసుకువచ్చిన సాంబయ్యకు ఫోన్ చేసిన రామయ్య తనకు నారేతలకు కూలీలను పంపాలని కోరాడు. ఎకరాకు రూ. 4,600 అవుతుందని చెప్పగా, అసలే కూలీల కొరత ఉండటంతో నోరుమెదపని రామయ్య సరేనని రూ. 46 వేలు చెల్లించి నారేతలు వేయించుకున్నాడు. కానీ ఆ నగదు తీసుకున్న సాంబయ్య ఉత్తారాది నుంచి వచ్చిన కూలీలు మాత్రం ఎకరాకు రూ. 3,500 చొప్పున పదెకరాలకు రూ. 35 వేలు మాత్రమే వచ్చి మిగిలిన రూ. 11 వేలు తన కమీషన్‌గా జేబులో వేసుకున్నాడు. ఇదీ ఒక్క రామయ్య దగ్గరే కాదు ప్రతీ గ్రామంలో ఉత్తారాది నుంచి తరలివచ్చిన వ్యవసాయ కూలీల పేరిట దళారులు భారీగా కమీషన్లు దండుకుంటున్నారు.

నెల్లూరురూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా రబీ సీజన్ మొదలైంది. నారుమళ్లు 25 రోజుల కాలవ్యవధిని పూర్తి చేసుకున్నాయి. నారేతల సమయం ఆసన్నమైంది. లేటైతే నారుమళ్లు ముదిరిపోయే ప్రమాదం ఉంది. దీంతో రైతులంతా నారేతలు వేయించుకునే పనిలోపడ్డారు. నెల్లూరురూరల్లో ఈ సారి పూర్తి విస్తీర్ణంలో వరి సాగవుతోంది. అన్నీ గ్రామాలలో ఒక్కసారిగా నారేతలు అదును మొదలైంది. స్థానికంగా ఉండే కూలీలు నారేతలకు సరిపోకపోవడంతో ప్రతీ ఏటాలాగానే ఈ సారికూడా కొందరు దళారులు పశ్చిమ బంగాల్, బిహార్, శ్రీకాకుళం, విజయనగరం ప్రాంతాల నుంచి వ్యవసాయ కూలీలను గ్రామాలకు తీసుకువచ్చారు. ముందుగా కుదుర్చుకున్న అగ్రిమెంట్ ప్రకారం స్థానికంగా రోజువారీగా ఎవరికి నారేతలకు వెళ్లాలన్నది దళారులే నిర్ణయిస్తారు. వారు చెప్పిన ప్రకారం కూలీలు పనిలోకి వెళ్లాలి.



నారేతలు వేస్తున్న బెంగాల్ కూలీలు

● రోజుకు రూ. 11 వేల కమీషన్

దళారులు నారేతల సమయంలోనూ అటు కూలీలను, ఇటు రైతులను అదును చూసి ఆర్థికంగా దెబ్బకొడుతున్నారు. ఒక్కోక దళారి రోజుకు వ్యవసాయ కూలీల కష్టం పై రూ. 11 వేలు సంపాదిస్తున్నారు. ఎకరాకు రూ. 1100 కమీషన్ పెట్టుకుని రైతులను డిమాండ్ చేస్తున్న దళారులు ఉత్తారాది నుంచి వచ్చన కూలీలను తక్కువ ధరలకు నారేతలు వేయించి కమీషన్ల పేరిట భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. గ్రామాల్లో కొందరు దళారీ అవతారమెత్తి వ్యవసాయ రంగాన్ని ఆదాయ వనరుగా మలుచుకుని రైతులు, కూలీల కష్టాన్ని దోచుకుంటున్నారంటూ విమర్శలున్నాయి.

● నిస్సాహాయక స్థితిలో రైతు

తాను దోపీడీకి గురవుతున్నానని తెలిసి కూడా ఏమి చేయలేని నిస్సాహాయక స్థితిలో రైతులుండిపోతున్నారు. ఎకరా నారేతకు రూ. 4,600లు నగదు ఎక్కువే అయినా కూలీలు లేకపోవడం, అదును తప్పడం, నారుమళ్లు ముదిరిపోతుండటంతో ఏమి చెయ్యలేని పరిస్థితుల్లో అన్నదాతలు నిమ్మకుండిపోతున్నారు. ఎకరా పై రూ. 1100లు అదనంగా కూలీల పేరిట దళారులకు ఇస్తున్నామని తెలిసి ఏం చేయలేని స్థితి రైతులంది. ఇటీవల దిత్వా తుఫాను తాకిడికి నారుమళ్లు దెబ్బతినడం, వారంతా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నారు తెచ్చుకుని నారేతలకు సిద్ధం కావడంతో గత్తర పెరిగిందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

జనసేన మహిళకు ఆర్థిక సాయం

నెల్లూరు(క్రైం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలతో జనసేన వీరమహిళ టైలరింగ్ షాపు దెబ్బతినడంతో జన సేన నాయకులు ఆమెకు అండగా నిలిచారు. పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆ మహిళకు రూ.26 వేలు అందచేశారు. జనసేన కార్యకర్త సైలాఫ్ కుమారుడు కదలేని స్థితిలో ఉండటంతో అతనికి వీల్ చైర్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు గునుకుల కిషోర్, నూనె మల్లికార్జున యాదవ్, చంద్రశేఖర్‌రెడ్డి, జమీర్, హరీష్, సురేష్, గుర్రం కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

భూముల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలి

జలదంకి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్వాధీన అగ్రిమెంటుల ద్వారా 2024 జూన్ 15లోపు కొనుగోలు చేసిన భూముల క్రమబద్ధీకరణకు సచివాలయం, మీసేవా కేంద్రాల్లో సాదాబైనామ కింద దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దారు సీతామహాలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రక్రియను 2027 డిసెంబరు 31లోపు కొనసాగించేలా రాష్ట్రప్రభుత్వం కాలపరిమితిని పెంచిందని తెలిపారు.

ఆర్డీటీ కాలనీ అభివృద్ధికి రూ. 50 లక్షలు

● రెండు నెలల్లో పనులు పూర్తి : రూరల్ ఎమ్మెల్యే

నెల్లూరు రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : కల్లూరుపల్లి పరిధిలోని ఆర్డీటీ కాలనీని రూ.50 లక్షలతో అభివృద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి తెలిపారు. గంజాయి ముఠా చేతిలో హత్యకు గురైన సీపీఎం నాయకుడు పెంచలయ్య ఉత్తరక్రియల సందర్భంగా బుధవారం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్డీటీ కాలనీలో అన్నిరకాల మౌలిక సదుపాయాలు కల్పించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తామని చెప్పారు. ఈ పనులను రానున్న రెండు నెలల్లో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. గంజాయి వ్యతిరేక ఉద్యమంలో మరణించిన పెంచలయ్య ఆశ యాలను సాధిస్తామని, గంజాయి మాఫియాను కూకటివేళ్లతో పెకలిస్తామ న్నారు. ఇందుకోసం కలిసి వచ్చే రాజకీయ పార్టీలతో కలిసి పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేత మాదాల వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు అరవ శ్రీను, గంగాధర్, రాఘవేంద్ర, బీజేపీ నాయకులు రాజేష్, జనసేన నాయకుడు కిషోర్ పాల్గొన్నారు.



శిలాఫలకం ఆవిష్కరణలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

రాష్ట్ర వెటరన్ అథ్లెటిక్స్‌లో జిల్లాకు పతకాలు

నెల్లూరు (విద్య), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో బుధవారం జరిగిన కే నారాయణమ్మ మెమోరియల్ రాష్ట్ర మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు వివిధ విభాగాల్లో పాల్గొని పతకాలు సాధించారు. జిల్లా క్రీడాకారిణి ఎస్.శైలజ 45 ఏళ్ల కేటగిరి హేమర్ త్రోలో, డిస్కస్ త్రోలో, లాంగ్‌జంప్, 4+100 రిలే విభాగంలో ద్వితీయ స్థానం సాధించింది. అలాగే కే.నారాయణమ్మ 200 మీటర్ల పరుగుపందెం, హైజంప్, 4+100 పరుగు పందెంలో ద్వితీయ, డిస్కస్ త్రోలో తృతీయస్థానాలు సాధించారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందచేశారు.



పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

మూలస్థానేశ్వరుడి హుండీ ఆదాయం రూ.20 లక్షలు

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మూలాపేట మూలస్థానేశ్వర స్వామి దేవస్థానంలో హుండీల లెక్కింపు కార్యక్రమం బుధవారం జరిగింది. దేవదాయ ధర్మదాయ శాఖ కార్యాలయ పర్యవేక్షణాధికారి సీహెచ్ శ్రీనివాసబాబు, రెవెన్యూ శాఖ, పోలీస్ శాఖ పర్యవేక్షణలో స్టేట్ బ్యాంకు విశ్రాంత ఉద్యోగులు, ఏపీజీబీ ఉద్యోగుల ఆధ్వర్యంలో హుండీ కానుకలు లెక్కించారు. ఈ ఏడాది ఏప్రిల్ 17 నుంచి బుధవారం వరకు అనగా 7 నెలల 23రోజులకుగాను భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించగా నగదు రూ.20,27,968 వచ్చింది. అలాగే, బంగారం 45గ్రాములు, వెండి 355గ్రాములు వచ్చాయి. వీటిని ఏపీజీబీలో జమ చేసినట్లు ఆలయ ఈవో అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పుట్టా అజయ్‌కుమార్‌రెడ్డి, రిటైర్డ్ కార్యనిర్వహణాధికారి ఏ వేణుగోపాల్ పాల్గొన్నారు.



హుండీ కానుకల లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు

పనుల్లో వేగం పెంచండి

● నగర కమిషనర్ నందన్

నెల్లూరు(సిటీ), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ వద్ద జరుగుతున్న రోడ్డు నిర్మాణం, పైపు లైన్ల పనుల్లో మరింత వేగం పెంచాలని కమిషనర్ నందన్ అధికారులను ఆదేశించారు. బుధవారం అక్కడ జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. అనుకున్న సమయానికి పనులన్నీ పూర్తవ్వాలన్నారు. ఆ దిశగా అధికారులు, కాంట్రాక్టర్లు చొరవ తీసుకోవాలని సూచించారు. వీలైనంత త్వరగా పూర్తి చేసి వాహనరాకపోకలు పునరుద్ధరించాలన్నారు. అనంతరం రంగనాయకు లపేట వద్దనున్న పినాకిని పార్కులో జరుగుతున్న పనులను పరిశీలిం చారు. పనుల్లో నాణ్యత, ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. సిరి థియేటర్ వద్ద జరుగుతున్న కమ్యూనిటీ హాలు నిర్మాణపనులను, డీకే మహిళ జూనియర్ కళాశాల హాస్టల్ భవనాన్ని కమిషనర్ పరిశీలించారు. అనంతరం కార్పొరేషన్ కార్యాలయంలో ఆరోగ్య విభాగం అధికారులతో ట్రేడ్ లైసెన్సులపై సమీక్ష నిర్వహించారు.

15 కిలోల గడ్డ తొలగింపు

● దీప్తి నర్సింగ్ హోం డాక్టర్ లోకనాథం



నెల్లూరు (వైద్యం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని దీప్తి నర్సింగ్ హోంలో క్లిష్టమైన శస్త్రచికిత్స చేసినట్లు ఆ నర్సింగ్ హోం నిర్వాహకుడు డాక్టర్ లోకనాథం తెలిపారు. బుధవారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కోవూరు మండలానికి చెందిన కామమ్మ(78) కడుపులో ఉబ్బరం, నొప్పి, కాళ్ల వాపులతో బాధపడుతూ ఆసుపత్రికి వచ్చిందన్నారు. ఆమెకు ఎంఆర్ఐ తీసి పరీక్షించగా కడుపులో గడ్డ ఉన్నట్లు, రెండు కిడ్నీలలో రక్తవాసులు ఉన్నాయని గుర్తించామని చెప్పారు. కుటుంబ సభ్యుల అనుమతితో ఆ వృద్ధురాలికి శస్త్రచికిత్స చేసి 15 కిలోల గడ్డను తొలగించినట్లు తెలిపారు. బాధితురాలు పూర్తిగా కోలుకుందని పేర్కొన్నారు.

జిల్లా, రాష్ట్రాన్ని డ్రగ్ రహిత సమాజంగా నిర్మిద్దాం

● రేపు విద్యార్థులకు అవగాహన సదస్సు

● జనవిజ్ఞాన వేదిక

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాతోపాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని డ్రగ్ రహిత సమాజంగా నిర్మిద్దామని జనవిజ్ఞాన వేదిక నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని జర్నలిస్టు భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేవీవీ జిల్లా అధ్యక్షుడు ఎంవీ చలపతి మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలు వినియోగంతో యువత పక్కదారి పడుతోందన్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం 10గంటలకు సుమారు వెయ్యి మంది విద్యార్థులకు నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నా మన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ హిమాన్షుశుక్లా, ఎస్పీ అజిత వేజెండ్ల, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కే లక్ష్మణరావు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు డాక్టర్ శీనునాయక్, డాక్టర్ రఫీ, ఏ విజయకుమార్, సీహెచ్‌వీ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అదే స్వరం.. నిరసన గళం



కలువాయి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కలువాయి మండలాన్ని తిరుపతిలో కలపొద్దని జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండులో చేపట్టిన రిలే నిరాహార దీక్ష బుధవారం కూడా కొనసాగింది. శిబిరం వద్దకు విద్యార్థులు, అంగన్‌వాడీ సిబ్బంది వచ్చి తమ మద్దతు తెలియజేశారు. జిల్లా మార్పు నిర్ణయానికి వ్యతిరేకంగా అంగన్‌వాడీ సిబ్బంది నినాదాలు చేశారు. 'తిరుపతి వద్దు.. నెల్లూరు ముద్దు, సేవ్ కలువాయి..' అంటూ వారు నినాదాలతో హోరెత్తించారు. ప్రభుత్వం నుంచి తమకు అనుకూలంగా స్పష్టమైన ప్రకటన వచ్చే వరకు దీక్ష విరమించబోమని తెలిపారు. పలు గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చి దీక్షలో పాల్గొన్న వారికి సంఘీభావం తెలియజేశారు.

ఆటోపై పడిన విద్యుత్ స్తంభం



కందుకూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆటోపై విద్యుత్ స్తంభం విరిగి పడటంతో త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. ఈ దుర్ఘటన కందుకూరు పట్టణంలోని పడమర వడ్డెపాలెంలో బుధవారం జరిగింది. రోడ్డుపై వెళ్తున్న ఆటోపై విద్యుత్ స్తంభం విరిగి పడగా ఆ సమయంలో డ్రైవరు మాత్రమే ఉండటం, విద్యుత్ తీగల కారణంగా స్తంభం పూర్తిగా పడిపోకపోవటంతో పెనుప్రమాదం తప్పింది. డ్రైవరు చాకచక్యంగా ఆటో లోంచి బయటకు రాగా స్థానికులు అందించిన సమాచారంతో అధికారులు తక్షణం విద్యుత్ సరఫరా నిలిపివేశారు.

సముద్ర తాబేళ్లను పరిరక్షించండి

నెల్లూరు(వెంకటేశ్వరపురం) డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సముద్ర తాబేళ్లను పరిరక్షించాలని, ఇందుకోసం అన్నీ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని గుంటూరు రేంజ్ సీఎఫ్(కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్) ఐకేవీ రాజు పిలుపునిచ్చారు. జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో బుధవారం కనుపర్తిపాడులోని వీపీఆర్ కన్వెన్షన్‌లో ఐదు జిల్లాల అధికారులతో సముద్ర తాబేళ్ల పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఎఫ్ మాట్లాడుతూ ఈ నెల చివరి వారం నుంచి మే నెల వరకు సముద్ర తాబేళ్లు తీరానికి చేరుకొని గుడ్లు పెడతాయని చెప్పారు. అటవీశాఖ, మత్స్య శాఖ, మెరైన్ పోలీస్ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ, తీరానికి వచ్చే సముద్ర తాబేళ్లను పరిరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి మహబూబ్ బాషా, గుంటూరు, తిరుపతి, ప్రకాశం, పల్నాడు డీఎఫ్‌వోలు కృష్ణప్రియ, సాయిబాబా, హారికా, శైలజ, ఫిషరీస్ జేడీ డాక్టర్ శాంతి, ట్రీ ఫౌండేషన్ సభ్యురాలు సుప్రజ ధరణి, సబ్ డీఎఫ్‌వోలు, రేంజర్‌లు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఐకేవీ రాజు

రైతులకు రాయితీపై పురుగు మందులు

జిల్లా వ్యవసాయశాఖాధికారి సత్యవాణి



తోపుగుంటలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వ్యవసాయశాఖాధికారి సత్యవాణి, సిబ్బంది

కలువాయి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులకు అవసరమైన పురుగుమందులు 50 శాతం రాయితీతో అందజేస్తున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖాధికారి సత్యవాణి తెలిపారు. బుధవారం తోపుగుంటలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా నిర్వహించి క్లస్టర్ డెమోలో ఆమె పాల్గొన్నారు. గ్రామంలో సాగులో ఉన్న వరి, జొన్న పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలిచ్చారు. ప్రతి మంగళ, బుధవారాల్లో వ్యవసాయశాఖ అధికారులు పొలాలను సందర్శించి తెగుళ్ల నివారణకు అవసరమైన సలహాలు అందిస్తుంటారని చెప్పారు. రబీ సీజన్‌లో జిల్లాలో 5 లక్షల ఎకరాల్లో వరి సాగులో ఉండగా ఇప్పటికే రైతులకు 35వేల టన్నుల యూరియా అందించామని, వచ్చే రెండు నెలల్లో 65 వేల టన్నుల యూరియా వచ్చే అవకాశం ఉందని తెలిపారు. జిల్లాలోని 425 రైతు సేవా కేంద్రాలు, 56 సొసైటీల ద్వారా యూరియా పంపిణీ చేస్తామన్నారు. కలువాయి మండలానికి కూడా ఇప్పటికి 591 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో పొదలకూరు ఏడీఏ శివనాయక్, ఏవోలు కళారాణి, మంజుల, రైతులు పాల్గొన్నారు.

కండలేరు స్పిల్‌వే కాలువ

నిర్మాణం జరిగేనా ?

- ప్రాధాన్యమున్న నిర్మాణాన్ని గాలికొదిలేసిన గత ప్రభుత్వం
- సీఎం చంద్రబాబు దృష్టికి సమస్య
- రూ.95కోట్లు కోరిన నేతలు

పొదలకూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కండలేరు జలాశయం నిండుకుండలా తొణికిలాడుతోంది. ఇది సర్వత్రా ఆనందాన్ని నింపుతుండగా.. కొన్ని గ్రామాల్లోని ప్రజలకు మాత్రం ఆవేదన మిగుల్చుతోంది. ముంపునకు గురవుతున్న తోటలు, గ్రామాలను చుట్టుముడుతున్న నీటితో కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. డ్యాం నుంచి అత్యవసర పరిస్థితుల్లో నీరు బయటకు పంపే స్పిల్‌వే కాలువ శాశ్వత నిర్మాణం జరగకపోవడమే ఇందుకు ప్రధాన కారణం.

● వరదనీరు పంపే మార్గమేది ?

కండలేరు డ్యాం పూర్తయి మూడు దశాబ్దాలు అవుతున్నది. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరదను అత్యవసర పరిస్థితుల్లో బయటకు పంపే వెసులుబాటు లేకుంది. ఇటీవల మొంథా, దిత్వా తుఫాన్ వర్షాల కారణంగా డ్యాంలో 60 టీఎంసీల నీరు దాటినా, బయటకు వదలడం వీలుకాక అధికారులు అవస్థలు పడ్డారు. ఈనేపథ్యంలో కలెక్టర్, ఎమ్మెల్యే సోమిరెడ్డి సహకారంతో తాత్కాలికంగా యుద్ధప్రాతిపదికన కాలువలు తీసి జనరేటర్ సాయంతో కండలేరు స్పిల్ వే గేట్లు ఎత్తి నీటిని వదిలారు.ఎంతో కీలకమైన జలాశయం స్పిల్‌వే కాలువ నిర్మాణంలో ప్రభుత్వాలు మీనమేషాలు లెక్కిస్తున్నాయి.

● ఇవేం పనులు..?

గత ప్రభుత్వం స్పిల్‌వే పనులు కాకుండా కమీషన్ల కోసం కండలేరు ఎడమ కాలువ లైనింగ్ పనులు చేపట్టింది. అవి పూర్తి కాకుండానే సగంలోనే గాలికి వదిలేసిందనే విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం 60 టీఎంసీలు ఉన్న కండలేరు పరివాహక ప్రాంతంలో భారీ వర్షాలు కురిస్తే స్పిల్‌వే గేట్లు తెరవని పరిస్థితి నెలకొంది. గేట్లు తెరిస్తే వరద జలాలు ఇక్కడి నుంచి 14 కి.మీ మేర ప్రవహించి డేగపూడి వద్ద కండలేరు వాగులో కలవాల్సి ఉంది. స్పిల్‌వే దిగువ ప్రాంతంలో 560 మీటర్ల మేర అటవీ భూమి ఉందని కాలువ తవ్వేందుకు అటవీశాఖ అభ్యంతరం చెబుతోంది. ఇప్పటి వరకు జరిగిన పనులు కాకుండా వరద నీరు సాఫీగా వెళ్లి కండలేరు వాగులో కలిసేందుకు కొత్తగా రూ.95 కోట్లతో పనులు చేపట్టాల్సి ఉంది. ఇది ఎంతో అత్యవసరమైన పని. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఈ అంశాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందనే ఆరోపణలున్నాయి. కీలకమైన స్పిల్‌వే కాలువల పనులతోపాటు అటవీ అనుమతుల సాధనను గాలికి వదిలి కండలేరు ఎడమ కాలువ లైనింగ్ పనులపై మక్కువ చూపారనే విమర్శలు ఉన్నాయి. ఈ తీరును పలు సందర్భాల్లో ఎమ్మెల్యే సోమిరెడ్డి తప్పుబట్టారు.



తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కండలేరు స్పిల్ వే కాలువ

● సీఎం దృష్టి సమస్య

స్పిల్‌వే పనులు, అటవీశాఖ అనుమతుల కోసం రూ.95 కోట్ల ప్రతిపాదనలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లానని ఇటీవల ఎమ్మెల్యే సోమిరెడ్డి తెలిపారు. అటవీశాఖకు 560 మీటర్ల మేర భూమికి ప్రత్యామ్నాయంగా ఉదయగిరిలో భూములు చూపించారు. కండలేరు జలాశయం స్పిల్‌వే కాలువ శాశ్వత నిర్మాణం జరిగితే కండలేరు ముందున్న గ్రామాలకు, వెనక వైపున్న గ్రామాలకు ఇబ్బందులు ఉండవు.

మూడు దశాబ్దాలైనా.. పట్టించుకోలేదు



డ్యాం కట్టి 30 ఏళ్లు అవుతున్నా అత్యవసర పరిస్థితుల్లో నీటిని వదలడానికి స్పిల్ వే కాలువ నిర్మాణం జరగకపోవడం దారుణం. ఇటీవల కురిసిన వర్షాలకు ఎమ్మెల్యే సోమిరెడ్డి, కలెక్టర్ చొరవ చూపకుంటే మా గ్రామాలు మునిగిపోయేవి. అప్పటికప్పుడు కాలువ పనులు చేపట్టి గ్రామాలను ముంపు నుంచి కాపాడారు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ చూపాలి.

- పులిపాటి వెంకటరత్నంనాయుడు, పులికల్లు

కమీషన్ల కోసమే ఆ పనులు



గత ప్రభుత్వంలో కమీషన్లపై చూపిన శ్రద్ధ పనులపై చూపలేదు. స్పిల్‌వే కాలువ నిర్మాణం గాలికి వదిలి లైనింగ్ పనులు ప్రారంభించారు. వాటిని కూడా పూర్తి చేయకుండానే మధ్యలో వదిలివేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో 60 టీఎంసీల పైన నీరు చేరుకున్న సందర్భాలున్నా స్పిల్ వే కాలువ గురించి ఏనాడు ఆలోచించలేదు. ప్రస్తుత ప్రభుత్వమైనా చొరవచూపి కాలువ శాశ్వత నిర్మాణం చేపడితే సమస్యలు తీరుతాయి.

- నెట్టెం పెంచలయ్య, వావింపర్తి

మత్స్యశాఖ జేడీ ఆకస్మిక తనిఖీ



చేపల చెరువులను పరిశీలిస్తున్న మత్స్యశాఖ జేడీ శాంతి, అధికారులు

సంగం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్వీఆర్ పురంలో చేపల చెరువుల సాగును మత్స్యశాఖ జేడీ శాంతి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కోళ్ల వ్యర్థాలు వినియోగించే చెరువులకు విద్యుత్తు శాఖ అధికారులతో మాట్లాడి సరఫరాను నిలిపివేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆక్వా సాగు చేసే రైతులకు గిట్టుబాటు ధర కల్పించి చేయూతనిచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఆక్వా సాగు చేసే రైతులు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ప్రభుత్వం 30 రోజులు గడువివ్వగా.. ప్రస్తుతం రెండు నెలలైనా చాలా మంది రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోలేదని తెలిపారు. జిల్లాలో 39 వేల చేపల చెరువులకు 20 వేల చెరువులకు మాత్రమే అనుమతులు పొందారని, మిగతా వాటికి విద్యుత్తు సరఫరా నిలిపివేయాలని ఆశాఖ అధికారులకు సూచించామని పేర్కొన్నారు. చేపల చెరువులకు కోళ్ల వ్యర్థాలు వినియోగించే సాగుదారుల లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. అనుమతులు లేకుండా సాగు చేసే రైతులకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆమె వెంట ఏడీ చాన్‌బాషా, మత్స్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

చెరువు తూములో అడ్డుగా గోడ కట్టిన గుర్తు తెలియని వ్యక్తులు



పొదలకూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పొదలకూరు - లింగంపల్లి చెరువు తూములో అడ్డుగా గోడ కట్టిన గుర్తు తెలియని వ్యక్తులపై చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని ఆయకట్టుదారులు అధికారులను కోరుతున్నారు. చెరువు కింద సుమారు 100 ఎకరాల వరిసాగుకు రైతులు నారులు పోసుకుని ఉన్నారు. గత వారం కురిసిన వర్షాలకు మొత్తం భాగంలో రైతుల నారు కొట్టుకొనిపోయి ఇబ్బందులకు గురవుతున్నారు. నీరు అవసరం ఉండి నీరు చెరువు తూము తెరవగా చెరువు నిండా నీరు ఉన్నా చుక్కనీరు బయటకు రాలేదు. దీంతో సమస్యను గుర్తించేందుకు తూములోకి వెళ్లి చేస్తే గుర్తుతెలియని వ్యక్తులు తూము లోపల నీరు బయటకు రాకుండా అడ్డుగా ఇటుకలతో గోడ కట్టివున్నారు. గోడ పగలగొట్టాలి అంటే నీటి ప్రవాహం ఎక్కువ కారణంగా ప్రాణాపాయం జరిగే ప్రమాదం ఉంది.

గుర్తించిన వారికి 'అమృత' కార్డులివ్వాలి : కలెక్టర్

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా పథకంలో భాగంగా అనాథలు, నిరాశ్రయులు, సీనియర్ సిటిజన్ల కోసం అమలు చేస్తున్న అమృత ఆరోగ్య కార్డులను అర్హులకు అందించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన చాంబర్‌లో పలువురు చిన్నారులకు అమృత కార్డులను అందచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొదటి విడత జిల్లాలో ఈ పథకం కింద 518 మందిని ఎంపిక చేశారని, రెండో విడతలో 59 మందిని ఎంపిక చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద 3255 రకాల శస్త్రచికిత్సలు అందిస్తున్నారని ఏటా రూ.25 లక్షల ఉచిత వైద్యాన్ని ప్రభుత్వం అందిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ వైద్య సేవ పథకం జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ సుధీర్‌కుమార్, ఐసీడీఎస్ పీడీ హేమాసుజన్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు అమృత ఆరోగ్య కార్డులు అందిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

గంజాయి, మత్తు పదార్థాలపై ఉద్యమించాలి



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు రమాదేవి

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గంజాయి, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు డి రమాదేవి పిలుపునిచ్చారు. గంజాయి ముఠా చేతిలో ఇటీవల హత్యకు గురైన పెంచలయ్య సంతాప కార్యక్రమం బుధవారం ఆర్‌డీటీ కాలనీలో జరిగింది. రమాదేవి మాట్లాడుతూ మత్తు పదార్థాలు వాడకుండా యువతలో చైతన్యం తీసుకు రావాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాలు విక్రయించే, రవాణా చేసే వారిపై అటువంటి వారికి అండగా నిలిచే వారిపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని కోరారు. పెంచలయ్య కుటుంబానికి రూ.50 లక్షల ఆర్థిక సాయం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, నాయకులు చంద్ర రాజగోపాల్, మాదాల వెంకటేశ్వర్లు, అజయ్‌కుమార్, మోహన్‌రావు, పుల్లయ్య, పెంచల నరసయ్య, కొండా ప్రసాద్, కత్తి శ్రీనివాసులు, జనసేన నాయకుడు గునుకుల కిశోర్ పాల్గొన్నారు.

నిమ్మ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

- కిలో రూ.15 కొనుగోలు చేయండి
- జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు



జేసీకి తమ సమస్యలు చెబుతున్న నిమ్మ వ్యాపారులు

పొదలకూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : దిగజారుతున్న నిమ్మ ధరలతో కోత కూలీలు కూడా గిట్టుబాటు కాక ఇబ్బందులు పడుతున్న రైతులను వ్యాపారులు ఆదుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం పొదలకూరు నిమ్మయార్డులో రైతులు, వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిమ్మకాయల ధరలు దారుణంగా పడిపోయాయన్నారు. కిలో ధర రూ.8 మించకపోవడంతో గిట్టుబాటు కాక రైతులు చెట్లకే వదిలేస్తున్నట్లు తెలుసుకున్న జేసీ రెండు నెలలు రైతులు మార్కెట్టుకు తెచ్చిన నిమ్మకాయలు కిలో రూ.15 వంతున కొనుగోలు చేయాలని కోరారు. దేశం అంతా చలి వాతావరణం ఉండడంతో కాయలకు డిమాండ్ లేదని వ్యాపారులు జేసీ దృష్టికి తెచ్చారు. అన్ని పంటల్లాగే నిమ్మకు కూడా రాయితీ సదుపాయాలు కల్పించాలని రైతులు కోరగా ప్రభుత్వ ఉన్నతాధికారులతో మాట్లాడతామని తెలిపారు. ప్రస్తుతం మార్కెట్లో వచ్చే కాయల్లో నాణ్యత లోపించి దూర ప్రాంతాల ఎగుమతికి ఉపయోగించలేకున్నామని వ్యాపారులు చెప్పడంతో జిల్లా ఉద్యాన అధికారి సుబ్బారెడ్డి మాట్లాడుతూ వేసవి కాలంలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. కొన్ని రోజుల పాటు రైతులు తెచ్చే నిమ్మకాయలు రూ.15కే కొనుగోలు చేస్తామని చివరకు వ్యాపారులు సమ్మతించడంతో సమావేశం ముగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీ అనీతకుమారి, పొదలకూరు మార్కెటింగ్ కార్యదర్శి ఇలియాజ్, మండల ఉద్యాన అధికారి ఆనంద్, రైతులు, వ్యాపారులు, తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ రిజర్వేషన్ల సాధనకు పార్లమెంటును ముట్టడిస్తాం

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకరరావు



గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న కేశన శంకరరావు, పనమాల శ్రీహరిరావు తదితరులు

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : ఓబీసీ రిజర్వేషన్ల సాధన కోసం ఈనెల 15, 16 తేదీలలో ఢిల్లీలో మహాధర్నా, పార్లమెంటు ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు తెలిపారు. బుధవారం నెల్లూరులోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో హలో బీసీ - చలో ఢిల్లీ గోడపత్రికలను పలువురు బీసీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. రాజ్యాంగ సరవణలు చేసి ఓబీసీ రిజర్వేషన్లకు జనాభా దామాషా ప్రకారం చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పనమాల శ్రీహరి రావు మాట్లాడుతూ శీతాకాల సమావేశాల్లో ఓబీసీ రిజర్వేషన్ల బిల్లుకు చట్ట సవరణ చేసిన తరువాతే ఎన్నికలు జరపాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుమ్మరి క్రాంతి కుమార్, రాష్ట్ర మహిళా కార్యదర్శి ముంగర శైలజ, నెల్లూరు జిల్లా సలహాదారు నాగశయనరావు, జిల్లా ఉపాధ్యక్షుడు రాముగౌడ్, యూత్ అధ్యక్షుడు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి

అటల్, మోదీ సుపరిపాలన యాత్ర

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బీజేపీ జాతీయ కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో గురువారం నుంచి ఈ నెల 25వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా అటల్ మోదీ సుపరిపాలన యాత్ర జరుగుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీసారెడ్డి వంశీధర్‌రెడ్డి తెలిపారు. ప్రతిష్ఠాత్మకమైన ఈ యాత్రను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. సుపరిపాలన యాత్రలో జిల్లా నలుమూలల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. నెల్లూరులో ఈ నెల 15వ తేదీ ఉదయం అయ్యప్పగుడి సెంటర్ నుంచి ప్రారంభమై మినీబైపాస్ మీదుగా హరనాథపురం జంక్షన్ వరకు సాగుతుందని చెప్పారు. అక్కడ బహిరంగ సభ జరుగుతుందని, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎస్ మాధవ్, వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.

జిల్లాలో ప్రశాంతతకు ప్రణాళికలు

- ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి
- పలు పోలీసు స్టేషన్ల తనిఖీ

నెల్లూరు(క్రైం), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశామని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి తెలిపారు. జిల్లాలోని పలు పోలీసు స్టేషన్లను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆ తర్వాత నగరంలోని నవాబుపేట పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఫైల్స్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఆ తర్వాత బాలాజీనగర్, సంతపేట స్టేషన్లను కూడా తనిఖీ చేశారు. జిల్లాలో ఇటీవల కాలంలో వరుసగా నేరాలు జరుగుతున్నాయని, శాంతిభద్రతలను నెలకొల్పేందుకు అన్నీ ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. ఈ క్రమంలో గంజాయి సేవించే వారు, అమ్మేవారు, డెలివరీ చేసే వారిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. అనంతరం కావలిలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు వెళ్లిన ఐజీ అక్కడ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఆ తర్వాత విజయవాడకు తిరిగి వెళ్లారు. ఈ తనిఖీల్లో ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



నవాబుపేట పోలీసు స్టేషన్ వద్ద ఐజీకి వినతిపత్రం ఇచ్చి తమ బాధలు చెప్పుకుంటున్న ప్రజలు

సీఆర్‌సీ అభివృద్ధికి అన్నీ విధాలుగా కృషి

వెంకటాచలం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సీఆర్‌సీ (ప్రాంతీయ దివ్యాంగుల కేంద్రం) అభివృద్ధికి కృషి చేస్తానని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని చవటపాళెం పంచాయతీ ఎర్రగుంట సమీపంలో ఉన్న సీఆర్‌సీలో బుధవారం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే సోమిరెడ్డి విచ్చేసి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా 828 మంది విభిన్న ప్రతిభావంతులకు ట్రై సైకిళ్లు, బ్యాటరీ సైకిల్స్, మొబైల్ ఫోన్స్, ఆర్టిఫిషియల్ లెగ్స్ వంటి ఉపకరణ పరికరాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు రాష్ట్రంలోని విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేసేలా నిర్ణయం తీసుకున్నారన్నారు. సీఆర్‌సీ ఇక్కడికి వచ్చేందుకు పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు కృషి ఎనలేనిదన్నారు. సీఆర్‌సీ చేపడుతున్న సేవా కార్యక్రమాలను దివ్యాంగులు సద్వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కట్టంరెడ్డి రాధాకృష్ణారెడ్డి, చవటపాళెం సొసైటీ చైర్మన్ రావూరి రాధాకృష్ణమనాయుడు, సర్వేపల్లి కెనాల్ చైర్మన్ చల్లా నాగార్జున్‌రెడ్డి, సీఆర్‌సీ అధికారులు, సిబ్బంది, కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోస్టల్ శాఖ సేవలపై అవగాహన

సంగం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని దువ్వూరు సబ్ పోస్టాఫీసులో ఖాతాదారులకు ఐపీపీబీ అసిస్టెంట్ మేనేజర్ మనోజ్‌కుమార్ పోస్టల్ శాఖ అమలు చేస్తున్న సేవింగ్ సేవలతో పాటు బీమా, బ్యాంకింగ్, డిజిటల్ సేవలపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోస్టల్ శాఖలో గ్రూప్ యాక్సిడెంట్ పాలసీ, పీఎం జీవన్ జ్యోతి బీమా యోజన, ఐపీపీబీ సేవలు, బ్యాంకింగ్ సౌకర్యాలు, డిజిటల్ మొదలకు సర్వీసులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సబ్ పోస్టుమాస్టర్ దివ్య, పోస్టుమెన్ గోపాల్, ఖాతాదారులు, ప్రజలు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 12,303
వెండి కిలో ధర	రూ. 1,91,300
వెండి ఒక గ్రాము	రూ. 196.30

అదిగదిగో ఆహ్లాదం!

● ఆత్మకూరులో నగరవనం ఏర్పాటుకు చర్యలు ● రూ.1.40 కోట్ల మంజూరు



ఆత్మకూరు పట్టణం

ఆత్మకూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణ ప్రజలు ఆహ్లాదకర వాతావరణంలో సేదదీరేందుకు పార్కులు, యువతకు మినీ స్టేడియం త్వరలో అందుబాటులోకి రానున్నాయి. దశాబ్ద కాలంగా పార్కు నిర్మాణానికి నోచుకోక ప్రజలు ఉదయం, సాయంత్రం వేళల్లో ఆహ్లాదంగా గడిపేందుకు వెసులుబాటు లేకుంది. చిన్నారులకు సైతం ఆటవిడుపు స్థలం లేక వీధుల్లోనే ఆటపాటలతో గడుపుతున్నారు. ఆహ్లాదం కలిగించే సౌకర్యాలు కొరవడ్డాయి. గతంలో పోలీసుస్టేషన్ సమీపంలో ఎస్ఎంకే పార్కు నిర్మాణానికి ఓ దాత ఎకరా స్థలం కేటాయించారు. అక్కడ పార్కు నిర్మాణం నోచుకున్న దాఖలాల్లేవు. కాలగమనంలో ఆ స్థలాన్ని తపాలా కార్యాలయానికి కేటాయిస్తున్నట్లు అప్పటి పంచాయతీ పాలకులు తీర్మానం చేశారు. ఈ క్రమంలో 12 ఏళ్ల కిందట రాష్ట్ర మంతి ఆనం రామనారాయణరెడ్డి రూ.1.32 కోట్లతో పార్కు, రూ.2 కోట్లతో మినీ స్టేడియం నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. ఆ పనులు మొదలైనా.. పలు కారణాలతో అర్ధంతరంగా ఆగిపోయాయి. దాంతో పట్టణ ప్రజలు, చిన్నారులకు ఆటవిడుపు స్థలం కరవైంది. యువత ఆడుకునేందుకు క్రీడా ప్రాంగణాలు కరవయ్యాయి.

● రూ. 1.40 కోట్లతో నగర వనం

రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రత్యేక దృష్టి సారించి పట్టణ పరిధిలోని నెల్లూరుపాళెం కూడలిలో నగర వనం కోసం రూ.1.40 కోట్ల అటవీశాఖ నిధులను మంజూరు చేయించారు. దాంతో పట్టణ ప్రజలకు పార్కు అందుబాటులోకి రానుంది. ఇప్పటికే ఆత్మకూరు పట్టణం బట్టేపాడు రోడ్డు సమీపంలోని వాటర్ ప్లాంట్ వద్ద రెండెకరాల స్థలంలో పార్కు నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఇక స్టేడియం నిర్మాణానికి ఇటీవల రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ద్వారా రూ.1.80 కోట్లు మంజూరైన విషయం విదితమే. ఈ క్రమంలో స్టేడియం మాస్టర్ ప్లాన్, అంచనాలు, టెండరు ప్రక్రియ, తదితర అంశాలపై చర్చించి త్వరలో పనులు వేగవంతం అయ్యేలా ప్రత్యేక దృష్టిసారించాలని మంత్రి శాప్ అధికారులను ఆదేశించారు. దాంతో ఏళ్ల తరబడి ఆత్మకూరు పట్టణ యువత, క్రీడాకారులు ఆశగా ఎదురుచూస్తున్న స్పోర్ట్స్ స్టేడియం నిర్మాణ పనులు ఊపందుకోనున్నాయి.



12 ఏళ్ల కిందట ఆగిపోయన పార్కు నిర్మాణం

● బోటు షికారుకు ప్రతిపాదనలు

శ్రీకృష్ణదేవరాయల కాలంలో నిర్మించిన ఆత్మకూరు చెరువు వద్ద ట్యాంక్ బండ్ హంగులకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. చెరువులో బోటుషికారు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇది అందుబాటులోకి వస్తే ప్రజలకు మరింత వెసులుబాటు కానుంది. గతంలో తపాలా కార్యాలయానికి కేటాయించిన స్థలంలో పార్కును ఏర్పాటు చేస్తే మరింత ఉపయుక్తంగా ఉంటుందని పట్టణ ప్రజలు, చిన్నారులు కోరుతున్నారు.

నాణ్యమైన విద్య అందించాలి

వరికుంటపాడు (ఉదయగిరిరూరల్), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విలువలతో కూడిన నాణ్యమైన విద్య అందించాలని ఆంధ్రప్రదేశ్ వినియోగదారుల ఫోరం, మానవ హక్కుల సంఘం రాష్ట్ర కన్వీనర్ చల్లగాలి వెంకటమోహన్ అన్నారు. బుధవారం స్థానిక ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సమాజంపై అవగాహన కలిగి మంచి నడవడికను అలవర్చుకోవాలన్నారు. జంకుఫుడ్‌తో కలిగే అనారోగ్య సమస్యలను వివరించారు. అనంతరం పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా సలహాదారు కొండెపోగు దిలీప్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు వీరభద్రయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నియామక పత్రాల అందజేత

ఉదయగిరి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో బుధవారం అకడమిక్ ఇనస్ట్రక్టర్లుగా ఎంపికైన ఇద్దరు ఎస్జీటీలు, ఒక ఉర్దూ స్కూల్ అసిస్టెంట్‌కు ఎంఈవోలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అకడమిక్ ఇనస్ట్రక్టర్లుగా ఎంపికైన వారు సమయపాలన పాటిస్తూ ఉపాధ్యాయులతో కలసి విధులు నిర్వహించి మంచిపేరు తీసుకురావాలన్నారు. అనంతరం స్థానిక స్త్రీశక్తి భవనంలో ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎఫ్ఎల్ఎన్ షెడ్యూల్ ప్రకారం బోధన చేయాలన్నారు.

ప్రజల శ్రేయస్సే జగన్ ధ్యేయం

ఉదయగిరి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజల శ్రేయస్సే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ చేపట్టిన కోటి సంతకాల ప్రతుల వాహనానికి జెండా ఊపి నెల్లూరు కార్యాలయానికి పంపారు. తొలుత వైసీపీ నాయకులతో కలిసి స్థానిక వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యం ప్రజల హక్కని, దాన్ని రాష్ట్ర ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. పల్లెలు, పట్టణాల్లో జోరుగా సాగుతున్న మద్యం, గంజాయి విక్రయాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు మోడి రామాంజనేయులు, మండల వైసీపీ కన్వీనర్ కొండా రాజగోపాల్‌రెడ్డి, మాజీ ఏఎంసీ ఛైర్మన్ అలీఅహ్మద్, నాయకులు శ్రీనివాసులరెడ్డి, దస్తగిరి అహ్మద్, అక్కి భాస్కర్‌రెడ్డి, ఎంఏ నలీం పాల్గొన్నారు.

నారుమడుల ఏర్పాటులో జాగ్రత్త అవసరం



రైతులకు సూచనలిస్తున్న ఏవో

అంనతసాగరం డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వరిసాగు నారుముడుల ఏర్పాటులో జాగ్రత్తలు తీసుకోవాలని అనంతసాగరం ఏవో శైలజాకుమరి తెలిపారు. బుధవారం చిలకలమర్రి, బొమ్మవరం గ్రామాల్లో రైతులకు ప్రత్యేక అవగాహన కల్పించారు. నారు పెంచే విధానంపై ఏడు సూత్రాలు తెలియజేశారు. కార్యక్రమంలో విస్తరణాధికారి కృష్ణవేణి, వీఏఏలు పాల్గొన్నారు.

తగ్గుముఖం పడుతున్న సోమశిల ఇన్‌ఫ్లో

అనంతసాగరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో రోజురోజుకు తగ్గుముఖం పడుతోంది. మంగళవారం 11,588 క్యూసెకులు వస్తుండగా బుధవారానికి 10,151 క్యూసెక్కులకు రికార్డు అయినట్లు అధికారులు తెలిపారు. జలాశయంలో 73.895 టీఎంసీలు నీరు నిల్వ ఉంది. ఉత్తర కాలువకు 50, దక్షిణ కాలువకు 200, డెల్టాకు 2650, కండలేరుకు 2,000 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

కండలేరు జలాశయం నీటి నిల్వ 60.42 టీఎంసీలు

రాపూరు : మండలంలోని కండలేరు డ్యాం నీటి నిల్వ సామర్థ్యం 68 టిఎంసిలు కాగా, ప్రస్తుత నీటి మట్టం 60.42 టిఎంసిలు ఉందని ఏఈ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుండి 1750 క్యూసెక్కుల నీరు ఇన్ ఫ్లో వస్తుండగా, 1050 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో వెళ్తుందని అధికారులు పేర్కొన్నారు.

పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయండి



ఉషశ్రీకి వినతిపత్రం అందజేస్తున్న ఖాజా

ఉదయగిరి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): శతాబ్దాల చరిత్ర కలిగిన ఉదయగిరి దుర్గాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసి సందర్శకులకు కనీస వసతులు కల్పించాలని ఉదయగిరి డెవలప్‌మెంట్ ఫోరం ప్రతినిధి షేక్ ఎండీ ఖాజా కోరారు. ఈమేరకు ఆయన బుధవారం నెల్లూరులో జిల్లా పర్యాటక అధికారి ఉషశ్రీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుర్గాన్ని నిత్యం సందర్శించే వందలాది మంది పర్యాటకులు కనీస వసతుల్లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉదయగిరి-దుర్గంపల్లి రోడ్డు నుంచి మెట్ల వరకు, కల్యాణ మండపం, కృష్ణాలయాలకు వెళ్లే మార్గాలు గుంతలు పడి రాళ్లు తేలిన మట్టి రోడ్లతో పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మెట్ల మార్గం వరకు సిమెంట్‌రోడ్డు నిర్మాణానికి మంజూరైన రూ.96 లక్షలు వెనక్కి వెళ్లడం దారుణమన్నారు. పర్యాటకులు ఎండ, వాన సమయాల్లో విడిది పొందే అవకాశం కూడా లేదన్నారు. పర్యాటక శాఖాధికారులు కనీస వసతులు కల్పించాలని కోరారు.

మాసాయిపేటలో నేత్ర వైద్యశిబిరం

ఉదయగిరి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాయపాళెం పంచాయతీ మాసాయిపేటలో బుధవారం నెల్లూరు పార్లమెంట్ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వీపీఆర్ నేత్ర బస్సు శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు 220 మందికి కంటి వైద్య పరీక్షలు చేసి 142 మందికి ఉచితంగా అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చీఫ్ కో-ఆర్డినేటర్ ఎస్.శంకర్, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్‌తో ప్రాణరక్షణ : సీఐ



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ వెంకటరావు

ఉదయగిరి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రాణరక్షణ పొందాలని ఉదయగిరి సీఐ ఎన్.వెంకటరావు సూచించారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో సర్కిల్ పరిధిలోని మహిళా సంరక్షణ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాలు, ప్రమాదాలపై గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు నిత్యం అప్రమత్తంగా ఉంటూ ప్రజలను చైతన్యపర్చాలని తెలిపారు. ప్రస్తుతం రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు అధికమయ్యాయన్నారు. ద్విచక్ర వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు కర్నాటి ఇంద్రసేనారెడ్డి, ఆదిలక్ష్మి, శివకృష్ణారెడ్డి, రఘునాథ్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాయితీతో వరి విత్తనాల పంపిణీ



విత్తనాలు పంపిణీ చేస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు గుండ్లపల్లి

సంగం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): దిత్వా తుపాన్ కారణంగా దెబ్బతిన్న నారుమళ్ల రైతులకు బుధవారం 80 శాతం రాయితీతో సంగం పీఏసీఎస్ అధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్ ఆధ్వర్యంలో వరి విత్తనాలను పంపిణీ చేశారు. తరుణవాయికి చెందిన 57 మంది రైతులకు 167 ఎకరాల నారుమళ్లు దెబ్బతిన్నాయి. ఒక్కో ఎకరాకు ఒక బస్తా (25 కేజీలు) చొప్పున రూ.218లకు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి శశిధర్, టీడీపీ నాయకులు బాణా రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బ్లాస్టింగ్ సమయంలో అప్రమత్తంగా ఉండాలి



అధికారులకు సూచనలిస్తున్న ఆర్డీవో పావని

సీతారామపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యో తి): టన్నెల్ పనుల వద్ద బ్లాస్టింగ్ జరిగే సమయంలో అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు ఆర్డీవో పావని సూచించారు. ఆమె బుధవారం సీతారామపురం- పోరుమామిళ్ల ఘాట్ రోడ్డు మార్గంలో జరుగుతున్న గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే టన్నెల్ పనులను పరిశీలించారు. రోజుకు ఎన్నిసార్లు బ్లాస్టింగ్ చేస్తున్నారని మ్యాక్స్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ బృందాన్ని అడిగి వివరాలు తెలుసుకున్నారు. పని ప్రదేశంలో ముందస్తు జాగ్రత్తగా అంబులెన్స్ వాహనాన్ని అందుబాటులో ఉంచాలన్నారు. ప్రమాదాలకు తావు లేకుండా అగ్నిమాపక సిబ్బందిని సంప్రదిస్తూ ఎప్పటికప్పుడు తగిన చర్యలు చేపట్టాలన్నారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు షేక్ ఫజియా, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సారూ.. ఇటు చూడండి!



పేరు మార్చని రైతు సేవా కేంద్రం

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈ చిత్రం చూడండి. ఇది పెద్దిరెడ్డిపల్లిలోని రైతు సేవా కేంద్రం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతు భరోసా కేంద్రాలకు సేవా కేంద్రాలుగా పేరు మార్చింది. అయితే అధికారులు ఈ విషయాన్ని పూర్తిగా విస్మరించారు. ఏళ్లు గడుస్తున్నా భవనంపై పాత పేరే కనిపిస్తుండటం వారి పనితీరుకు ఓ ఉదాహరణ. నిత్యం కార్యాలయానికి వచ్చే రైతులు ఈ భవనంపై పేరును చూస్తూ గుసగుసలాడుకుంటున్నారు. ఇప్పటికైనా పేరు మార్చేలా అధికారులు చర్యలు తీసుకుంటారో, లేదో వేచిచూడాల్సిందే..

పల్స్‌పోలియోను విజయవంతం చేయండి



సిబ్బందికి సూచనలిస్తున్న వైద్యాధికారి శివకల్పన

ఉదయగిరి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఈనెల 21, 22, 23వ తేదీల్లో నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమా న్ని విజయవంతం చేయాలని గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి శివకల్పన సూచించారు. బుధవారం స్థానిక పాత సామాజిక ఆరోగ్య కేంద్రంలో అంగన్‌వాడీ, వైద్యఆరోగ్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈనెల 21న పల్స్‌పోలియో కేంద్రాల్లో, 22, 23వ తేదీల్లో ఇంటింటికి వెళ్లి అయిదేళ్లలోపున్న చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందన్నారు. హైరిస్క్ ప్రాంతాలను గుర్తించి అక్కడ ఉండే చిన్నారులకు పోలియో చుక్కలు వేసేలా చూడాలన్నారు. ముందురోజు గ్రామాల్లో దండోరా వేయించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో శివకుమారి, ఆరోగ్య పర్యవేక్షకులు అంకమ్మ, చెన్నయ్య, టీబీ ట్రీట్‌మెంట్ ఆర్గనైజర్ భోగ్యం వెంకటేశ్వర్లు, వైద్యఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంజీవరాజు మృతి బాధాకరం : మాజీ ఎమ్మెల్యే మేకపాటి



సంజీవరాజు భౌతికకాయం వద్ద నివాళులు అర్పిస్తున్న మేకపాటి దంపతులు

ఉదయగిరి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని జి.చెరువుపల్లి పంచాయతీ సంజీవరాజుపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు సంజీవరాజు మృతి బాధాకరమని మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, ఆయన సతీమణి, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి శాంతికుమారి పేర్కొన్నారు. బుధవారం వారు సంజీవరాజుపల్లికి చేరుకుని భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. సంజీవరాజు కుటుంబంతో తమకున్న అనుబంధం మరులేనిదన్నారు. ఈ సందర్భంగా కుటుంబానికి రూ.50 వేలు ఆర్థికసాయం అందజేసి ధైర్యంగా ఉండాలని, ఎల్లవేళలా తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కల తొలగింపు

ఉదయగిరి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం పిచ్చిమొక్కలు తొలగించి పరిశుభ్రత చర్యలు చేపట్టారు. ఏపుగా మొక్కలు పెరిగి విష పురుగులకు నిలయంగా మారడంతో బుధవారం జీఎంకే ట్రస్టు అధినేత, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుంటుపల్లి మాలకొండయ్యచౌదరి తన ట్రస్టు ప్రతినిధులతో ఎక్స్‌కవేటర్‌తో పిచ్చిమొక్కలను తొలగించి చదును చేయించారు. దాంతో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ ట్రస్టు అధినేతకు కృతజ్ఞతలు తెలియజేశారు.

దొంగతనం కేసులో..

నలుగురికి మూడేళ్ల జైలు

● నిందితులు తమిళనాడు, తిరుపతికి చెందినవారు

నెల్లూరు(లీగల్), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : బంగారు, వెండి దొంగతనం చేశారన్న కేసులో నేరం రుజువు కావడంతో నలుగురు నిందితులకు ఒక్కొక్కరికి మూడేళ్ల చొప్పున జైలు శిక్ష విధిస్తూ నెల్లూరు నగర మొదటి తరగతి రెండవ అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఎల్ శారదా రెడ్డి బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లూరు నగరం మనుమసిద్ధి నగర్‌కు చెందిన మద్దులూరి సోమేశ్వరి కుటుంబం ఈ ఏడాది జూలై 19న ఒంగోలులోని బంధువుల ఇంటిలో జరుగుతున్న కార్యక్రమానికి వెళ్లింది. అదేరోజు వాళ్లింట్లో రూ.10 లక్షల విలువ చేసే బంగారు, వెండి నగలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. బాధితురాలి ఫిర్యాదుతో చిన్నబజారు పోలీసులు కేసు దర్యాప్తు చేశారు. ఇదిలా ఉండా తిరుపతి జిల్లా పుత్తూరు పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో తమిళనాడు రాష్ట్రం నమక్కళ్ జిల్లా సెరుక్కలై గ్రామానికి చెందిన యం మణి అలియాస్ కోవిల్ మణి, యం సురేష్ అలియాస్ గుణ, తిరుపతి పట్టణం మంగళంకు చెందిన యస్ కుమార్, తిరుమల నగర్‌కు చెందిన ఏ మల్లికార్జున అలియాస్ మణికందన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఆ నిందితులే నెల్లూరు మనుమసిద్ధి నగర్‌లోని ఇంట్లో బంగారం, వెండి చోరీ చేశారని, భగత్‌సింగ్ కాలనీలో బైకును కూడా అపహరించారని పోలీసులు గుర్తించారు. దీంతో చిన్నబజారు స్టేషన్ సీఐ కోటేశ్వర రావు రంగంలోకి దిగి నిందితులను ప్రిజనర్ ట్రాన్స్‌ఫర్ వారెంట్ ద్వారా అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. నిందితులు నలుగురిపై చార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బీ లక్ష్మీకుమారి వాదించారు.

బస్సులో నుంచి దూకి వ్యక్తి మృతి



మృతిచెందిన సుజన్‌సంత్రా

చేజర్ల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి). చేజర్ల మండలంలోని పడమటి కంద్రిక వద్ద బుధవారం మధ్యాహ్నం బస్సులోంచి దూకి బెంగాల్‌కు చెందిన సుజన్‌సంత్రా (34) అనే వ్యక్తి మృతిచెందాడు. చేజర్ల ఎస్సై తిరుమలరావు వివరాల మేరకు.. బుధవారం మధ్యాహ్నం కుల్లూరు నుంచి నెల్లూరుకు వస్తున్న నెల్లూరు ఒకటో డిపో బస్సులో ఆదూరుపల్లి స్టాప్ వద్ద ఒక వ్యక్తి ఎక్కి నెల్లూరుకు టికెట్ తీసుకున్నాడు. పడమటి కంద్రిక గ్రామం వద్దకు బస్సు చేరుకోగా.. ఉన్నట్లుండి ఆ వ్యక్తి బస్సులోంచి కిందకు దూకేశాడు. దీన్ని గమనించిన బస్సు డ్రైవర్ వెంటనే బస్సును ఆపి 108 వాహనానికి సమాచారమిచ్చారు. సంఘటనా స్థలికి చేరుకున్న 108 వాహన సిబ్బంది ఆ వ్యక్తిని పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి జేబులో ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా ఆయన పశ్చిమ బంగా రాష్ట్రం నడియా ప్రాంతానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. మృతుడి బంధువుల కోసం ఆరా తీస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వైద్యశాలకు తరలించారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య



ఉరి వేసుకున్న అనూష

కావలి(రూరల్), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం వైకుంఠపురంలో వివాహిత అనూష(28) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికుల వివరాల మేరకు.. దిలీప్, అనూషలకు పదేళ్ల క్రితం వివాహమైంది. వైకుంఠపురంలో నివాసముంటున్నారు. దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈక్రమంలో బుధవారం ఆమె నివాసంలో చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమెకు ఇద్దరు కుమార్తెలున్నారు. రెండో పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

నెల్లూరు రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ మండలం దేవరపాళెంలో ఈ ఏడాది మార్చి 30న జరిగిన శేషయ్య హత్య కేసులో నిందితుడిగా ఉన్న అదే గ్రామానికి చెందిన బండి వెంకట రమణయ్యను బుధవారం అరెస్ట్ చేసినట్లు సీఐ వేణు తెలిపారు. అప్పట్లో శేషయ్యను చంపేసి ప్రభుత్వ పాఠశాల వద్దనున్న సంపులో మృతదేహాన్ని వేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామని, నిందితుడిని కోర్టు ద్వారా రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు

పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన వ్యక్తి అరెస్ట్

నెల్లూరు రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తనను ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని నెల్లూరు రూరల్ 4వ మైలుకు చెందిన ఓ బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు రూరల్ సీఐ వేణు బుధవారం తెలిపారు. పెళ్లి చేసుకుందామని నమ్మబలికి ద్రోహం చేశాడని అదే ప్రాంతానికి చెందిన షేక్ ఆకీబ్‌పై ఆమె ఫిర్యాదు ఇవ్వడంతో అరెస్ట్ చేసి కోర్టు ద్వారా రిమాండ్‌కు పంపామన్నారు.

వ్యాపారిని మోసగించిన వ్యక్తిపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): వ్యాపారిని మోసం చేసిన ఓ వ్యక్తిపై చిన్నబజారు పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని మన్సూర్‌నగర్‌కు చెందిన నజీర్‌బాషా రామలింగాపురంలో ఇంపోర్ట్, ఎక్స్‌పోర్ట్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. డెకరేషన్‌కు సంబంధించిన మెటీరియల్ పంపిస్తానని ఒడిశా రాష్ట్రానికి చెందిన శివబెహర్ ఈ ఏడాది జూన్‌లో నజీర్‌బాషాతో ఒప్పందం చేసుకుని రూ.23.50 లక్షలు తీసుకున్నాడు. రోజులు గడుస్తున్నా మెటీరియల్ పంపకపోగా, ఫోన్‌కూడా లిఫ్ట్ చేయకపోవడంతో మోసపోయానని గ్రహించిన నజీర్‌బాషా బుధవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ వ్యర్థాల వాహనాల పట్టివేత

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెనుబల్లి వద్ద చికెన్ వ్యర్థాలు సరఫరా చేసే 3 వాహనాలను బుచ్చి సీఐ శ్రీనివాసులురెడ్డి సిబ్బందితో దాడులు చేసి స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బెంగళూరు నుంచి మూడు వాహనాలతో చికెన్ వ్యర్థాలు తెచ్చి బుచ్చి మండలంలోని చేపల చెరువులకు సరఫరా చేస్తుండడంపై వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

డ్రంకన్ డ్రైవ్‌కు జరిమానా

కావలి(రూరల్), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కావలి రూరల్ సీఐ రాజేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం వాహన తనిఖీలు చేపట్టి మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరిచారు. వారికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 50 మందిని కోర్టుకు హాజరుపరచగా ఒక్కొక్కరికి రూ.500 చొప్పున జరిమానా విధించారు.

నిమ్మకు మద్దతు ధర దక్కేలా కలెక్టర్ చర్యలు

నెల్లూరు(వ్యవసాయం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నిమ్మ ధరలు తగ్గిన నేపథ్యంలో రైతులను ఆదుకొనేందుకు కలెక్టర్ ఇమాన్షు శుక్లా చర్యలు తీసుకొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్లో ఉద్యాన, మార్కెటింగ్‌శాఖ అధికారులతో సమీక్షించారు. జిల్లాలో 25 వేల ఎకరాల్లో పంట కాపు దశకు వచ్చిందని అధికారులు వివరించారు. తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లోనూ నిమ్మ దిగుబడులు పెరగడంతో మన కాయలకు గిరాకీ తగ్గిందన్నారు. దీనిపై స్పందించిన కలెక్టర్.. కర్నూలు, శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల కలెక్టర్లతో ఫోనులో మాట్లాడగా.. వారు సానుకూలంగా స్పందించారు. కాయలను ఆయా జిల్లాలకు తరలించి రైతులకు గిట్టుబాటు ధర వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి సుబ్బారెడ్డి, మార్కెటింగ్ శాఖ ఏడీ అనితా పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల నిలిపివేతతో ప్రయాణికుల అవస్థలు



బస్సు ఎక్కేందుకు ఎగబడుతున్న ప్రయాణికులు

కలువాయి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): నెల్లూరు- కలువాయి మార్గంలో మూడు రోజులుగా ఆర్టీసీ అధికారులు ప్రయాణికులకు చుక్కలు చూపిస్తున్నారు. ఈ మార్గంలో తిరిగే అయిదు సర్వీసులను నిలిపివేశారు. 20 రోజుల కిందట ఒకటి.. మూడు రోజులుగా నాలుగు సర్వీసులు ఆగిపోయాయి. దాంతో ఈ మార్గంలో గంటల తరబడి బస్సులు లేక ప్రయాణికులు కలువాయి బస్టాండులో గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. వచ్చిన బస్సుల్లో కాలు మోపేందుకు కూడా జాగా ఉండటం లేదు. దాంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నో ఏళ్లుగా కలువాయిలో నైట్ హాల్ట్ ఉండి ఉదయం 5 గంటలకు నెల్లూరు బయలుదేరే సర్వీసు 20 రోజులుగా నిలిచిపోయింది. దాంతో ఉదయం ఆసుపత్రులకు వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్త్రీశక్తి పథకంతో ప్రయాణికుల తాకిడి పెరిగింది. దీనికి తగ్గట్టు బస్సులు పెంచాల్సింది పోయి ఉన్న సర్వీసులను రద్దు చేస్తుండటంతో మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ అధికారులు వెంటనే చర్యలు తీసుకుని ఆగిపోయిన సర్వీసులను పునరుద్ధరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	148
స్కిన్ చికెన్	266
స్కిన్‌లెస్	290

కోడిగుడ్ల ధర (100): 670

'పది' విద్యార్థులకు 100 రోజుల ప్రణాళిక అమలు

కొండాపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యాశాఖ రూపొందించిన 100 రోజుల ప్రణాళికను పటిష్ఠంగా అమలు చేయాలని మండల విద్యాశాఖాధికారి-2 ఆనందరావు తెలిపారు. ఈమేరకు బుధవారం మండల విద్యావనరుల కేంద్రంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. విద్యాశాఖ సూచించిన ప్రణాళిక ప్రకారం రోజువారీ కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులలో అభ్యసనాసామర్థ్యాలను పెంచాలన్నారు. దీంతో మార్చిలో జరగనున్న పదవ తరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. అలాగే ప్రాథమికస్థాయిలో విద్యార్థులలో అభ్యసనాసామర్థ్యాలను పెంచేందుకు రూపొందించిన జీఎఫ్ఎల్ఎన్ 75 రోజుల ప్రణాళికను సమర్థవంతంగా అమలుచేయాలని కోరారు.

అందని పశు వైద్యం!

- వెంటాడుతున్న మందుల కొరత
- అంతుచిక్కని వ్యాధితో మూగజీవాలు మృత్యువాత
- తీవ్రంగా నష్టపోతున్న పెంపకందారులు


వలేటివారిపాలెం ప్రాంతీయ పశువైద్యశాల

వలేటివారిపాలెం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పశు వైద్యశాలలో పశువులకు, సన్నజీవాలకు సరైన వైద్యం అందడం లేదు. దీనికి తోడు మందుల కొరత వెంటాడుతోంది. దీంతో ప్రైవేట్ ఔషధ దుకాణాలకు వెళ్లి మందులు కొనుగోలు చేయాల్సి పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో అంతుచిక్కని వ్యాధికి సకాలంలో వైద్యం, మందులు అందక మూగ జీవాలు మృత్యువాత పడుతుండడంతో సన్నజీవాల పెంపకందారులు తీవ్రంగా నష్టపోతున్నారు. వివరాల మేరకు.. మండలంలో గత పది రోజులుగా గొర్రెలకు అంతుచిక్కని వ్యాధులు ప్రబలుతున్నాయి. కొన్నింటికి నోటి పుండ్లు, మరికొన్నింటికి కాళ్ల గిట్టలకు పుండ్లు, మోకాళ్ల వాపులు వచ్చి పూర్తిస్థాయిలో చికిత్స అందించేలోపు మృత్యువాత పడుతున్నాయి. ఇలా వ్యాధుల బారిన పడిన మూగ జీవాలను వైద్యం కోసం వలేటివారిపాలెం ప్రాంతీయ పశు వైద్యశాలకు తీసుకెళ్తే ప్రభుత్వం నుంచి మందులు సరఫరా కావడం లేదని, ప్రయివేట్ మెడికల్ షాపులకు చీటీ రాసి మందులు తెచ్చుకొంటే వైద్యం చేస్తామని ఏడీ చెబుతున్నట్లు సన్నజీవాల పెంపకందారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి మందులు సరఫరా కాకపోవడం ఏమిటని సన్నజీవాల పెంపకందారులు ప్రశ్నిస్తే మందుల స్టాక్ బీరువా తలుపు తీసి ఖాళీ బీరువా చూపిస్తున్నట్లు ఆవేదన చెందుతున్నారు. ఏదో అరకొరగా మందులు ఇచ్చి అవసరమైన మందులకు చీటీలు రాసిస్తున్నట్లు తెలిపారు. అంతేగాకుండా వైద్యం కూడా పూర్తిస్థాయిలో అందడంలేదని సన్నజీవాల పెంపకందారులు చెబుతున్నారు. దీంతో సకాలంలో వైద్యం అందక మూగజీవాలు మృత్యువాత పడి తీవ్రంగా నష్టపోతున్నామని కన్నీరు పెడుతున్నారు వలేటివారిపాలెంలో కొంకా నరసింహం, కొంకా హరిబాబు, గాలం నాగేశ్వరరావు, కొంకా మాధవరావులకు చెందిన సుమారు 40 గొర్రెలకు పైగానే సకాలంలో వైద్యం అందక నోటి జబ్బుతో మృత్యువాత పడి సుమారు రూ.8 లక్షలకు పైగానే నష్టపోయినట్లు బాధితులు వాపోయారు. ప్రభుత్వ పశువైద్యశాలలో మందులు ఇవ్వకపోవడంతో వేలకు వేలు ఖర్చు చేసి ప్రయివేట్ మందులు దుకాణాల్లో కొనుగోలు చేసి వైద్యం చేయించుకోవల్సిన దుస్థితి నెలకొందని ఆందోళన చెందుతున్నారు. సన్నజీవాలకు ప్రమాదవశాత్తు గాయమైతే కనీసం కట్టు కట్టేందుకు కూడా దూది, గాజుగుడ్డ కూడా లేదని, ప్రైవేట్ దుకాణాలకు వెళ్లి తెచ్చుకోవాలని చీటీలు రాసిస్తున్నట్లు మండిపడుతున్నారు. పశువులకు రోగనిర్ధారణ పరీక్షలు కూడా చేయడం లేదని, ఏమైనా రోగమొస్తే సొంతంగా మందులు తెచ్చుకొని చికిత్స చేయించుకుంటున్నామని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రభుత్వం నుంచి మందులు తెప్పించి సన్నజీవాల పెంపకం దారులకు అందజేసి సకాలంలో వైద్యం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.


అంతుచిక్కని వ్యాధితో మృత్యువాత పడిన గొర్రె


గిట్ట వద్ద పుండ్లు వాచిన గొర్రె కాలు

బయట కొనుగోలు చేస్తున్నాం

జీవాలను వైద్యం కోసం వైద్యశాలకు తీసుకెళ్తే చీటీలు రాసి ప్రైవేట్ దుకాణాల్లో మందులు తెచ్చుకోమంటున్నారు. అదేమని అడిగితే ప్రభుత్వం నుంచి మందులు సరఫరా లేదని మందుల బీరువా తలుపులు తీసి చూపిస్తున్నారు. ప్రయివేట్ దుకాణాలలో మందులు కొనుగోలు చేసి వైద్యం చేయించుకుంటున్నాం. వ్యాధులకు గురైన సన్నజీవాలు సకాలంలో వైద్యం అందక మృత్యువాత పడి తీవ్రంగా నష్టపోయాం

- గాలం నాగేశ్వరరావు, వలేటివారిపాలెం

ప్రభుత్వం నుంచి మందులు సరఫరా లేదు

ప్రభుత్వం నుంచి ఆరు నెలలుగా మందులు సరఫరా కావడం లేదు. అరకొరగా వచ్చిన మందులు పెంపకందారులకు ఇస్తున్నాం. లేని మందులు ప్రైవేట్ మెడికల్ దుకాణాల్లో తెచ్చుకోమంటున్నాం. జీవాలు నోటి జబ్బులతో మృత్యువాత పడుతున్నది వాస్తవమే. నోటి జబ్బులకు ముందస్తు టీకాలు వేశాం. టీకాలు వేయించని జీవాలు మృత్యువాత పడుతున్నాయి. మందుల కోసం ప్రభుత్వానికి ఇండెంట్ పెట్టాం.

- చెన్నకేశవులు, ఏడీ, వలేటివారిపాలెం

మానవ హక్కులపై అవగాహన



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న సీనియర్ న్యాయవాది దారా నారాయణ

కావలి(టౌన్), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణ విట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎంపవరింగ్ ఈక్వాలిటీ బై బ్రేకింగ్ బారియర్స్ అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య వక్తలుగా సీనియర్ న్యాయవాది దారా నారాయణ, హైకోర్టు న్యాయవాది ఖాజా మస్తాన్‌షరీఫ్‌లు పాల్గొని మానవ హక్కుల గురించి వాటి పరిరక్షణ గురించి వివరించారు. ప్రతిఒక్కరూ మానవ హక్కులపై అవగాహన కలిగి వుండాలని, మానవ హక్కులకు భంగం కలిగితే న్యాయస్థానాలను ఆశ్రయించి హక్కులు కాపాడుకోవాలన్నారు. విద్యతోపాటు మానవ హక్కులపై విద్యార్థులకు తెలిసేలా కృషి జరగాలన్నారు. మానవ హక్కులపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. విట్స్ ఛైర్మన్ దొడ్ల విద్యాధర్‌కుమార్ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ లిఖిత్ రెడ్డిలు మాట్లాడుతూ ఇటువంటి అవగాహన సదస్సులు నిర్వహించడం ఎంతైనా అవసరమన్నారు.

మానవ హక్కులే రక్షణ



మాట్లాడుతున్న ఎల్లు సాల్మన్‌రాజు

అల్లూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచమంతా మానవ హక్కులతోనే రక్షింపబడుతుందని లేకుంటే ఎన్నో విద్రోహ శక్తులు బలహీన వర్గాలపై ఉక్కుపాదం మోపి వారి అవసరాలను తీర్చుకునే అవకాశం ఉందని వీఐపీ మానవ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు అన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం నిర్వహించిన అవగాహన సభలో ఆయన మాట్లాడారు. సామాజిక న్యాయం, ఆర్థిక, ప్రజాస్వామ్యం లేకుంటే ప్రజాస్వామ్యంలో సమాన హక్కు అనే పదానికి అర్థం లేదన్నారు. 1948లో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆర్టికల్ 41, 42, 43లో సామాజిక న్యాయం, శ్రామిక హక్కులు, సామాజిక భద్రత, కార్మిక, బలహీన వర్గానికి గౌరవప్రదమైన హక్కులు, రక్షణ కల్పించేలా రూపొందించబడ్డాయన్నారు. ఇవే దేశం ఎదగడానికి పునాదులన్నారు. ప్రతీఒక్కరూ మానవ హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కోవూరు బాబురావు, గంగపట్నం సతీష్, దర్శిగుంట వాసు, చింతల ఏడుకొండడలు, తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

వలేటివారిపాలెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వలేటివారిపాలెం ఎస్టీ కాలనీలోని పేకాట స్థావరంపై ఎస్ఐ మరిదినాయుడు తమ సిబ్బందితో కలిసి బుధవారం దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.11,720 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రాయితీపై వరి విత్తనాలు

అల్లూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : దిత్వా తుఫాన్ ధాటికి నారుమడులు దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం 80 శాతం రాయితీపై వరి విత్తనాలను అందించేందుకు చర్యలు తీసుకుందని వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కేఎన్ఎం-1638, ఆర్ఎన్ఆర్- 15048 రకాల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, నారుమడులు దెబ్బతిన్న రైతులు సద్వినియోగం చేసుకొని వరిసాగు చేపట్టాలని పేర్కొన్నారు.

చర్చిల ముస్తాబు

బిట్రగుంట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని క్రైస్తవ ప్రార్థన మందిరాలు విద్యుత్ దీపాలంకరణలతో ముస్తాబయ్యాయి. విశ్వనాథరావుపేటలోని లెవెన్స్ చర్చిలో క్రిస్మస్ ట్రీ, స్టార్, పశువుల పాకలో బాలయేసు జననం నమూనా బుధవారం ఏర్పాటు చేశారు. బోగోలు, రామస్వామిపాలెంలోని జేరుషలేం, తదితర క్రైస్తవ ఆలయాలు కొత్తరంగులతో ముస్తాబు అవుతున్నాయి.

రాత్రి పదిన్నర గంటల తర్వాత బయట కనిపిస్తే కఠిన చర్యలు : సీఐ


వాహనాలు తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ అన్వర్‌బాషా, ఎస్ఐ శివనాగరాజు

కందుకూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణ, నేరచరితుల అణచివేత చర్యల్లో భాగంగా ఇకనుంచి పట్టణంలో రాత్రివేళల్లో కఠిన నియమాలు అమలు చేస్తున్నట్లు సీఐ అన్వర్‌బాషా తెలిపారు. రాత్రి పదిన్నర తర్వాత ఎవరైనా ప్రత్యేకమైన కారణం లేకుండా బయట కనిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే వాహనాల తనిఖీలు ముమ్మరం చేసి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఎవరైనా మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

రోడ్ల నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలు

కందుకూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో కనీస నాణ్యత ప్రమాణాలు పాటించకుండా పెద్దఎత్తున అవినీతికి పాల్పడుతున్నారని వైసీపీ ఇంచార్జి బుర్రా మధుసూదన్‌యాదవ్ విమర్శించారు. బుధవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కరేడులో నిర్మించిన తారురోడ్డు నాలుగు రోజులకే లేచిపోయి గుంతలు పడిందంటే ఏమాత్రం నాణ్యతతో నిర్మించారో అర్థమవుతోందన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకుంటే ఉద్యమం చేపట్టనున్నట్లు తెలిపారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన కోటి సంతకాల సేకరణ నియోజకవర్గంలో విజయవంతమైందని తెలిపారు. బీపీసీఎల్ రిఫైనరీ వల్ల కాలుష్యం వెలువడుతుందని చేవూరు, రావూరు, చెన్నాయపాలెం ప్రజలు చేస్తున్న ఆందోళనను ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలన్నారు. ఇండోసోల్ సోలార్ పరిశ్రమకు సేకరించిన భూములను బీపీసీఎల్‌కు కేటాయించటం చట్టవిరుద్ధమన్నారు. ఈ సమావేశంలో నాయకులు షేక్ రఫీ, ఈదర రమేష్, అనుమోలు లక్ష్మీనరసింహం, నోటి వెంకటేశ్వర్లు, నున్నం పోతురాజు, గంగిరెడ్డి, ముప్పవరపు కిషోర్ పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్డీవో సమీక్ష


మాట్లాడుతున్న కావలి ఆర్డీవో సన్నీ వంశీ కృష్ణ

కావలి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులపై కావలి ఎన్నికల రిటర్నింగ్ అధికారి అయిన ఆర్డీవో ఎం.సన్నీ వంశీకృష్ణ బుధవారం తన చాంబరులో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. 2025 జనవరి 5వ తేదీన ప్రచురించిన ఓటర్ల జాబితా అనంతరం ఓటర్ల జాబితాలో చేర్పులు, తొలగింపులు, ఇతర మార్పులు గురించి ఆర్డీవో రాజకీయపార్టీల ప్రతినిధులకు వివరించారు. అనంతరం ఓటర్ల జాబితాకు సంబంధించి ఉన్న సమస్యలను వారిని అడిగి తెలుసుకున్నారు. దీంతో రాజకీయపార్టీల ప్రతినిధులు వెంగళరావునగర్ ప్రాంతంలో బౌండరీలు సక్రమంగా లేక ఓటర్లను గుర్తించటం కష్టంగా ఉందన్నారు. దీనిపై స్పందించిన ఆర్డీవో బౌండరీలను సరిచేసేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. ఓటర్ల గుర్తింపులో స్పష్టత కోసం సంబంధిత పోలింగ్ స్టేషన్లకు ఓటర్ల బదిలీ ప్రకియను చేపడతామని చెప్పారు.

భూముల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలి

జలదంకి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్వాధీన అగ్రిమెంటుల ద్వారా 2024 జూన్ 15లోపు కొనుగోలు చేసిన భూముల క్రమబద్ధీకరణకు సచివాలయం, మీసేవా కేంద్రాల్లో సాదాబైనామ కింద దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దారు సీతామహాలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రక్రియను 2027 డిసెంబరు 31లోపు కొనసాగించేలా రాష్ట్రప్రభుత్వం కాలపరిమితిని పెంచిందని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న 90 రోజుల లోపు హక్కుదారుని పేరున రెవెన్యూ రికార్డులలో నమోదు చయడంతో పాటు పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. చిన్న, సన్నకారు రైతులకు 2.5 ఎకరాల మాగాణి, 5 ఎకరముల మెట్ట భూములకు ఎలాంటి ఫీజు వసూలు చేయరని పేర్కొన్నారు. ఇది పట్టా భూములకు మాత్రమే చెల్లుతుందని తెలిపారు.

డీటీ వెంకట్రామిరెడ్డి బాధ్యతల స్వీకరణ

జలదంకి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ తహసీల్దారుగా పీ.వెంకట్రామిరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో డీటీగా ఉన్న జూలియాభాయ్ ఉద్యోగ విరమణ చేయడంతో సెలవులో ఉన్న వెంకట్రామిరెడ్డిని నియమిస్తూ కలెక్టర్ హిమాన్షుశుక్లా ఉత్తర్వులు ఇచ్చారు.

'శాంతి భద్రతల'పై రాజీ ఉండదు

- గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి


మాట్లాడుతున్న ఐజీ త్రిపాఠి

కావలి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి రాజీ లేకుండా పని చేస్తున్నట్లు గుంటూరు ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి తెలిపారు. ఎస్పీ అజిత వేజెండ్లతో కలిసి బుధవారం సాయంత్రం ఆయన కావలి పోలీస్ కమాండ్ కంట్రోల్ రూముకు వచ్చారు. కావలి సబ్‌డివిజనలోని పోలీస్‌స్టేషన్లలో లా అండ్ ఆర్డర్, క్రైమ్ రేటుపై సమీక్షించారు. అనంతరం ఐజీ మాట్లాడుతూ కావలి సబ్‌డివిజన్ పరిధిలో క్రైమ్ రేట్ తక్కువగా ఉందని, అన్ని పోలీస్‌స్టేషన్లలో గంజాయి, రౌడీ యాక్టివిటీలు కూడా తక్కువగా ఉన్నాయన్నారు. ఎస్పీ అజిత వేజెండ్ల మాట్లాడుతూ జిల్లాలో ప్రజలు ప్రశాంతంగా ఉండేలా లా అండ్ ఆర్డర్ నిర్వహణ ఉంటుందని తెలిపారు. గుంటూరు ఐజీ త్రిపాఠి వెళ్లిపోయిన అనంతరం ఆమె పట్టణంలో వాహనాల తనిఖీలను పర్యవేక్షించారు. గంజాయి, రౌడీయిజంపై పోలీస్ ఉక్కుపాదం మోపుతోందన్నారు. పోలీస్ తనిఖీలు ముమ్మరం చేసి ఓపెన్ డ్రింకింగ్ చేస్తున్నా, డ్రంక్ డ్రైవ్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. క్రైమ్ , నేరాలపై ఎక్కువ ఫోకస్ పెట్టి వాటికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి, రౌడీయిజం తదితర నేరాలకు సంబంధించి ఎలాంటి సమాచారం ఉన్నా నేరుగా తనకు ఫోన్ చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఫోన్ చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో కావలి డీఎస్పీ పీ. శ్రీధర్‌తో పాటు సబ్‌డివిజన్‌లోని సీఐలు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలి

- శిక్షణ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్

కావలి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పుర ప్రజలు తడి, పొడి చెత్తను వేరు చేసి తమ ఇంటి వద్దకు వచ్చిన మున్సిపల్ కార్మికులకు అందచేస్తే చెత్త నుంచి సంపద తయారు చేయవచ్చని మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్ తెలిపారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆదేశాల మేరకు బుధవారం కావలి మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో మెప్మా ఆర్పీలకు సామర్థ్యాల పెంపుపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ఘన వ్యర్థాల నిర్వహణ పురపాలక సంఘంలో ఎంతో కీలకమైనదని, వీటిని గురించి క్షుణ్ణంగా తెలుసుకుని ఆచరిస్తే చెత్త నుంచి సంపద పొందవచ్చన్నారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ కావలిగా తీర్చి దిద్దాలంటే అందరూ చెత్తను వేరుచేసి ఇవ్వాలన్నారు. స్వచ్ఛత విషయంలో అందరూ బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో తడి చెత్త, పొడిచెత్త, ప్లాస్టిక్ వేస్ట్, హానికర చెత్త నిర్వహణ గురించి అవగాహన కల్పించారు. ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ నుంచి రీసోర్స్ పర్సన్స్ ఆర్.రమాదేవి, వై.జయమాధురి, వీ.తిరుపతిరావు పాల్గొని శిక్షణ ఇచ్చారు. అనంతరం మున్సిపల్ కార్యాలయాన్ని ప్లాస్టిక్ ఫ్రీజోన్‌గా ప్రకటిస్తూ పోస్టర్స్ విడుదల చేశారు. ఈ రోజు నుంచి ప్లాస్టిక్ వాడకూడదని మున్సిపల్ అధికారులు, సిబ్బందికి స్టీల్ వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు.

పొగాకు సాగులో సస్యరక్షణతో అధిక దిగుబడి


మాట్లాడుతున్న వేలం నిర్వహణ అధికారి చంద్రశేఖర్

లింగసముద్రం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పొగాకు సాగులో సస్యరక్షణ పాటిస్తూ రసాయన అవశేష నిర్మూలన పాటిస్తే అధిక దిగుబడితోపాటు మంచి ధరను పొందవచ్చని 27వ వేలం కేంద్రం నిర్వాహన అధికారి చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని వీర్ కోట గ్రామంలో పొగాకు రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొగాకు పంటలో సీటీఆర్ఐ అధికారులు సూచించిన పురుగు మందులను మాత్రమే అవసరమైన మోతాదుల్లో పిచికారి చేయాలన్నారు. సీనియర్ గ్రేడింగ్ అధికారి రాజగోపాల్ మాట్లాడుతూ పురుగు మందుల అవశేషాలు, పొగాకు యేతర అన్యపదార్థాలు లేని పొగాకును పండించడం ద్వారా మంచి దిగుబడితో పాటు అధిక ధరలు పొందవచ్చన్నారు. ప్రస్తుతం అతర్జాతీయంగా వాతావరణ పరిస్థితుల కారణంగా బ్రెజిల్, చైనా దేశాలలో పొగాకు ఉత్పత్తి అధికంగా ఉందన్నారు. అందువలన ఈ సంవత్సరం మదేశంలో పొగాకు ధరలలో హెచ్చు తగ్గులు ఉండొచ్చన్నారు. రైతులు అధిక ధరకలు బ్యారెన్‌లను, పొలాలను కౌలుకు తీసుకొని పొగాకు పంటను సాగు చేసి నష్టపోవద్దన్నారు. ఐటీసీ మేనేజర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ తాము సరఫరా చేసే నేలలో కరిగే ఎరువులను అందరు ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జీపీఐ కంపెనీ ప్రతినిధి ఉన్నం శ్రీనివాసులు, క్షేత్ర సహాయకులు సిపీంద్రి, జోత్స్న, మౌష్మిన్, నాగేంద్ర, ఆశ్చర్యబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ర్యాలీ

బిట్రగుంట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కడనూతలోని ఆర్ఎస్ఆర్ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కొండబిట్రగుంటలో బుధ వారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం, గ్రామంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు చెత్త తొలగించి కాల్చివేశారు. వర్షపు నీరు నిల్వ ఉన్న చోట్ల, మురికి కాలువల్లో బ్లీచింగ్ చల్లారు. అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీఎస్ రెడ్డి మాట్లాడుతూ కొండబిట్రగుంటలో వారం రోజుల పాటు స్పెషల్ క్యాంప్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఏ.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉప్పుచెరువు ప్రాంత వాసులకు న్యాయం చేయాలి


సబ్‌కలెక్టరుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కందుకూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉప్పుచెరువు ప్రాంతంలో రోడ్లను ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ఆప్రాంతంలో రోడ్లను అభివృద్ధిచేసి ప్రజల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్‌బాబు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం సీపీఐ నాయకులు సబ్ కలెక్టరు దామెర హిమవంశీని కలిసి ఉప్పుచెరువుప్రాంత ప్రజల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ ఉప్పుచెరువు ప్రాం తంలో దాదాపు 20 ఏళ్ల నుంచి నివాసముంటు న్న ప్రజలకు రోడ్డు మార్గం లేకుండా కొందరు దురాక్రమణకు పాల్పడ్డారని, అడ్డుకున్న వారిపై ఆక్రమణదారులు దాడులకు తెగబడ్డారంటే పరిస్థితులు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవాలని విజ్ఞప్తిచేశారు. ఇరిగేషన్ చెరువును ఆక్రమించి ప్రైవేటు వ్యక్తులు వెంచర్లు వేసి ప్లాట్లు విక్రయిస్తున్నారని, ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకునే విషయంలో అధికారులు నిమ్మకునీరెత్తినట్లు ఉంటున్నారని ఫిర్యా దు చేశారు. టౌన్ ప్లానింగ్ అధికారులు పేదప్రజలకు ఒకన్యాయం, ధనవంతులకు మరో న్యా యం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఉప్పుచెరువు ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారం కోసం తక్షణం చర్యలు చేపట్టకుంటే స్థానికులతో కలిసి సీపీఐ పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు యర్రంశెట్టి ఆనంద్‌మోహన్, చేవూరి దుర్గాప్రసాద్, ఉప్పుటూరి మాధవరావు, బొల్లోజుల బాలబ్రహ్మచారి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

- రైతులను ఆదుకోవాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి రైతులను ఆదుకోవాలని, భూమిలేని కౌలురైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక సబ్ కలెక్టరు కార్యాలయం వద్ద బుధవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్‌బాబు మాట్లాడుతూ రైతులు పండించే ఏ పంటలకూ గిట్టుబాటు ధరలు దక్కటం లేదని, కేంద్రం ప్రకటించే మద్దతు ధరకు రాష్ట్ర ప్రభుత్వం బోనస్ కలిపి కొనుగోళ్లకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వేలకు వేలు పెట్టుబడులు పెట్టి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు రాక కోల్డ్‌స్టోరేజీలలో నిల్వపెట్టుకుని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. అనంతరం సబ్ కలెక్టరుకు వినతి పత్రం అందజేశారు.

టీకాలు వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయి


గర్భిణీకి మందులు అందచేస్తున్న డాక్టర్ ప్రతిమ

కావలి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలలకు వేసే టీకాలు షెడ్యూల్ ప్రకారం వేయించాలని, అవి అనేక ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ కల్పించి వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయని సర్వాయపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి పీ.ప్రతిమ తెలిపారు. కావలిరూరల్ మండలం చెన్నాయపాలెం, పాముగుంటపాలెం ప్రాథమిక పాఠశాలల్లో బుధవారం ఇమ్యునైజేషన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు, బాలలకు వ్యాక్సినేషన్, ఆరోగ్య అవగాహన కార్యక్రమం జరిగింది. అలాగే డాక్టర్ రామ్‌సెంటర్ విశ్వోదయ సహకారంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ పీ. ప్రతిమ మాట్లాడుతూ గర్భిణులు, బాలలు క్రమం తప్పకుండా షెడ్యూల్ ప్రకారం టీకాలు వేయించుకుంటే ధనుర్వాతం, గోరింత దగ్గు, పోలియో, మీజల్స్ గవదబిళ్లలు, రుబెల్లా, తట్టు, న్యూమోనియా వంటి అనేక రకాల వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయన్నారు. వైద్యశిబిరం అనంతరం ఐరన్, పోలిక్ కాల్షియం సిరప్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామ్‌సెంటర్ ఛైర్మన్ దొడ్ల మనోహర్ రెడ్డి, డైరెక్టర్ కే. తాతిరెడ్డి, ఏఎన్ఎంలువిజయమ్మ, పరిమళ తదితరులు పాల్గొన్నారు.



ఏడు గంగమ్మల పండుగ

శ్రీకాళహస్తిలో బుధవారం ఏడు గంగమ్మల జాతర వైభవంగా జరిగింది. ఏడు ప్రాంతాల్లోని అమ్మవార్ల దర్శనానికి భక్తులు పోటెత్తారు. రాత్రికి నిమజ్జనంతో జాతర ముగిసింది.

- 8లో

బుధవారం వేకువజామున వరుసగా వస్తున్న అమ్మవార్లు



పక్షుల పండుగ రెండు రోజులే..!

- ఇరకం, ఉబ్బలమడుగు సహా 7 ప్రాంతాల్లో నిర్వహణ

తడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట కేంద్రంగా ఏటా మూడు రోజుల పాటు అట్టహాసంగా జరిపే పక్షుల పండుగ ఈసారి రెండు రోజులే నిర్వహించనున్నట్లు సమాచారం. 2000 నుంచి ఏటా మూడు రోజుల పాటు పక్షుల పండుగ నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది సైతం పాత పద్ధతినే కొనసాగించారు. అయితే వచ్చే ఏడాది జనవరి 10, 11 లేదా 17, 18 తేదీల్లో పక్షుల పండుగ నిర్వహణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. అంటే రెండు రోజులే నిర్వహించనున్నారు. గత వారం కలెక్టరేట్‌లో జరిగిన సన్నాహక సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఇందుకోసం సుమారు రూ.3 కోట్లు ఖర్చవుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు. గతేడాది సూళ్లూరుపేట, నేలపట్టు, అటకానితిప్ప, బీములవారిపాళెం, శ్రీసిటీలో పక్షుల పండుగ జరపగా, ఈ దఫా ఇరకందీవి, వరదయపాళెం మండలంలోని ఉబ్బలమడుగు జలపాతం వద్ద కూడా నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఇరకందీవిలో కాట్ ఎయిర్ బెలూన్, ఏరో స్పోర్ట్స్, ఉబ్బలమడుగులో ట్రెకింగ్, జలపాతాల వీక్షణ తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలుస్తోంది. కాగా, పక్షుల పండుగకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం.



పరకామణి దొంగకు మరో రూలా?

మద్రాస్‌లో ఒక స్కూల్ ప్రిన్సిపాల్ రూ.1500 లంచం తీసుకున్నాడని సుప్రీంకోర్టు నాలుగు రోజుల కిందట రెండేళ్ల జైలు శిక్ష విధించింది. హెడ్మాస్టర్‌కి ఒక రూలా, పరకామణి దొంగకి ఒక రూలా? మాజీ ముఖ్యమంత్రికి ఒక రూలా, బడిపంతులకు మరొక రూలా? ఏమిటిది? టీటీడీలో ఎన్నో అవకతవకలు జరుగుతున్నాయి. వైకుంఠ ఏకాదశికి కాంగ్రెస్ ప్రభుత్వంలో స్థానికులకు ప్రత్యేక దర్శనాలు కల్పించాం. కూటమి ప్రభుత్వంలో ఇవ్వడం లేదు. టీటీడీ ప్రతిష్ఠ పెంచింది స్థానికులు. అయినా స్థానికులకు ప్రాధాన్యం లేదు.

- చింతా మోహన్, కేంద్ర మాజీ మంత్రి, తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో

56,710


- ఇంకా పంపిణీ కాని స్మార్టు రేషన్‌కార్డులు
- తీసుకోవడానికి గడువిక ఐదు రోజులే

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 56,710 స్మార్టు రేషన్ కార్డులు పంపిణీ కాకుండా మిగిలిపోయాయి. ఆయా లబ్ధిదారులు ఈ కార్డులు పొందాలంటే.. ఐదు రోజులే గడువు ఉంది. పౌర సరఫరాల శాఖలో కూటమి ప్రభుత్వం నూతన సంస్కరణలు తీసుకొస్తోంది. ఇందులో భాగంగా పాత రేషన్ కార్డుల స్థానంలో కొత్త స్మార్ట్ కార్డులు తీసుకొచ్చింది. క్యూఆర్ కోడ్‌తో కూడిన ఈ కార్డులను ఆగస్టు నుంచి పంపిణీ చేస్తుండగా, ఇంకా 56,710 మంది తీసుకోలేదు. వీరిలో చాలా మందికి ఫోన్లు చేసి చెబుతున్నా రావడం లేదని అధికారులు అంటున్నారు. వృద్ధులు, దివ్యాంగులకు మాత్రం రేషన్ డీలర్లు, సచివాలయ ఉద్యోగులు ఇళ్లకెళ్లి ఇస్తున్నారు. కాగా, ఇప్పటికీ స్మార్ట్ కార్డులను తీసుకోని వారికి ప్రభుత్వం ఈనెల 15 వరకు గడువు విధించింది. ఆ తర్వాత రూ.200 చెల్లించి చిరునామాతో సహా దరఖాస్తు చేసుకోవాలి. అప్పుడు కమిషనరేట్ నుంచి నేరుగా లబ్ధిదారుల చిరునామాకు స్మార్ట్ కార్డు పంపుతారు. ఇలా మిగిలిపోయిన స్మార్టు కార్డుల్లో అనర్హులవి ఎక్కువగా ఉన్నట్లు సమాచారం.

జిల్లాలో పలువురు తహసీల్దార్ల బదిలీలు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలువురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ బుధవారం రాత్రి కలెక్టర్ వెంకటేశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీకాళహస్తి తహసీల్దార్ జనార్దన్ రాజును తిరుపతి రూరల్ మండలానికి.. అక్కడ పనిచేస్తున్న రామాంజులు నాయక్‌కు కలెక్టరేట్ ఏవోగా పోస్టింగ్ ఇచ్చారు. ఏవో రమేష్ బాబును కలెక్టరేట్‌లోని ఇతర విభాగానికి బదిలీ చేశారు. కలెక్టరేట్ ఇ-సెక్షన్‌లో పనిచేస్తున్న లక్ష్మీనారాయణను బీఎన్‌కండ్రిగకు.. అక్కడి తహసీల్దారు శ్రీదేవిని సూళ్లూరుపేట ఆర్డీవో కార్యాలయానికి అటాచ్ చేశారు. శ్రీకాళహస్తి తహసీల్దార్‌ను రెండుమూడు రోజుల్లో నియమించనున్నారు.

ఫైళ్ల క్లియరెన్సులో చకచకా



గరిష్ఠంగా రెండున్నర రోజుల్లో క్లియర్

కలెక్టర్, జేసీ వద్ద జీరో పెండింగ్

తిరుపతి కలెక్టరేట్‌లో ఇ-ఆఫీసు ఫైళ్ల క్లియరెన్సు వేగంగా జరుగుతోంది. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ల వద్ద ఆరు నెలల కాలంలో పెండింగు పడిన ఫైళ్ళ సంఖ్య సున్నా. కలెక్టర్ వద్దకు వస్తున్న ఫైళ్ళను క్లియర్ చేయడంలో కనిష్ఠంగా ఒకటిన్నర రోజు నుంచీ గరిష్ఠంగా రెండున్నర రోజుల వ్యవధి తీసుకుంటున్నారు. ఫైళ్ల క్లియరెన్సులో మంత్రులు, సెక్రటరీలు (ఐఏఎస్), సెక్రటరియేట్ డిపార్ట్‌మెంట్ వారీగా, హెచ్‌వోడీస్‌లతో పాటు కలెక్టర్, జేసీలు ఏ స్థానంలో ఉన్నారో ప్రభుత్వం బుధవారం ప్రకటించింది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

గత మూడు నెలలు, ఐదు నెలల వ్యవధిలో రెండు దశలుగా ఫైళ్ల క్లియరెన్సు తీరును ప్రభుత్వం పరిశీలించింది. జిల్లాకు సంబంధించి గత సెప్టెంబరు 9వ తేదీ నుంచీ ఈనెల 9వ తేదీ వరకూ మూడు నెలల కాలంలో కలెక్టర్ వద్దకు 843 ఫైళ్లు రాగా వాటిలో 740 క్లియర్ అయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉండగా, ఒక్క ఫైలు కూడా పెండింగులో లేదు. ఈ ఫైళ్ళను క్లియర్ చేయడానికి సగటున కలెక్టర్ తీసుకున్న వ్యవధి 44 గంటల 16 నిమిషాలు. గత జూలై 15వ తేదీ నుంచీ ఇప్పటి దాకా ఐదు నెలల కాలంలో అయితే కలెక్టర్‌కు 3704 ఫైళ్లు వచ్చాయి. వీటిలో 3616 ఫైళ్లను క్లియర్ చేయగా మిగిలినవి వేర్వేరు దశల్లో వున్నాయి. ఈ వ్యవధిలో కూడా ఫైళ్ళ పెండింగు జీరో. కాగా ఫైళ్ల క్లియరెన్స్‌కు కలెక్టర్ సగటున తీసుకున్న వ్యవధి 57 గంటలు. కలెక్టర్‌కు పరిశ్రమలు, పర్యాటకం, ఇరిగేషన్, రోడ్డు ప్రాజెక్టులు, రైల్వే ప్రాజెక్టులు సహా అనేక శాఖలకు చెందిన కీలక ఫైళ్లు వస్తుంటాయి. ఇతర జిల్లాలతో పోలిస్తే తిరుపతి జిల్లాలో ఈ తరహా ఫైళ్లు కలెక్టర్ వద్దకు ఎక్కువ సంఖ్యలో వస్తుంటాయి. దానికి ఇక్కడి కలెక్టర్‌కు ప్రొటోకాల్ విధుల కోసం రోజులో అధిక సమయం కేటాయించే పరిస్థితి. అంత ఒత్తిడిలోనూ ఫైళ్ళ క్లియరెన్సు వేగంగా చేస్తుండడం గమనార్హం.

జేసీ వద్దా అదే స్పీడ్ : ఇక జాయింట్ కలెక్టర్ విషయానికి వస్తే గత మూడు నెలల్లో 110 ఫైళ్లు వచ్చాయి. వాటిలో 102 ఫైళ్లను క్లియర్ చేశారు. మిగిలినవి వివిధ దశల్లో వున్నాయి. జేసీ వద్ద ఫైళ్ల పెండింగ్ జీరో. అలాగే ఫైళ్ళు క్లియర్ చేయడానికి జేసీ తీసుకుంటున్న సగటు వ్యవధి 24 గంటల 11 నిమిషాలు. సాధారణంగా జేసీ వద్దకు భూసేకరణ, 22ఏ జాబితాకు సంబంధించిన భూముల ఫైళ్లు ఎక్కువగా వస్తాయి. ఇతర శాఖల నుంచీ వచ్చే ఫైళ్లు దాదాపుగా ఏమీ వుండవు. మొత్తమ్మీద జిల్లాలో ఇ-ఆఫీసు ఫైళ్ల క్లియరెన్సు త్వరితగతిన జరుగుతున్నట్టు ప్రభుత్వ నివేదిక స్పష్టం చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేసి వెల్లడించిన ఈ తరహా నివేదికల వల్ల ఇ-ఆఫీసు ఫైళ్ల క్లియరెన్సు మరింత వేగంగా జరిగే అవకాశముందని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అభిప్రాయపడ్డారు.

ఆ బాంబులు ఎప్పుడైనా పేలొచ్చు

- వ్యవసాయ కళాశాలకు మెయిల్.. ఇది నాలుగోసారి
- ఉత్తుత్తిదేనని తేల్చిన పోలీసులు



తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి):'వాష్‌రూములో ఏడు ఆర్డీఎక్స్ ఆధారిత పేలుడు పదార్థాలు పెట్టాం. అవి ఏ సమయంలోనైనా పేలొచ్చు' అంటూ తిరుపతిలోని వ్యవసాయ కళాశాలకు బుధవారం ఈమెయిల్ వచ్చింది. భయాందోళనకు గురైన అధికారులు వెంటనే తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందుకు సమాచారమిచ్చారు. పోలీసులు, డాగ్, బాంబు స్క్వాడ్‌లు కళాశాలలోని ప్రిన్సిపల్ సహా అన్నిచాంబర్లు, గదులు, హాస్టళ్లు, చుట్టు పక్కల ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. ఎక్కడా బాంబులు లేవని, ఫేక్ మెయిల్స్ అని తేల్చారు. కాగా, వ్యవసాయ కళాశాలకే బాంబు బెదిరింపు మెయిల్స్ రావడం ఇది నాలుగోసారి.తొలుత గతేడాది నవంబరు 17న, డిసెంబరు 18న, ఈ ఏడాది మే 28న, ఇప్పుడు తాజాగా.. వ్యవసాయ కళాశాలకు బెదిరింపులు రావడం గమనార్హం.

ప్రమాదంలో ప్రజాస్వామ్యం

- భారత రాజ్యాంగానికి ముప్పు
- ఓటు తొలగింపుతో రాజకీయ నరమేధం
- పౌర చైతన్యవేదిక సదస్సులో పరకాల ప్రభాకర్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

తిరుపతి(కల్చరల్), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రస్తుతం చోటుచేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందనే అభిప్రాయాన్ని ప్రముఖ ఆర్థికవేత్త, విశ్లేషకుడు పరకాల ప్రభాకర్ వ్యక్తం చేశారు. రాజ్యాంగానికి ముప్పు పొంచి ఉందని వ్యాఖ్యానించారు. తిరుపతి అఫీసర్స్ క్లబ్‌లో మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా పౌర చైతన్య వేదిక రాష్ట్ర తొలి సదస్సులో బుధవారం ఆయన మాట్లాడారు. 'రెండున్నరేళ్లుగా మణిపూర్ అట్టుడికిపోతోంది. చాలా మంది ప్రాణాలు కోల్పోగా మహిళలను నగ్నంగా ఊరేగించిన సంఘటనలు వెలుగుచూశాయి. ఇక దేశ ప్రధాన న్యాయస్థానంలో జడ్జిపై చెప్పు విసిరిన సంఘటన జరిగింది. అయినా దేశంలో స్పందన కరువైంది' అని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, పార్లమెంటులో ఆరు దశాబ్దాల కిందటి వందేమాతరం అంశం మీద మాత్రం పది గంటలు చర్చ జరిగిందని విమర్శించారు. ఎస్ఐఆర్ గురించి మాట్లాడుతూ, 'ఒకప్పుడు ప్రభుత్వాన్ని ఓటరు ఎన్నుకునేవారు. ఇప్పుడు ప్రభుత్వం ఓటరుగా ఎవరుండాలో ఎన్నుకుంటోంది' అన్నారు. తమ అనుకూలతల కోసం ఓటును తొలగించడం రక్తపాతంలేని రాజకీయ నరమేధంగా అభివర్ణించారు. ఇలా మాట్లాడే అవకాశం ఎప్పటికీ ఇలానే ఉంటుందన్న నమ్మకం కనిపించడం లేదన్నారు. ఏ క్షణమైనా లోపలకు వెళ్లిపోవచ్చు.. ఈ సభలకు వచ్చివారిలో కొంత మందికి కూడా ఆ పరిస్థితి రావచ్చేమోననే సందేహాన్ని పరకాల ప్రభాకర్ వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులపై పౌరులంతా కార్యరంగంలోకి రావాలి, లేకపోతే మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. సెంటర్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ డమోక్రటిక్ రైట్స్ అండ్ సెక్యులరిజం(సీపీడీఆర్ఎస్) జాతీయ ప్రధాన కార్యదర్శి కుంచె శ్రీధర్ మాట్లాడుతూ చొరబాటుదారులను ఏరివేయడానికి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) ఏర్పాటు చేశామని చెబుతున్న ఎలక్షన్ కమిషన్‌కు ఎవరు పౌరులో, ఎవరు కాదో తేల్చే బాధ్యత ఎవరిచ్చారని ప్రశ్నించారు. తప్పులపైన తప్పులు చేస్తూ ఎలక్షన్ కమిషన్ మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతోందన్నారు. పౌర చైతన్య వేదిక విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు ప్రొఫెసర్ కోలవెను చాంద్ ఎస్ఐఆర్‌ను ఉపసంహరించుకోవాలని, కర్నూలు జిల్లా అధ్యక్షులు ఓంకార్ వివాదాస్పద కార్మిక చట్టాలను వ్యతిరేకిస్తూ, తిరుపతి జిల్లా కార్యదర్శి ఏఎస్.పరమేశ్వర రావు పెగాసెస్ వైరస్‌ను పోలిన సంచార సాధి యాప్‌ను వ్యతిరేకిస్తూ ప్రవేశపెట్టిన తీర్మానాలను సదస్సులో ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ కార్యక్రమంలో పౌర చైతన్య వేదిక సభ్యులు, మేధావులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అప్పుడు క్రిస్టియన్.. ఇప్పుడు ఎస్సీ!

- పదవి కోసం మున్సిపల్ చైర్మన్ కుల ధ్రువీకరణలో మార్పులు

పుత్తూరు అర్బన్, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): పదవుల కోసం నిబంధనలకు విరుద్ధంగా కుల ధ్రువీకరణ మార్చుకున్న ఘటన పుత్తూరు మున్సిపాలిటీలో వెలుగు చూసింది. ప్రస్తుత మున్సిపల్ చైర్మన్ ఆనంగి హరి గతంలో క్రిస్టియన్‌గా కుల ధ్రువీకరణ పొంది మున్సిపల్ కౌన్సిల్ కోఆప్షన్ సభ్యుడిగా నియమితులయ్యారు. గత ప్రభుత్వంలో మున్సిపల్ చైర్మన్ పదవి ఎస్సీకి రిజర్వు కాగా, ఎస్సీ ధ్రువీకరణ పత్రాన్ని పొంది చైర్మన్ అయ్యారు. దీనిపై కలెక్టర్ వెంకటేశ్వర్‌కు ఫిర్యాదు వెళ్లడంతో విచారణకు ఆదేశించారు. క్రిస్టియన్‌గా జారీ చేసిన ధ్రువీకరణ పత్రం, తిరిగి ఎస్సీ ధ్రువీకరణ పత్రం జారీలో నిబంధనలు పాటించలేదని పుత్తూరు తహసీల్దార్ కలెక్టర్‌కు నివేదిక సమర్పించినట్లు తెలిసింది. ఈ నివేదిక మేరకు మున్సిపల్ చైర్మన్ పదవి నుంచి తొలగించాలని కలెక్టర్ పురపాలక శాఖ ఉన్నతాధికారులకు నివేదించినట్లు సమాచారం. మున్సిపల్ అధికారులకూ సమాచారం అందించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఆయన పదవి కూడా కోల్పోయే పరిఅనంతరం ఆయన పదవి కూడా కోల్పోయే పరిస్థితి నెలకొంది.

అక్కడ మిస్సింగ్.. ఇక్కడ హత్య

చంద్రగిరి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లెలో మిస్సింగ్ అయిన వ్యక్తి.. తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం శ్రీనివాసమంగాపురంలో హత్యకు గురయ్యారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. మదనపల్లె రూరల్‌కు చెందిన ఆవుల నరసిహులు, నాగరాజు, కత్తి నరసింహులు, నారాయణస్వామి.. చంద్రగిరి మండలం నరసింగాపురానికి చెందిన మునిరాజ స్నేహితులు. వీళ్లు తాంత్రిక వైద్యం, గుప్త నిధులు తవ్వకాలు చేస్తుంటారు. అయితే ఆవుల నరసింహులు.. తన భార్యతో సన్నిహితంగా ఉండటంపై నాగరాజు ఆగ్రహించాడు. ముందస్తు పథకం ప్రకారం అక్టోబరు 27వ తేదీన చంద్రగిరిలో తాంత్రిక వైద్యం చేయాలని ఆవుల నరసింహులు, నారాయణ స్వామి, కత్తి నరసింహులను మదనపల్లెలో బస్సు ఎక్కించి పంపించాడు. వాళ్లకు తెలియకుండా వెనక మరో బస్సు ఎక్కి శ్రీనివాసమంగాపురంలో నాగరాజు దిగాడు. నరసింగాపురంలోని మునిరాజకు ఫోన్ చేసి ద్విచక్ర వాహనం తీసుకురమ్మని చెప్పాడు. అనంతరం ఆవుల నరసింహులు ఒక్కడినే శ్రీనివాసమంగాపురానికి పిలిపించారు. ద్విచక్ర వాహనంలో అతడిని ఎక్కించుకుని.. మామిడి తోపులోకి నాగరాజు, మునిరాజ తీసుకెళ్లారు. అక్కడ హత్య చేసి, పూడ్చి వేశారు.ఆవుల నరసింహులు కనిపించడంలేదని మదనపల్లె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదైంది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా స్నేహితులనూ విచారించగా.. నాగరాజు, మునిరాజు హత్య చేసినట్లు తెలిసింది. దీంతో మదనపల్లె పోలీసులు గురువారం నిందితులను తీసుకొచ్చి మృత దేహానికి పోస్టుమార్టం నిర్వహించనున్నారు.



భైరివారిమండపం.. ముత్యాలమ్మ



పెండ్లిమండపం.. పొన్నాలమ్మ



గాంధీవీధి.. అంకమ్మ



కొత్తపేట.. భువనేశ్వరి





బ్రాహ్మణవీధి.. నల్లగంగమ్మ



జయరామరావువీధి.. కావమ్మ



సన్నిధివీధి.. అంకాలమ్మ

కొలువుదీరిన ఏడు గంగమ్మలు

- రాత్రి ఘనంగా నిమజ్జనం
- రోజంతా మొక్కులు చెల్లించుకున్న భక్తులు

శ్రీకాళహస్తికే ప్రత్యేకమైన ఏడు గంగమ్మల జాతర బుధవారం ఘనంగా జరిగింది. అమ్మవారి నామస్మరణతో పట్టణం మార్మోగింది. అమ్మవార్లు కొలువుదీరే ఏడు ప్రాంతాల్లో మూడు రోజుల ముందు నుంచే చలువ పందిళ్లు, విద్యుద్దీపాలతో అలంకరించారు. ఏడు ప్రాంతాల్లో అమ్మవారి ఉత్సవమూర్తులు మంగళవారం అర్ధరాత్రిపైన విశేష అలంకారంలో ఊరేగింపునకు సిద్ధం చేశారు. బుధవారం వేకువజామున మూడు గంటల ప్రాంతంలో ఏడుగంగమ్మలు వరుసగా శ్రీకాళహస్తి న్యాయస్థాన భవనం సమీపంలోని ఏడుగంగమ్మల ఆలయం వద్దకు చేరుకున్నాయి. కుంభం, ప్రత్యేక పూజల తర్వాత అమ్మవార్ల ముసుగు తొలగించి భక్తులకు దర్శనం కల్పించారు. మంగళవాయిద్యాలు, బ్యాండు మేళాలు, సాంస్కృతిక కళాబృందాల ప్రదర్శనలు, యువత చిందుల నడుమ ఏడుగురు అమ్మవార్లు ఒకరి వెనుక ఒకరు.. వరుసగా సాగారు. పలువురు అమ్మవార్లకు కుంభం, కోడిపుంజులు, వేటలు సమర్పించారు. పెండ్లిమండపం నుంచి ఎక్కడి ప్రాంతాల అమ్మవార్లు అక్కడకు వెళ్లి కొలువుదీరారు. పట్టణమంతా ఏడుగంగమ్మలు కొలువుదీరిన ప్రాంతాల్లో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది. ఎటు చూసినా భక్తజన సందడే కనిపించింది. పట్టణంలో ట్రాఫిక్‌ను మళ్లించారు. ఇక, పలువురు భక్తులు అమ్మవారికి అంబళ్లు పోశారు.

కన్నులపండువగా నిమజ్జనం

బుధవారం రాత్రి ఏడుగంగమ్మలు ఆయా ప్రాంతాల నుంచి తిరిగి ఊరేగింపుగా సాగారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ముత్యాలమ్మ ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆనవాయితీ ప్రకారం అక్కడ ఒక్కో అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం నిమజ్జనం నిర్వహించారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.3.96 కోట్లు
మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 70,901
తలనీలాలు సమర్పించినవారు: 23,128

తిరుమలలో నటి శ్రియ



సినీనటి శ్రియ బుధవారం వేకువజామున తిరుమల శ్రీవారి సుప్రభాతసేవలో పాల్గొన్నారు. తన కుమార్తె రాధా కోస్చీవ్, తల్లి నీరజతో కలిసి ఆమె శ్రీవారి దర్శనం చేసుకున్నారు. ఇంకా కర్ణాటక మాజీ మంత్రి కెఎస్ ఈశ్వరప్ప, ఐపీఎస్ అధికారి విశాల్ గున్నీ కూడా బుధవారం దర్శనం చేసుకున్న వారిలో ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

శ్రీవారికి కానుకగా రెండు కార్లు



తిరుమల, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారికి బుధవారం రెండు కార్లు కానుకగా అందాయి. తిరుపతికి చెందిన లోటస్ ఎలక్ట్రిక్ ఆటో వరల్డ్ ప్రైవేట్ లిమిటెట్ సంస్థ నుంచి అర్జున్ కొల్లికొండ అను భక్తుడు రూ.10 లక్షల విలువైన సిట్రాయెన్(ఈసీ3) ఎలక్ట్రిక్ కారును అందజేశారు. అలాగే చెన్నైకు చెందిన శరవనన్ కరుణాకరన్ అనే భక్తుడు రూ.9 లక్షల విలువైన సిట్రాయెన్ (బసాల్ట్ ఎక్స్ ప్లస్ యాంటీ) కారును విరాళంగా ఇచ్చారు. శ్రీవారి ఆలయం ముందు కార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి తాళాలను శ్రీవారి ఆలయ పేష్కార్ రామకృష్ణకు అందజేశారు.

ఫిర్యాదుల్లో రెవెన్యూ సమస్యలే అధికం



తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల్లో అత్యధికంగా రెవెన్యూ సమస్యలపైనే ఉంటున్నాయని, వాటి పరిష్కారానికి భరోసా కల్పించాలంటూ రెవెన్యూ అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్ వేదికగా బుధవారం జిల్లాలోని అన్ని విభాగాల రెవెన్యూ, ల్యాండ్ అండ్ సర్వే అధికారులతో ఆయన సమీక్షించారు. 'రెవెన్యూ అధికారులంటేనే సమస్యల పరిష్కారంలో కాలయాపన చేస్తారని అపవాదు ఉంది. దీనిని తొలగించాలంటే ప్రజలు ఇచ్చే ఫిర్యాదులపై తక్షణం స్పందించాలి. వాటి పరిష్కారానికి కృషి చేయాలి. అప్పుడే వారికి మనపై, ప్రభుత్వంపై నమ్మకం కలుగుతుంది. కొంతమంది తహసీల్దార్లు, సర్వేయర్ల వ్యవహార శైలిపై ఫిర్యాదులు వస్తున్నాయి. ఇకనైనా వారు పద్ధతి మార్చుకోకుంటే కఠినమైన చర్యలు తీసుకుంటాం. సకాలంలో కుల ధ్రువీకరణ పత్రాలు అందించాలి' అని కలెక్టర్ సూచించారు. రీసర్వే, 22ఏ, అసైన్‌మెంట్ ల్యాండ్స్, ఇనాం భూములు, పొజిషన్ సర్టిఫికెట్లు.. ఇలా పలు అంశాలపై కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, రోజ్మాండ్, ఆర్డీవోలు రామ్మోహన్, భానుప్రకాష్‌రెడ్డి, కిరణ్మయి, జిల్లా ల్యాండ్ అండ్ సర్వే అధికారులు అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

నెల్లూరులో కలపాలంటూ గూడూరులో విద్యాసంస్థల బంద్

గూడూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలపాలంటూ బుధవారం విద్యార్థి, యువజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ చేపట్టారు. సాధుపేటసెంటర్ వద్ద రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ నాయకులు మాట్లాడుతూ గూడూరును తిరుపతి జిల్లాలో కలపడం వల్ల జిల్లా కేంద్రంలోని కార్యాలయాలకు వెళ్లాలంటే ప్రజలు, ఉద్యోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు, యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో మనోజ్‌కుమార్, శశికుమార్, సునీల్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు. ఇక, టవర్‌క్లాక్ వద్ద జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు నాలుగో రోజూ కొనసాగాయి.

- శ్రీసిటీలో 'పేక్స్ ఇండియా'

నీటి నాణ్యత టెస్టింగ్ ల్యాబ్ ప్రారంభం



ల్యాబ్ ప్రారంభోత్సవం సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతున్న శ్రీసిటీ ఎండీ

సత్యవేడు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలోని పల్ప్ అండ్ పేపర్, ఫుడ్ అండ్ బెవరేజెస్, పెట్రో కెమికల్ రంగాలకు అధునాతన రియాక్టర్ భాగాలను తయారు చేస్తున్న పేక్స్ ఎన్విరాన్‌మెంటల్ టెక్నాలజీ ఇండియా ప్రైవేటు లిమిటెడ్(పీఈటీఐ)సంస్థ తమ ఆవరణలో ఏర్పాటు చేసిన అత్యాధునిక నీటి, మురుగునీటి నాణ్యత టెస్టింగ్ ల్యాబ్‌ని బుధవారం ప్రారంభించింది. ఈ సందర్భంగా శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ.. శ్రీసిటీని క్లీన్ అండ్ గ్రీన్ పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దే సంకల్పానికి ఇది మరో మైలురాయిగా అభివర్ణించారు. దీని ద్వారా పరిశ్రమలకు వేగవంతమైన, కచ్చితమైన, విశ్వసనీయ నీటి పరీక్ష సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. పేక్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సుదీప్ సంగమేశ్వరన్ మాట్లాడుతూ, ఈ కొత్త ల్యాబ్ మేక్ ఇన్ ఇండియా ఆలోచనకు అనుగుణంగా అత్యాధునిక టెస్టింగ్ సేవలను అందిస్తుందన్నారు. శ్రీసిటీ పరిశ్రమలు, ఇతర సంస్థలు ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ ల్యాబ్ గురించి ఆ సంస్థ వైస్ ప్రెసిడెంట్ (మాన్యుఫ్యాక్చరింగ్, అప్లికేషన్) గణేష్ చిదంబరం ల్యాబ్ గురించి వివరించారు. యూరోపియన్ ప్రమాణాలతో అభివృద్ధి చేసిన ల్యాబ్‌లో 30కిపైగా అంశాలలో నీరు, మురుగునీరుకు సంబంధించిన సర్టిఫైడ్ టెస్టింగ్ అందుబాటులో ఉందని తెలిపారు. ముఖ్యంగా ప్రత్యేక బయోకెమికల్ మీథేన్ పొటెన్షియల్(బీఎంపీ)టెస్టింగ్ ద్వారా పరిశ్రమలు బయోగ్యాస్ రికవరీ సామర్థ్యాన్ని పెంచుకోవచ్చన్నారు.

- ఎస్వీయూ బీటెక్ సెకెండ్ సెమిస్టర్

ఫలితాలు ఎప్పుడు?

మూడు నెలలైనా వెల్లడికాని వైనం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ రెండో సెమిస్టర్ పరీక్షల ఫలితాలు ప్రకటించకపోవడం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బీటెక్ కోర్సు మొదటి సంవత్సరానికి సంబంధించిన రెండవ సెమిస్టర్ పరీక్షలు ఆగస్టులో నిర్వహించారు. వివిధ బ్రాంచ్‌లకు సంబంధించిన సుమారు 430 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలుస్తోంది. పరీక్షలు పూర్తయి మూడు నెలలకు పైగా గడిచినా ఇంతవరకూ ఫలితాలు విడుదల చేయలేదు. ఇతర కాలేజీల్లో ఫలితాలు ప్రకటించేశారని ఇక్కడ మాత్రం ఎందుకు జాప్యం చేస్తున్నారని అంటున్నారు. కాగా ఆన్‌లైన్ ద్వారా జవాబు పత్రాల మూల్యాంకనం చేయడంతో ఆలస్యమవుతున్నట్లు సమాచారం. బీటెక్ నాలుగు, మూడవ సంవత్సరాలకు సంబంధించిన ఫలితాల విడుదలపై అధికార యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ఉంది. ఎందుకంటే, బీటెక్ నాలుగు, మూడు సంవత్సరాలకు చెందిన విద్యార్థులు ఇతర ఉన్నత విద్య, ఉద్యోగావకాశాల కోసం యూనివర్సిటీ వెలుపలకు వెళ్ళే అవకాశం ఉండడంతో నాలుగు, మూడో సంవత్సరం ఫలితాలను ముందుగా ఇస్తారని, ప్రాధాన్య క్రమంలో మిగతావి ఆలస్యం అవుతాయని అంటున్నారు. త్వరలోనే బీటెక్ సెకెండ్ సెమిస్టర్ ఫలితాలు ప్రకటిస్తామని యూనివర్శిటీ వర్గాలు చెబుతున్నాయి.

తిరుపతి నుంచి ఇండిగో విమానాలన్నీ నడుస్తున్నాయి

- ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ భూమినాథన్



వివరాలు వెల్లడిస్తున్న తిరుపతి ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ భూమినాథన్

రేణిగుంట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తిరుపతి విమానాశ్రయం నుంచి ఇండిగో విమానాల రాకపోకలు పూర్తి స్థాయిలో పునరుద్ధరించినట్లు తిరుపతి ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ డి.భూమినాథన్ తెలిపారు. డిసెంబరు 7వ తేదీ నుంచి విమానాశ్రయ కార్యకలాపాలు పూర్తిగా సాధారణ స్థితికి వచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం ఇండిగోకు చెందిన అన్ని విమానాలూ తిరుపతి నుంచి షెడ్యూల్ ప్రకారం నడుస్తున్నాయన్నారు. తిరుపతి విమానాశ్రయంలో బుధవారం ఆయన మీడియా సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. 5, 6 తేదీల్లో మాత్రం ఇండిగో విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందన్నారు. డిసెంబరు 5న తిరుపతి విమానాశ్రయానికి రాకపోకలు సాగించాల్సిన 24 విమానాల్లో 18 రద్దుకాగా 6 విమానాలు ఆలస్యంగా నడిచాయన్నారు. అలాగే డిసెంబరు 6న 2 విమానాలు రద్దుకాగా 10 విమానాలు ఆలస్యంగా నడిచాయని వివరించారు. ఈ అంతరాయం కేవలం ఇండిగో విమానాలకు మాత్రమే పరిమితమైందని, ఇతర విమానయాన సంస్థల కార్యకలాపాలు సాధారణంగానే కొనసాగాయని చెప్పారు. అయితే ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) తిరుపతి విమానాశ్రయం, ఇండిగో ఎయిర్‌లైన్స్ సంయుక్త కార్యాచరణ ప్రణాళికతో పూర్తిస్థాయిలో సహాయక చర్యలు చేపట్టినట్లు భూమినాథన్ తెలిపారు. ప్రయాణికులకు ఆహారం, తాగునీరు, వసతి, విమాన ఛార్జీల పూర్తి రీఫండ్, క్యాబ్ సౌకర్యం, ప్రత్యామ్నాయ ప్రయాణ ఏర్పాట్లు కల్పించినట్లు వివరించారు. ఈ మీడియా సమావేశంలో డీజీసీఏ డైరెక్టర్ దొరైరాజ్, సీఐఎస్ఎఫ్ కమాండెంట్ అనురాగ్‌యాదవ్ పాల్గొన్నారు.

జనగణమన జాతీయ గీతం అయ్యింది గాంధీ వల్లే

- నెహ్రూపై ఆరోపణలు అన్యాయం: చింతా మోహన్

తిరుపతి(ఎంఆర్‌పల్లె), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): 'జనగణమన జాతీయ గీతంగా మారింది మహాత్మా గాంధీ సూచనతోనే. చరిత్ర తెలియని మోదీ ఏదేదో మాట్లాడుతున్నారు' అని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ విమర్శించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, '1911లో కోల్‌కత్తాలో జరిగిన కాంగ్రెస్ సదస్సులో రవీంద్రనాథ్‌ఠాగూర్ జనగణమన బెంగాలీ గీతాన్ని ఆలపించారు. అది విన్న గాంధీ, ఠాగూర్‌ను మదనపల్లెకు వెళ్లి అనిబిసెంట్‌ను కలవమని చెప్పారు. అలా ఆయన మదనపల్లెలో ఆ గీతాన్ని ఇంగ్లీషులోకి అనువదించారు. అక్కడే బాణీ సమకూర్చారు' అని ఆయన వివరించారు. ఇది తెలియని మోదీ నెహ్రూ మరణించి 60 ఏళ్లు అవుతుంటే, ఇప్పుడు ఆరోపణలు చేయడం అర్థరహితమన్నారు. ప్రజలను తప్పుదారి పట్టించడం తగదని చింతా మోహన్ అన్నారు. టీటీడీ ప్రతిష్ఠ పెంచింది స్థానికులు, కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. అలాంటి టీటీడీ నేడు స్థానికులను చిన్నచూపు చూస్తోందన్నారు. ఇక బీజేపీ, టీడీపీకి బ్రేక్ దర్శనాల్లో కోటా ఇస్తున్నారంటూ తప్పుపట్టారు. 2004లో కాంగ్రెస్ చరిష్మాతో రాష్ట్రంలో గెలిచిందని, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వల్ల కాదన్నారు. కాంగ్రెస్ పార్టీ వల్ల పైకి వచ్చిన కుటుంబాల బిడ్డలు పార్టీకి నష్టం చేశారన్నారు. కాంగ్రెస్‌కు పూర్వవైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు యార్లపల్లి గోపిగౌడ్, రవి, తేజోవతి, శాంతియాదవ్, మునిశోభ, వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'టెట్'కు 92 మంది గైర్హాజరు

తిరుపతి(విద్య), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం జరిగిన టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్)కు 92 మంది గైర్హాజరైనట్లు డీఈవో కుమార్ తెలిపారు. ఉదయం 7 కేంద్రాల్లో పరీక్షకు 714 మందికి 659 మంది.. మధ్యాహ్నం 3 పరీక్ష కేంద్రాల్లో 297కి 260 మంది పరీక్షలు రాశారన్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించామని, బయోమెట్రిక్ హాజరు నమోదు చేశామని చెప్పారు.

ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు రిమాండ్

తిరుపతి (నేరవిభాగం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీలో లైంగిక వేధింపుల కేసులో అరెస్టయిన అసిస్టెంట్ ప్రొఫెసర్లు లక్ష్మణ్ కుమార్, శేఖర్‌రెడ్డికి బుధవారం రుయాస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం న్యాయమూర్తి ఎదుట పోలీసులు హాజరుపరచగా వారిని విచారించి ఈ నెల 23వ తేది వరకు రిమాండ్ విధిస్తూ తీర్పునిచ్చారు.



మంటలు చెలరేగిన కారు



పూర్తిగా దగ్ధమైన కారు

బయోట్రిమ్‌లో కారు దగ్ధం

మంగళం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం కరకంబాడిరోడ్డులోని బయోట్రిమ్‌లో బుధవారం పార్కింగ్ చేసి ఉన్న ఇన్నోవా కారు (కేఈ03 ఏఎం3699) ఇంజన్‌లో షార్ట్‌సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. బయోట్రిమ్‌లో హార్టికల్చర్ సెమినార్‌కు వరదయ్యపాళెం నుంచి కొందరు రైతులువచ్చారు. వారి కారును పార్కు చేసి సెమినార్‌లో పాల్గొన్నారు. ఉదయం 11.30గంటలకు కారులో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. బయోట్రిమ్ సిబ్బంది మంటలను ఆర్పడానికి ప్రయత్నించినా వీలు కాకపోవడంతో ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దాదాపు గంట పాటు శ్రమించి ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పేశారు. అప్పటికే కారు కాలిపోయింది. అలిపిరి పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

అమ్మవారి ఆలయంలో వైద్యురాలి పట్ల అనుచిత ప్రవర్తన

- దేహశుద్ధి చేసిన భక్తులు

తిరుచానూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి దర్శనానికి బుధవారం సాయంత్రం బెంగళూరుకు చెందిన ఓ యువ వైద్యురాలు కుటుంబసభ్యులతో కలిసి వచ్చారు. ఆలయం లోపల క్యూలైనులో వెళ్తుండగా తెలంగాణ రాష్ట్రం ఖమ్మంకు చెందిన రమేష్.. ఆ వైద్యురాలిపై చేయివేసి అనుచితంగా ప్రవర్తించాడు. ఆమె కేకలు వేయడంతో భక్తులు రమేష్‌ను క్యూలైను నుంచి వెలుపలకు లాక్కొచ్చి చితకబాదారు. అతడిని ఆలయ అధికారులు తిరుచానూరు పోలీసులకు అప్పగించారు. గతంలోనూ ఇతడు ఇదే తరహాలో ప్రవర్తించినట్లు పోలీసుల విచారణలో తేలినట్లు సమాచారం. ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా విజిలెన్సు అధికారులు క్యూలైన్లలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది.

పేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్లు



అన్న క్యాంటీన్‌లో భోజనం వడ్డించుకుంటున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పేదల ఆకలిని తీర్చేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం సమీపంలో గల అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. అక్కడ భోజనం చేస్తున్న వారితో మాట్లాడి నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే కూడా అక్కడే భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదలకు రూ.5కే భోజన సదుపాయం కల్పించడానికి అన్న క్యాంటీన్లను ప్రారంభిస్తే గత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వాటిని మూసివేసి పేదల కడుపు కొట్టిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించి రుచికరమైన ఆహారం అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, నాయకులు శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్ రహీమ్, మట్టం శ్రావణి, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, అల్లూరు కరుణాకర్‌రెడ్డి, గుండాల లీలావతి, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు పెంచండి



ఎమ్మెల్యే విజయశ్రీకి వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి విజయమ్మ తదితరులు

నాయుడుపేట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు పెంచాలని ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.విజయమ్మ అన్నారు. బుధవారం నాయుడుపేటలో ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీని కలిసి వినతిపత్రం అందజేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో మధ్యాహ్న భోజన కార్మికుల కష్టాలను గుర్తించి వేతనాలు పెంచారని, ప్రస్తుతం నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరుగుతుండడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. అలాగే మధ్యాహ్న భోజన కార్మికులకు పీఎఫ్, ఈఎస్‌ఐ తదితర సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి శివకవి ముకుంద, మధ్యాహ్న భోజన కార్మికుల జిల్లా అధ్యక్షురాలు పరిజయ, కె.వాణి, సుగుణమ్మ, భారతి పాల్గొన్నారు.

ఏకలవ్య గురుకులం విద్యార్థులకు పరామర్శ



విద్యార్థులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి

ఓజిలి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం వాకాటివారి కండ్రిగ వద్ద ఉన్న ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలో విద్యార్థులపై ఉపాధ్యాయుల దాష్టీకం సంఘటనపై సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య స్పందించారు. బుధవారం ఆయన వైసీపీ నాయకులతో కలిసి గురుకుల పాఠశాలను సందర్శించారు. బాధిత విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ప్రిన్సిపాల్ పవన్‌కుమార్ సింగ్‌తో మాట్లాడి విద్యార్థులను కొట్టిన ఉపాధ్యాయులపై తీసుకున్న చర్యల గురించి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన వసతి, సౌకర్యాలు కల్పించడంతో పాటు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. మాజీ ఎమ్మెల్యే వెంట ఎంపీపీ అరుణమ్మ, సర్పంచి కొండూరు ప్రభాకర్‌రాజు, వైసీపీ నాయకులు పాదర్తి హరినాథ్‌రెడ్డి, కిషోర్ యాదవ్, మధుసూదనరెడ్డి, అనిల్‌యాదవ్, సుందరయ్య, కాకాని రవి తదితరులు ఉన్నారు.

వరిలో జింకులోప నివారణతో అధిక దిగుబడులు

నాయుడుపేట టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వరిలో జింకు లోపాన్ని నివారిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయశాఖ అధికారి గణేష్ అన్నారు. మండలంలోని అన్నమేడు, కలిపేడు గ్రామాల్లో పొలాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



బహుమతులు అందుకున్న విద్యార్థులతో వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు

సూళ్లూరుపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని వీఎస్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు బుధవారం సాయి సేవా సమితి ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 'ప్రపంచంలో పరివర్తన రావాలంటే ముందు నీలో మార్పు రావాలి' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ విక్టోరియా రాణి, అధ్యాపకులు ప్రసాద్, ఏడుకొండలు, మాతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌జీవో సంఘ తాలూకా కార్యవర్గం ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఎన్‌జీవో నూతన కార్యవర్గం

వాకాడు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం వాకాడు తాలూకా కార్యవర్గ ఎన్నికలు బుధవారం ఏకగ్రీవంగా జరిగాయి. అధ్యక్షుడిగా తిరుమూరు కృష్ణయ్య, సహ అధ్యక్షుడిగా అఖిల్ యాదవ్, ఉపాధ్యక్షులుగా ప్రసాద్, కృష్ణారావు, రవీంద్రకుమార్, కార్యదర్శిగా శంకరయ్య, సంయుక్త కార్యదర్శులుగా సంపూర్ణ, మహేంద్ర, సురేష్, మహిళా సంయుక్త కార్యదర్శిగా సరోజనమ్మ, కోశాధికారిగా చిట్టెమ్మ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయించారు. ఎన్నికల అధికారులుగా తనూజ్‌కుమార్, శ్రీనివాసులు, లలిత్‌కుమార్ వ్యవహ రించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జీవో అసోసియేషన్ చైర్మన్ సురేష్‌బాబు, గూడూరు తాలూకా అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, నాయుడుపేట అధ్యక్షుడు గురుకుమార్, గూడూరు తాలూకా కార్యదర్శి తనూజ్‌కుమార్, తిరుపతి తాలూకా కోశాధికారి శ్రీనివాసులు, జిల్లా కమిటీ కోశాధికారి లలిత్‌కుమార్ పాల్గొన్నారు.

రేపు చిల్లకూరులో ప్రజాదర్బార్

గూడూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండల కార్యాలయంలో ఈనెల 12వ తేదీన ప్రజాదర్బార్ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై వినతులు అందజేయాలని కోరారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

డక్కిలి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం ఢీకొనడంతో వృద్ధుడు మృతి చెందిన ఘటన డక్కిలి మండలం లింగసముద్రం హరిజనవాడ వద్ద బుధవారం రాత్రి జరిగింది. లింగసముద్రం హరిజనవాడకు చెందిన వెంకట్రామయ్య(60) రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనం నడుపుతున్న యువకుడు శివకు గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముఖ్యమంత్రి హామీ నెరవేర్చేవరకు పోరాటం



టవర్‌క్లాక్‌సెంటర్ వద్ద రిలే దీక్షలో జేఏసీ నాయకులు

గూడూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గూడూరును నెల్లూరు జిల్లాలో కలుపుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని నెరవేర్చే వరకు జేఏసీ ఆధ్వర్యంలో శాంతియుతంగా పోరాటం సాగిస్తామని జేఏసీ కన్వీనర్ దశరధరామిరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక టవర్‌క్లాక్ సెంటర్ వద్ద జేఏసీ ఆధ్వర్యంలో నాలుగో రోజు రిలే దీక్ష నిర్వహించారు. బహుజన ఐక్యవేదిక నాయకులు మద్దతు ప్రకటించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ మాట్లాడుతూ గూడూరు ప్రజల మనోభావాలను పరిగణలోకి తీసుకుని నెల్లూరు జిల్లాలో కలపాలన్నారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ గూడూరును నెల్లూరు జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చారని, దానిని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో బహుజన ఐక్యవేదిక, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ అరాచకాలతోనే భూ సమస్యలు: కురుగొండ్ల



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

డక్కిలి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నేతల అరాచకాల వల్లే గ్రామాల్లో భూ సమస్యలు పెరిగిపోయాయని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పేర్కొన్నారు. బుధవారం డక్కిలి మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో భూముల రీ సర్వే గందరగోళంగా చేపట్టారని, రెవెన్యూ రికార్డులను సైతం తారుమారు చేసి వైసీపీ నేతలు భూ దోపిడీకి పాల్పడ్డారని ఆరోపించారు. ఫలితంగా భూ తగాదాలను పరిష్కరించుకోలేక రైతులు రోజూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం చర్యలు చేపట్టిందని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గుట్టు చప్పుడు కాకుండా కేసులు మాఫీ చేసుకొంటున్నారని వెంకటగిరి వైసీపీ ఇన్‌చార్జి నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి చేసిన విమర్శలు ఆయన తీవ్రంగా ఖండించారు. చంద్రబాబు నాయుడు రాజకీయాల్లో కడిగ ముత్యం అని అభివర్ణించారు. దేశంలో ఏ నాయకుడిపై లేనన్ని కేసులు జగన్‌పై ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. అనంతరం గురుకుల క్రీడా మైదానంలో ఉపాధ్యాయులకు క్రీడా పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోను రాజశేఖర్, వైస్ఎంపీపీ గడ్డం చంద్రశేఖరరెడ్డి, ఎంపీడీవో రవీంద్రబాబు, ఐసీడీఎస్ అధికారిణి షంషాద్ బేగం, ఎంఈవోలు జగదీష్ బాబు, వెంకటేశ్వర్లు, వ్యవసాయశాఖ అధికారిణి శిరీషా, వెంకటగిరి ఎస్ఐ ఏడుకొండలు, మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, లింగసముద్రం సొసైటీ అధ్యక్షుడు రంగినేని రాజా, రాష్ట్ర బ్లైండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పరుచూరి పెంచల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

గూడూరును నెల్లూరులో కలపాలని నిరసన



విద్యానగర్ గాంధీబొమ్మ సెంటర్‌లో అఖిలపక్ష నాయకుల నిరసన

కోట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ విద్యానగర్ గాంధీబొమ్మ సెంటర్ వద్ద బుధవారం ఎంవీరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో అఖిల పక్ష నాయకులు నిరసన తెలిపారు. గూడూరును తిరుపతి జిల్లాలో కలపడం వల్ల ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌కు వెళ్లాలన్నా అవస్థలు పడుతున్నారన్నారు. నెల్లూరు జిల్లాతో గూడూరుకు ఎంతో అనుబంధం ఉందని, నియోజకవర్గ ప్రజల మనోభావాలను, అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని నెల్లూరు జిల్లాలో విలీనం చేయాలని కోరారు. తిరుపతి వద్దు... నెల్లూరు ముద్దు అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంవీరావు ఫౌండేషన్ ప్రతినిధి లీలామోహన్ కృష్ణ, బీజేపీ సీనియర్ నాయకులు సారంగం రమేష్‌బాబు, విజయలక్ష్మి, ఆవుల సుబ్బయ్య, టీడీపీ నాయకులు బాబురావు, ధనంజయ, సుబ్రహ్మణ్యం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్ ప్రవీణ్, టీడీపీ నాయకులు రఫీ, నెలవల రాజేష్

నాయుడుపేట టౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో నివాసం ఉంటున్న బాలాజీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అతడి కుటుంబానికి 786 సేవాసంఘం తరపున రూ.50వేల నగదు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్‌కుమార్, టీడీపీ నాయకులు రఫీ, నెలవల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి



ఏవో రవికుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

సూళ్లూరుపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో నకిలీ విత్తనాలతో మోసపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. సీపీఐ నాయకుడు మోదుగుల పార్థసారధి మాట్లాడుతూ రైతులకు మేలురకం విత్తనాలని నమ్మించి నకిలీ విక్రయించి వందలాది మంది రైతులను మోసం చేసిన దుకాణ యజమానిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాల్లో దాదాపు 1500 ఎకరాల్లో వరి విత్తనాలు నాటిన 20రోజులకే వెన్ను తీయడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందజేసి, నకిలీ విత్తనాలు విక్రయించిన దుకాణ యజమాని, సరఫరా చేసిన కంపెనీపై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఏవో రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సుధాకర్ రెడ్డి, నాగేంద్ర, శ్రీనివాసులు, కుమార్, ఆనంద్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

150 మందికి కంటివైద్య పరీక్షలు

వాకాడు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వాకాడులోని ముస్లిం వీధిలో ఉన్న మోడల్ ప్రాథమిక పాఠశాలలో ఎంవీరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. రమేష్ ఐకేర్ ఆస్పత్రి నేతృత్వంలో 150 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంవీరావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలామోహన్‌కృష్ణ, కార్యదర్శి విజయలక్ష్మి ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్, రమేష్ ఐకేర్ సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంవీరావు ఫౌండేషన్ ప్రతినిధులు

108 సిబ్బందికి రెయిన్ కోట్ల పంపిణీ

గూడూరు అర్బన్, డిసెంబరు (ఆంధ్రజ్యోతి): స్థానిక రోటరీక్లబ్ ఆధ్వర్యంలో 108 అంబులెన్స్ వాహనంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి రెయిన్ కోట్లు పంపిణీ చేశారు. రోటరీ భవన్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో కార్యక్రమంలో వెంకటేశ్వర్లురెడ్డి, మల్లు విజయ్ కుమార్‌రెడ్డి, మునిగిరీష్, మయూరి శ్యామ్‌యాదవ్, దశరధరామిరెడ్డి, జీజీనాయుడు, హరిప్రసాద్, రామ్‌ప్రసాద్, కిరణ్‌కుమార్, సునీల్, మునెయ్య తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు దుప్పట్లు

సూళ్లూరుపేట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తంగేడు దిబ్బ, కారిజాత గిరిజన సెంటర్‌లోని గిరిజనులకు జనసేన నాయకులు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాలాంజనేస్వామి ఆలయ పాలకమండలి అధ్యక్షుడు వాకచర్ల రమేష్, బీజేపీ నాయకురాలు బెజవాడ విజయమ్మ, జనసేన నాయకులు ఆవుల రమణ, హరిబాబు, కోటి, దాసు, శంఖు సురేష్, సూరి పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాలు

చిల్లకూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిప్ప గుంటపాళెం గ్రామంలో పేదలకు బుధవారం రాజనేని రామా నాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యావసరాలు, కూరగాయలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామా నాయుడు, ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, శ్రీనివాసులురెడ్డి, సురేంద్రరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ తనిఖీలు



పోలీస్‌స్టేషన్‌లో వాహనాలను పరిశీలిస్తున్న డీఎస్పీ గీతాకుమారి

వెంకటగిరి రిటౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బాలాయపల్లి పోలీస్‌స్టేషన్‌ను గూడూరు డీఎస్పీ గీతాకుమారి బుధవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా పట్టుబడ్డ ద్విచక్ర వాహనాలను పరిశీలించి ఎస్ఐ గోపీని అడిగి వివరాలు తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలు పట్ల ఫ్రెండ్లీ పోలీస్ విధానాన్ని అనుసరించాలని సూచించారు.

లైన్ ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం

గూడూరు అర్బన్, డిసెంబరు (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖలో లైన్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ ఇటీవల పదవీ విరమణ చేసిన మహేశ్వరయ్యను ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్-1104 ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో నరేంద్రరెడ్డి, పరంధామయ్య, అనీల్‌కుమార్, ప్రసాద్, చిన్నయ్య, శ్రీనివాసులు, శ్రీధర్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ సరికాదు

నాయుడుపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల ప్రైవేటీ కరణ సరికాదని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. బుధవారం నాయుడుపేట పట్టణంలో వైసీపీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

వెంకటగిరి టౌన్: ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకంగా వెంకటగిరి నియోజకవర్గంలో 72వేల సంతకాలు సేకరించామని వైసీపీ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సేకరించిన కోటి సంతకాలను త్వరలోనే మాజీ సీఎం జగన్ ఆధ్వర్యంలో గవర్నర్‌కు అందజేస్తామని చెప్పారు.

గూడూరు: ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ నియోజకవర్గంలో 70 వేల సంతకాలను సేకరించామని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తెలిపారు. ఆ ప్రతులను బుధవారం తిరుపతికి తీసుకెళ్లారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని సైకిల్‌యాత్ర



సైకిల్‌యాత్రలో మీ-సేవ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నేతలు

గూడూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాంతాల్లోని ప్రభుత్వ మీ-సేవా కేంద్రాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ మీ-సేవ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన సైకిల్‌యాత్ర బుధవారం గూడూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు మాట్లాడుతూ గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పట్టణ ప్రాంతాల్లో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఇ-సేవ కేంద్రాలను ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి తమను తొలగించిందని చెప్పారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ మీ-సేవ కేంద్రాల్లో 18 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న 605 మంది ఉపాధి కోల్పోయారని తెలిపారు. ఈ విషయాన్ని యవగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేశ్‌కు వివరించగా, అధికారంలోకి వచ్చాక న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతి నుంచి అమరావతికి సైకిల్‌యాత్ర చేపట్టామన్నారు.

సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

సూళ్లూరుపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇన్ సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలంటూ బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జీజే రాజశేఖర్ మాట్లాడుతూ 2010కి ముందు డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులందరూ టెట్‌లో ఉత్తీర్ణత సాధించాలని, లేకపోతే ఉద్యోగం వదులుకోవాల్సి వస్తుందని చెప్పడం అన్యాయమన్నారు. 30 సంవత్సరాల సర్వీసు ఉన్న ఉపాధ్యాయులు టెట్ అర్హత సాధించాలనడం సరికాదన్నారు. అనంతరం తహసీల్దార్ గోపీనాథ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చీడపీడల నివారణపై దృష్టి పెట్టండి



కొక్కుపాడులో రైతులకు సూచనలిస్తున్న ఏవో సుచేంద్ర ప్రసాద్

కోట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చీడపీడల నివారణపై దృష్టి పెట్టాలని మండల వ్యవసాయ అధికారి సుచేంద్ర ప్రసాద్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కొక్కుపాడు, వంజివాక గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులతో కలిసి వరిపైర్లను పరిశీలించారు. ఆయా గ్రామాల్లో వ్యవసాయ అధికారులు రచ్చబండ సమావేశాలు నిర్వహించారు. వాతావరణ మార్పుల కారణంగా మంచు విపరీతంగా కురుస్తోందని, దీని వల్ల వరిపైర్లకు చీడపీడలు సోకే ప్రమాదం ఉందన్నారు. పొట్ట, చిరుపొట్టదశలో ఉండే వరిపైరుకు ఎక్కువగా వైరస్ సోకే అవకాశం ఉందని, రైతులు ఎప్పటికప్పుడు నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి సాయికుమార్, సహాయ వ్యవసాయ అధికారులు, రైతులు ఉన్నారు.

స్కేటింగ్ క్రీడాకారుడికి ఆర్థిక సాయం



హర్షవర్ధన్‌ను సన్మానిస్తున్న ఆచార్య భరద్వాజ సేవాసంస్థ ప్రతినిధులు

సూళ్లూరుపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్కేటింగ్‌లో ప్రతిభ కనబరిచిన బాలుడు హర్షవర్ధన్‌కి సూళ్లూరుపేటకు చెందిన ఆచార్య భరద్వాజ సేవాసంస్థ చేయూత ఇచ్చింది. బుధవారం తిరుపతిలోని శ్రీనివాస క్రీడా సముదాయంలో హర్షవర్ధన్, అతడి తల్లిదండ్రులను, కోచ్ ప్రతాప్‌ను ఆచార్య భరద్వాజ సేవాసంస్థ ప్రతినిధులు సన్మానించారు. రూ.25 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు మన్నెమాల శ్రీనివాసులు, అలవల భాస్కర్, ఆలపాటి అశోక్ కుమార్, రత్నబాబు, ఆర్ఎంవీ భాస్కర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

గూడూరు అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం కల్పించిన హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని న్యాయవాది అరవ పార్వతయ్య అన్నారు. బుధవారం స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో స్వేచ్ఛగా జీవించేలా రాజ్యాంగం పలు హక్కులను కల్పించిందని, వాటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు, కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విశ్వక్సేనారెడ్డి, హైమావతి, విద్యార్థులు పాల్గొన్నారు.